ఆగస్టు
2021

184

సంపుటి : 16 సంచిక : 3 వెల రు. 10/-

## ఈ సంచికలో........

పేదరికం నిర్మూలనలో చరిత్ర సృష్టించిన చైనా
తెలంగాణలో ఏం జరుగుతున్నది?
క్రీ. పూ. 700-350 మధ్య కాలంలో వివిధ సామాజిక దొంతరలు
అంతరిక్ష ప్రయివేటీకరణకు పోటీ
కోవిడ్19: ద్రవ్య పెట్టుబడికి గరిష్టలాభాలు
హిందూత్వ, హిందూమతం ఒకటి కాదు
రాజ ద్రోహం చట్టం: తిలక్ కేసు నుండి పాఠాలు నేర్వని ప్రభుత్వం
భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు

# భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు

**భా**షాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు జరిగిన పోరాటాలలో కమ్యూనిస్టులు మార్గదర్శకులుగా నిలిచారు. విశాలాంధ్ర,ఐక్య కేరళ పోరాటాలే కాక ఎంతోమంది కమ్యూనిస్టు,వామపక్ష నాయకులు సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలోప్రధాన పాత్ర పోషించారు; (సాధారణంగా దీనిని సమితి అని అంటారు) వీటి ఫలితంగానే మహారాష్ట్ర ఒక రాష్ట్రంగా ఏర్పడింది. ఇందుకు భిన్నంగా ఆర్ ఎస్ ఎస్, దాని అధినేత గోల్వాల్కర్ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకించారు. 1956 లో (రాష్ట్ర పునర్విభజన కమిషన్) భాషాప్రాతిపదిక రాష్ట్రాలను సిఫారసు చేసింది. అయితే మహారాష్ట్ర గుజరాత్ లను కలిపి ద్విభాషా రాష్ట్రంగా ఏర్పాటుచేయాలని సిఫారసు చేసింది. బొంబాయి కేంద్రం పరిపాలనా ప్రాంతంగా ఉండాలనింది. దీనితో పెద్ద పెద్ద ప్రదర్శనలు ఆ ప్రాంతాన్నంతటిని ఊపేసాయి. ఇతర ప్రాంతాలలో కూడా కమ్యూనిస్టులు వీరికి సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించారు. మహారాష్ట్రలో,ఈ పోరాట కాలంలో 106 గురు ప్రజలు రక్షక దళాల కాల్పులలో చంపబడ్డారు. చివరికి 1960 మే 1 వ్ తేదీ కేంద్రం దిగివచ్చి మహారాష్ట్ర మాట్లాడే ప్రజల కోసం బొంబాయి రాజధానిగాను, గుజరాతీ మాట్లాడే వారికి వేరొక రాష్ట్రాన్ని ఏర్పరచడానికి అంగీకరించవలసి వచ్చింది.

1954 లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ కి అంగీకరిస్తూ, పార్టీ అవగాహన కనుగుణంగా ఒక వివరణాత్మకమైన మెమోరాండాన్నితయారుచేసి, సమర్పించింది. అందులో కొన్ని భాగాలను ఇక్కడ పొందుపరుస్తున్నాము.

"భారత ప్రభుత్వం ఎట్టకేలకు రాష్ట్రాలను పునర్విభజించే సమస్యను పరిష్కరించేందుకు ఒక కమిషన్ ను నియమించడం హర్షణీయం. దేశంలో భాషల ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడాలని ప్రజలలో పెరుగుతున్న ఆందోళనలను ఇంకెంత మాత్రం విస్మరించడం సాధ్యంకాదని "ప్రభుత్వం ఇందుమూలంగా గుర్తించిందని మా అభిప్రాయం.

"కానీ ప్రధాన మంత్రి పార్లమెంటులో ప్రకటన చేస్తున్నప్పుడు, ఈ కమిషన్ కేవలం భాషా సంస్కృతులను మాత్రమే పరిగణనలోనికి తీసుకోదని ఆర్థిక స్వావలంబనను, పరిపాలనా సౌలభ్యాన్ని, దేశ సమైక్యతను, రక్షణ అంశాలను కూడా పరిశీలిస్తుందని ప్రకటించారు. సహజంగానే ఈ ప్రకటన ప్రజలలో అనుమానాలను రేకెత్తించిందిబీ ఈ కమిషన్ భాషాప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడకుండా చేయడానికి సాకులను వెతుకుతుందేమో అని ప్రజలు అనుమానించారు. కనీసం కొన్ని రాష్ట్రాల విషయంలో అయినా ఈ అనుమానం నిజమవుతుందని భయపడ్డారు.

"ఇప్పుడు రాష్ట్రాల ఏర్పాటుకు ఒక ప్రాతిపదిక ఉందన్న విషయం అందరూ అంగీకరించే విషయమే. ప్రధాన మంత్రి అంగీకరించినట్టు 'ఇది ఒక చారిత్రిక క్రమంలో, బ్రిటిష్ పాలకులు భారతదేశంలో తమ పాలనను విస్తరించుకుని, స్థిరపరచుకునే క్రమంలో జరిగింది. దానికి ప్రజాతంత్ర విధానాన్ని అభివృద్ధి చేయడం లో, పరిపాలనను సులభతరం చేయడంలో ఎటువంటి ప్రాధాన్యత లేదు. ఇది దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలలో పరస్పర వైషమ్యాలు పెరగడానికి దోహద పడింది. అందువలన ప్రజాతంత్ర ఉద్యమం విచ్చిన్నం అయింది.

"దేశంలో వివిధ ప్రాంత ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి, ప్రజాతంత్ర ఉద్యమాలను విచ్చిన్నం చేసేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు చేస్తున్న క్రమంలోనే భాషాప్రాతిపదిక రాష్ట్రాలు ఏర్పడాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. ఈ డిమాండ్ భారత ప్రజల ఐకమత్యాన్ని విచ్చిన్నం చేయలేదు, సరికదా ప్రజలను రాజకీయ ఆర్థిక సాంస్కృతిక జీవనం లో భాగస్వాములను చేసింది. దానితో దేశంలో ఐకమత్యం, లౌకిక తత్త్వం బలపడ్డాయి.

"అందువలన భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం జరిగిన పోరాటం స్వేచ్ఛకోసం, ప్రజాతంత్ర హక్కుల కోసం జరిగిన పోరాటంలో భాగమే. ప్రజలు ప్రజాతంత్ర వ్యవస్థ పునర్నిర్మాణంలో. ఆర్థిక జీవనంలో పూర్తిగా భాగస్వాములు కావాలంటే భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు తప్పనిసరి అని కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయం పడింది.అలా కాకపోతే, దేశం ఆర్థికంగా ప్రగతిని, అభివృద్ధిని సాధించలేదు. పైగా విభిన్న భాషలు మాట్లాడే అన్ని తరగతుల ప్రజలలో ప్రజాస్వామ్య సంస్కృతి అభివృద్ధి చెందా లంటే, వారి భాష, సాహిత్యం అభివృద్ధి చెందాలంటే, భాషాప్రాతిపదికన రాష్ట్రాల విభజన తప్పనిసరి. భారత దేశం ఐక్యం గా ప్రజాతంత్రయుతంగా నిర్మించబడాలి అంటే పటిష్టమైన, సురక్షితమైన పునాదిపై రాష్ట్రాల విభజన జరగాలి.అప్పుడే ఉమ్మడి అభివృద్ధికోసం ప్రయోజనాలకోసం, సమానత్వం కోసం, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తారు.

"1947 ఆగస్టులోబ్రిటిష్ పాలన అంతం అవగానే, ప్రజలు దేశ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవనంలో తమకు సంపూర్ణ భాగస్వామ్యం ఉండాలని ప్రజలు పట్టుబట్టడం సహజం. రాష్ట్ర విభజన భాషల ప్రాతిపదికన జరగాలనుకోనే కోరిక ప్రజాతంత్రయుతంగా దేశం ఉండాలనుకునే ప్రజలందరిలో ఉవ్వెత్తున ఎగసిపడిన కొరికే.

"దక్షిణ భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విభజించబడకుండా భాష ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడడం అసాధ్యమని, పార్టీ కేంద్ర కమిటీ భావిస్తున్నదనే మా అభిప్రాయాన్ని మీ ముందు ఉంచదలిచాము.

"ప్రస్తుతం అమలు లో ఉన్న ఏ ,బి.సి అనే విభజనలు పూర్తిగా తొలగించాలని కమిషన్ నిపార్టీ కేంద్రకమిటీ కోరుకుంటున్నది. భారతదేశ ప్రజల ప్రజాతంత్ర హక్కులలో ఎటువంటి హెచ్చుతగ్గులు ఉండకూడదు. 'రాజప్రముఖ' అనే సంస్థ ఉండకూడదని, వారికి ఎటువంటి ప్రత్యేక ప్రయోజనాలు కల్పించకూడదని కూడా కేంద్ర కమిటీ కోరుకుంటున్నది. అంతేకాక వారికిచ్చే రాజభరణాలు రద్దుచేయాలిబీ ఆ సంపద అంతా దేశ ఆర్థిక వనరులను పెద దోవ పట్టించి సంపాయించినదే గనక, సంస్థానాధీశుల వ్యక్తిగత సంపద అంటూ ఏమి ఉండకూడదుబీ ఆ సంపదంతా జాతీయం

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

1. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ................ 2

2. పేదరికం నిర్మూలనలో చరిత్ర సృష్టించిన చైనా
ట్రైకాంటినెంటల్ సంస్థ సర్వే నివేదిక ...... 4

3. తెలంగాణలో ఏం జరుగుతున్నది?
ఎస్ వీరయ్య ..........12

4. క్రీ. పూ. 700-350 మధ్య కాలంలో వివిధ సామాజిక దొంతరలు
ఎంవిఎస్ శర్మ .............14

5. అంతరిక్ష ప్రయివేటీకరణకు పోటీ
ఎస్ వెంకట్రావు............16

6. కోవిడ్19: ద్రవ్య పెట్టుబడికి గరిష్టలాభాలు
జాన్ బెల్లమి ఫాస్టర్ ..... ..18

7. హిందూత్వ, హిందూమతం ఒకటి కాదు
రొమిల్లా థాపర్ తో ఇంటర్వ్యూ.......26

8. రాజద్రోహం చట్టం: తిలక్ కేసు నుండి పాఠాలు నేర్వని ప్రభుత్వం
కులదీప్ శర్మ ............31



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 9490099333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# దేశ ద్రోహం

ప్రపంచీకరణ యుగంలో మన దేశంలో అనేక పదాలకు అర్థాలు మారిపోయినట్లే దేశ ద్రోహం, దేశ భక్తి అన్న పదాలకు కూడా అర్థాలు మారిపోయాయి. ముఖ్యంగా బిజెపి హయాంలో దేశాన్ని విదేశాలకు తాకట్టు పెడుతున్న వారు దేశ భక్తి అనే భుజకీర్తులు తగిలించుకుని అందలా లెక్కి పాలిస్తున్నారు. ప్రజల హక్కుల కోసం గొంతెత్తి నినదించేవారు, పోరాడేవారు దేశ ద్రోహులుగా ముద్రవేయబడుతూ జైళ్లలో మగ్గుతున్నారు. దేశంలో ముఖ్యంగా ఛత్తీస్‌ఘడ్‌లో గిరిజనుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన 84 ఏళ్ల వృద్ధుడు స్టాన్ స్వామిని దేశ ద్రోహం కేసులో అరెస్టు చేసి, జైలులోనే అత్యంత దుర్భర స్థితిలో ప్రాణాలు విడిచేట్లు చేసింది బిజెపి ప్రభుత్వం. ఈ ప్రభుత్వం దృష్టిలో రైతుల హక్కుల కోసం పోరాడేవారు, వారికి మద్దతుగా నిలిచిన యువతి దిశా రవి వంటివారు, మతతత్వ చిత్రహింసలకు గురవుతున్న దళితులు, మైనారిటీల తరపున నిలబడిన సామాజిక సేవకులు, జర్నలిస్టులు....వీరంతా దేశ ద్రోహులే. అధికార పీఠాలు అధిరోహించి ప్రయివేటీకరణ పేరుతో దేశ సంపదను విదేశీ సంస్థలకు దోచిపెడుతున్న వారు, స్వదేశీ బ్యాంకులను వేలకోట్ల మేరకు దోచుకున్న వారికి విమానం టిక్కెట్లు కొని విదేశాలకు పంపుతున్న వారు, విదేశీ సంస్థలతో రక్షణ కాంట్రాక్టుల పేరుతో వేలకు వేల దేశ ధనాన్ని బుక్కేస్తున్న వారు, చివరికి భారతీయుల మీద గూఢచర్యం నెరపడానికి విదేశీ గూఢచారి సంస్థలతో రహస్య ఒప్పందాలు చేసుకున్న వారు....వీరంతా దేశ భక్తులైపోవడం నేటి భారత దేశంలో విషాధంలో కెల్లా విషాధం.

విచిత్రమేమంటే దేశానికి నిత్యం ద్రోహం చేస్తున్న ఈ నాయకులు ప్రజా ఉద్యమకారులపైనా, నిరసన గళాలు వినిపించే వారిపైనా దేశద్రోహం కేసులు బనాయించడానికి కూడా విదేశీ పాలకులు తయారు చేసిన చట్టాలనే ఉపయోగించుకుంటున్నారు. స్వాతంత్ర పూర్వం దేశంలో బ్రిటిష్ పాలకుల అక్రుత్యాలను విమర్శించేవారి గొంతులు నొక్కడానికి ఎప్పుడో 1870లో బ్రిటిష్ వారు తెచ్చిన చట్టాన్ని ఉపయోగించుకుని బిజెపి ప్రభుత్వం నేడు దేశంలో తన పాలనను విమర్శించే వారిపై దేశద్రోహం కేసులు పెడుతోంది. భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 124ఎ ప్రకారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసమ్మతిని వ్యక్తం చేసినా, ధిక్కరించినా, దానికోసం ప్రయత్నించినా, ఇతరులను ప్రేరేపించినా దేశద్రోహం చేసినట్లే పరిగణించబడుతుంది. అంటే ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుంది కానీ దాన్ని ధిక్కరించి ఎవరూ మాట్లాడ కూడదన్న మాట. ఇది రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించిన ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛలను కాలరాసే చర్య.

ఆనాడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తన పత్రిక కేసరిలో వ్యాసాలు రాసిన బాల గంగాధర్ తిలక్‌పై వలస ప్రభుత్వం దేశద్రోహ చట్టం కింద అనేక మార్లు కేసులు పెట్టి, జైళ్లపాలు చేసింది. మహాత్మా గాంధీని ఈ చట్టం కింద శిక్షించింది. నేడు బిజెపి ప్రభుత్వం ఆ బ్రిటిష్ వారి చట్టాన్నే ఉపయోగించుకుని దేశ భక్తులను, ప్రజా పోరాట యోధులను జైళ్లపాలు చేస్తున్నది. తన మతతత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి నిరంకుశ పోకడలతో రాజ్యాంగ సంస్థలన్నిటినీ భ్రష్టు పట్టించిన బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం చివరికి చట్టాలను కూడా ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్నది. 2014లో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి 2019 వరకు అంటే నరేంద్ర మోడీ మొదటి దఫా పాలనలో దేశంలో326 దేశద్రోహం కేసులు నమోదు చేస్తే వాటిలో 141 కేసుల్లో మాత్రమే ఛార్జిషీటు నమోదు చేయగలిగారు, వాటిలో కూడా కేవలం 6 కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయి. అంటే చట్టాన్ని ఎంతగా దుర్వినియోగం చేశారో అర్థమవుతుంది. అందుకే ఈ పనికిమాలిన చట్టంతో ప్రజల రాజ్యాంగ హక్కులను కాలరాయడం తగదని సుప్రీం కోర్టు కూడా మాట్లాడాల్సి వచ్చింది. నిరసించే గొంతులను నొక్కేందుకు దేశం ద్రోహం కేసును దుర్వినియోగపరుస్తున్న దేశద్రోహులకు ప్రజా ప్రతిఘటనతోనే తగిన సమాధానం చెప్పాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# పేదరికం నిర్మూలనలో చరిత్ర సృష్టించిన చైనా

## ట్రైకాంటినెంటల్ సంస్థ సర్వే నివేదిక

**140** కోట్ల మంది జనాభాగల చైనాలో నిరుపేదరికం పూర్తిగా నిర్మూలించబడిందని 2021 ఫిబ్రవరి 25న చైనా ప్రభుత్వం ప్రకటించింది. 1949లో చైనా విప్లవం జయప్రదం అయినప్పటి నుండి అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం చేస్తూ వచ్చిన కృషికి ఇది ఒక మహత్తర విజయం. చైనాలో సోషలిజం నిర్మాణపు తొలి దశాబ్దాల్లో వేసిన పునాదిపై ఆధారపడి గత నాలుగు దశాబ్దాలుగా అనుసరించిన సంస్కరణల వల్ల సమకూరిన విజయం ఇది. ఈ కాలంలో చైనాలో 85 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి విముక్తి చెందారు. అంటే ప్రపంచంలో ఈ కాలంలో పేదరికం నుండి విముక్తి చెందిన ప్రజల్లో 70 శాతం మంది చైనాలోనే ఉన్నారు. ఇటీవలి కాలంలో అంటే 2013లో ప్రారంభమైన 'లక్షిత' పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా చైనా ప్రభుత్వం 24,600 కోట్ల డాలర్లు (సుమారు రూ. 18,45,000 కోట్లు) ఖర్చు చేసి 11 లక్షల కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు నిర్మించింది. 98 శాతం గ్రామాలకు ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించింది. 2.56 కోట్ల మంది ప్రజల ఇళ్లను పునర్నిర్మాణం గావించింది. మరో 96 లక్షల మందికి కొత్త ఇళ్లు నిర్మించింది. చైనాలోని 832 కౌంటీలు (జిల్లాలు), 1,28,000 గ్రామాల్లో మిగిలి ఉన్న 9.899 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి పూర్తిగా బయటపడేయడానికి 2013 నుండి ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థలనూ, సమాజంలోని వివిధ సెక్షన్ల ప్రజలను చైనా ప్రభుత్వం సమీకరించింది. వీరందరి సహకారంతో కరోనా మహమ్మారిని ఎందుర్కొంటూ కూడా పేదరికం నిర్మూలనలో తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించ గలిగింది.

2019లో చైనాలో పేదరిక నిర్మూలనా కార్యక్రమం చివరి దశలో ఉన్నప్పుడు ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ దీనిపై వ్యాఖ్యానిస్తూ.. "నేను చైనాను సందర్శించిన ప్రతిసారీ అక్కడ వస్తున్న మార్పులు, జరుగుతున్న అభివృద్ధిని చూసి నిర్ఘాంతపోతున్నాను. మీరు ప్రపంచంలోనే అత్యంత చురుగ్గా అభివృద్ధి సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థను సృష్టించారు. అదే సమయంలో 80 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి విముక్తి చేశారు. పేదరిక నిర్మూలనలో ఇది చరిత్రలోనే అతి పెద్ద విజయం" అని పేర్కొన్నారు.

ఒకవైపు చైనా పేదరికంతో పోరాడుతుంటే మిగిలిన ప్రపంచం, ముఖ్యంగా వర్ధమాన దేశాలు ఆర్థిక తిరోగమనంలో పడ్డాయి. 2020లో చైనా కాకుండా మిగిలిన అన్ని దేశాల్లోనూ పేదరికం నిర్మూలన వెనకపట్టు పట్టిందని ఐక్య రాజ్య సమితికి చెందిన వివిధ సంస్థలు తెలిపాయి. ఈ దేశాల్లో ముఖ్యంగా సహారా దిగువ ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లో గత ఏడాది 7.1 కోట్ల మంది పేదరికంలోకి దిగజారిపోయారు. ఆ విధంగా 1998 తరువాత ప్రపంచంలో మొదటి సారి పేదరికం తరగక పోగా పెరగడం సంభవించింది. కరోనా మహమ్మారి వల్ల మరింత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో 2030 నాటికి మరో 25 కోట్ల మంది ప్రజలు నిరుపేదరికంలోకి వెళ్లిపోతారని అంచనా. ఇలా ప్రపంచమంతా దిగజారిపోతున్న సమయంలో చైనా పేదరికాన్ని నిర్మూలించడం అనేది ఏదో యాదృచ్ఛికంగానో, లేదా ఒక అద్భుత శక్తుల పనిగానో జరగలేదు. చైనా ప్రభుత్వం సోషలిజానికి కట్టుబడి చేసిన కృషి ఫలితంగానే ఈ విజయం లభించింది. పెట్టుబడిదారీ దేశాల్లో పేద ప్రజలు, కార్మికవర్గం పరిస్థితి ముఖ్యంగా కరోనా మహమ్మారి కాలంలో తీవ్రంగా దిగజారి పోయిన పరిస్థితుల్లో చైనాలో పేదరికం నిర్మూలించబడడం సోషలిజం విశిష్టతను కళ్లకు కడుతోంది.

చైనాలో సోషలిజం నిర్మాణంలో పేదరికాన్ని నిర్మూలించడం అనేది ఒక ప్రాథమిక మెట్టు. చైనా భాషలోనూ, ఇంగ్లీషులోనూ ప్రచురించబడిన అనేక పత్రాల ఆధారంగా చైనాలో పేదరికం నిర్మూలనపై ట్రైకాంటినెంటల్ సంస్థ ఒక అధ్యయనం జరిపింది. ట్రైకాంటినెంటల్ అనేది అంతర్జాతీయంగా ప్రజల ఆశలు, ఆలోచనలపై కేంద్రీకరించి చర్చ నిర్వహించే ఒక ఉద్యమ సంస్థ. ఈ సంస్థ అధ్యయనం అయిదు భాగాలుగా విభజించబడింది. మొదటిది, చారిత్రక సందర్భం, రెండోది పేదరకం నిర్మూలన: సిద్ధాంతం, ఆచరణ, మూడు, లక్షిత పేదరిక నిర్మూలన, నాలుగు, కేస్ స్టడీస్, అయిదు, ముందున్న సవాళ్లు, అవకాశాలు. అధ్యయనంలో భాగంగా ట్రైకాంటినెంటల్ ప్రతినిధులు చైనాలో పేదరికం నిర్మూలించబడిన ప్రాంతాలను సందర్శించడమే కాకుండా అనేక మందితో ఇంటర్వ్యూలు కూడా చేశారు. ముఖ్యంగా వారు గీఝౌ రాష్ట్రంలో పేదరికం నుండి విముక్తి చేయబడిన చివరి తొమ్మిది కౌంటీలకు వెళ్లి అధ్యయనం చేశారు.

### 1. చారిత్రక సందర్భం

1949 అక్టోబర్1న చైనా విప్లవం విజయం సాధించి ప్రజా రిపబ్లిక్కుగా ఏర్పడింది. దానికి ముందు శతాబ్ద కాలంలో యుద్ధ ప్రభువులు, భూస్వాముల పాలనా కాలంలో చైనా ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానం నుండి ప్రపంచంలోనే అతి పేద దేశంగా దిగజారిపోయింది. 19వ శతాబ్దంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మూడో వంతుగా ఉన్న చైనా జిడిపి, విప్లవం వచ్చే నాటికి

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 5 శాతానికి దిగజారిపోయింది. 1949లో విప్లవం విజయం సాధించే నాటికి దేశం ప్రపంచంలోని అతి పేద దేశాల్లో 11 వదిగా ఉండేది. కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ఎదురైన మొదటి సవాలు పేదరికంలో మగ్గుతున్న రైతులు, కార్మికుల మౌలిక అవసరాలు తీర్చడం, దీర్ఘకాలంగా దిగజారిపోతున్న చైనా ఆర్థిక, సామాజిక వ్యవస్థను చక్కదిద్ది పురోగతిలో పెట్టడం.

1949 నుండి 1976 వరకు మావో నాయకత్వంలో చైనా ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంపై కేంద్రీకరించింది. ఈ మూడు దశాబ్దాల్లో చైనా జనాభా 54.2 కోట్లు నుండి 93.7 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో తొలుత ఉత్పత్తి సాధనాలను ప్రయివేటు చేతుల్లో నుంచి ప్రజల చేతుల్లోకి మార్చడం, భూస్వాముల నుండి, యుద్ధ ప్రభువుల నుండి భూములు స్వాధీనం చేసుకుని పేద రైతులకు పంచడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం కృషి చేసింది. ఎందుకంటే పేదరిక నిర్మూలన అనేది వర్గ పోరాటంలో భాగమే. 1956వ సంవత్సరం వచ్చేసరికి చైనాలోని 90 శాతం భూమి దున్నేవారి చేతుల్లోకి వచ్చింది. వ్యవసాయ సహకార సంఘాల్లోకి 100 శాతం రైతులను సమీకరించారు. ప్రయివేటు పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా రద్దు చేశారు. భూమిని సమిష్టి క్షేత్రాలుగా మార్చారు. ప్రజా కమ్యూన్‌లు ఈ సమిష్టి క్షేత్రాలను, సమిష్టి ఉత్పత్తి సాధనాలను నిర్వహించేవి. సమిష్టి సంపదను అందరికీ పంచారు. వ్యవసాయంలో వచ్చే అదనపు మిగులును పారిశ్రామికాభివృద్ధికీ, సాంఘిక సంక్షేమానికీ ఉపయోగించేవారు.

> **❝ ఈ కాలంలో అంటే 1949 నుండి చైనాలో సంస్కరణలు ప్రవేశపెట్టిన 1978 వరకు 29 సంవత్సరాల కాలంలో చైనా ప్రజల జీవన వయోపరిమితి 32 ఏళ్లు పెరిగింది. 1949లో దేశంలోని ప్రజల్లో 80 శాతం నిరక్షరాశ్యులుగా ఉండేవారు. 1978 నాటికి అంటే మూడు దశాబ్దాలకన్నా తక్కువ కాలంలో నిరక్షరాశ్యతను పట్టణాల్లో 16.4 శాతానికీ, గ్రామీణ ప్రాంతాల్లో 34.7 శాతానికీ తగ్గించారు. ❞**



గీఝౌ రాష్ట్రంలోని టోంగ్రెన్ నగరంలో పునరావాసం కల్పించిన పేదల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన దుస్తుల ఫ్యాక్టరీ

ఈ కాలంలో అంటే 1949 నుండి చైనాలో సంస్కరణలు ప్రవేశపెట్టిన 1978 వరకు 29 సంవత్సరాల కాలంలో చైనా ప్రజల జీవన వయోపరిమితి 32 ఏళ్లు పెరిగింది. ఇంకో మాటలో చెప్పాలంటే విప్లవం తరువాత గడిచిన ప్రతి ఏటా చైనాలో ఒక్కో వ్యక్తి జీవిత కాలం ఒక ఏడాది కన్నా ఎక్కువ పెరుగుతూ వచ్చింది. 1949లో దేశంలోని ప్రజల్లో 80 శాతం నిరక్షరాశ్యులుగా ఉండేవారు. 1978 నాటికి అంటే మూడు దశాబ్దాలకన్నా తక్కువ కాలంలో నిరక్షరాశ్యతను పట్టణాల్లో 16.4 శాతానికీ, గ్రామీణ ప్రాంతాల్లో 34.7 శాతానికీ తగ్గించారు. పాఠశాల వయసు పిల్లల బడిలో చేరిక 20 శాతం నుండి 90 శాతానికి పెరిగింది. ఆసుపత్రుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. విద్య, వైద్య సదుపాయాలను ధనికులు నివసించే పట్టణ ప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాలకు వికేంద్రీకరించడం వల్ల ఈ విజయాలు సాధ్యమైనాయి. ఇందులో భాగంగా కార్మికులు, రైతుల కోసం మాధ్యమిక పాఠశాలలు తెరిచారు. లక్షలాది మంది తాత్కాలిక శిక్షణ పొందిన డాక్టర్లను గ్రామీణ ప్రాంతాలకు పంపారు. సామాజిక కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. వివాహంలో పితృస్వామిక ఆధిపత్య పద్ధతులను నిషేధించారు. మహిళలకు విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చారు. 1952 నుండి 1977 మధ్య సగటు పారిశ్రామికాభివృద్ధి 11.3 శాతం ఉండేది. 1949లో దేశంలో ఒక్క కారును కూడా తయారు చేయలేని స్థితి నుండి చైనా సాంకేతిక ఉత్పత్తి సామర్థ్యం 1970లో తొలిసారి అంతరిక్షంలోకి ఉపగ్రహాన్ని పంపే స్థాయికి ఎదిగింది. 'డాంగ్‌ఫాంగోంగ్' (తూర్పున అరుణోదయం) పేరుతో ఉన్న ఈ ఉపగ్రహం 28 రోజుల పాటు కక్ష్యలో తిరుగుతూ విప్లవ గీతాన్ని వినిపించేది. సోషలిజం నిర్మాణంలో మావో కాలంలో సాధించిన పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక విజయాలు 1978 తరువాతి కాలానికి ఒక మంచి పునాదిగా తోడ్పడ్డాయి.

1970 దశకం నాటికి చైనా ఆర్థిక వ్యవస్థలో ఆధునిక సాంకేతికత, పెట్టుబడి చొప్పించాల్సిన అవసరం వచ్చిందని స్పష్టమైపోయింది. అదే విధంగా ప్రపంచ మార్కెట్ నుండి వేరుపడి ఉన్న చైనా ఆర్థిక వ్యవస్థను ఆ వేర్పాటు నుండి బయటపడేయాల్సిన అవసరం కూడా వచ్చింది. 'పేదరికం సోషలిజం కాదు, కమ్యూనిజం అంతకన్నా కాదు' అని చైనా నేత డెంగ్ సియావో పింగ్ తరువాతి కాలంలో రాశారు. అప్పటి నుండి చైనా ప్రభుత్వం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టింది. దేశ ఆర్థిక వ్యవస్థను బయటి ప్రపంచానికి తెరిచింది. అయితే చైనా సోషలిస్టు దేశం గనుక

> **“1978 నుండి 2017 మధ్య చైనా ఆర్థిక వ్యవస్థ సగటున ఏడాదికి 9.5 శాతం చొప్పున అభివృద్ధి చెందింది. అయితే ఆర్థికాభివృద్ధి దానికదే కొలబద్ద కాదు. ఆర్థికాభివృద్ధి వల్ల ప్రజల జీవన ప్రమాణాలు ఎంత పెరిగాయి అన్నది కొలబద్ద. ఏడాదికి 2,300 యువాన్లు (రూ. 26,000) తలసరి ఆదాయానికి దిగువన ఉన్న వారిని పేదలుగా లెక్కించారు. దీని ప్రకారం 1978 నుండి 2011 మధ్య కాలంలో చైనాలో పేదల సంఖ్య 77 కోట్లు (జనాభాలో 80 శాతం) నుండి 12.2 కోట్లకు (9.1శాతానికి) తగ్గిపోయింది.”**

అక్కడ ప్రభుత్వ రంగానిదే పైచేయిగా ఉంది, విదేశీ నియంత్రణ నుండి దూరంగా ఉంది.

ఈ కాలంలో చైనా ఆర్థిక వ్యవస్థ చరిత్రలో ఎన్నడూ లేని వేగంతో పురోగమించింది. 1978 నుండి 2017 మధ్య చైనా ఆర్థిక వ్యవస్థ సగటున ఏడాదికి 9.5 శాతం చొప్పున అభివృద్ధి చెందింది. అంటే ఈ కాలంలో 35 రెట్లు పెరిగింది. అయితే ఆర్థికాభివృద్ధి దానికదే కొలబద్ద కాదు. ఆర్థికాభివృద్ధి వల్ల ప్రజల జీవన ప్రమాణాలు ఎంత పెరిగాయి అన్నది కొలబద్ద. ఏడాదికి 2,300 యువాన్లు (సుమారు రూ. 26,000) తలసరి ఆదాయానికి దిగువన ఉన్న వారిని పేదలుగా లెక్కించారు. దీని ప్రకారం 1978 నుండి 2011 మధ్య కాలంలో చైనాలో పేదల సంఖ్య 77 కోట్లు (జనాభాలో 80 శాతం) నుండి 12.2 కోట్లకు (9.1శాతానికి) తగ్గిపోయింది.

అయితే ఈ శీఘ్రాభివృద్ధి వల్ల దేశంలో అనేక సామాజిక, పర్యావరణ పరమైన ఇబ్బందులు తలెత్తాయి. పట్టణాలకు పెద్ద ఎత్తున వలసలు పోవడం వల్ల పట్టణ గ్రామీణ ప్రజల మధ్య అంతరాలు పెరిగాయి. తూర్పు తీర ప్రాంత పారిశ్రమల మీద కేంద్రీకరించినందున పశ్చి, కేంద్ర ప్రాంతాలు అభివృద్ధిలో వెనుకబడిపోయాయి. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం చైనా గినీ కోఎఫిసెంట్ (ఆదాయంలో అసమానతలు కొలిచే సూచీ) 1981లో 29 శాతం నుండి 2007 నాటికి 49 శాతానికి పెరిగిపోయింది. తరువాత 2012 నాటికి 47 శాతానికి తగ్గింది. ఈ కాలంలో పెన్షన్లు, సామాజిక బీమా, విద్య, వైద్య సదుపాయాలు వంటివి ప్రజలకు లభించడంలో తీవ్రమైన అసమానతలు తలెత్తాయి. వాతావరణ పరంగా చూస్తే శీఘ్ర అభివృద్ధి వల్ల దేశంలోని వాయువు, నీళ్లు, నేల కాలుష్యం పెరిగింది. అందువల్ల 2013లో అధికారం చేపట్టిన అధ్యక్షుడు సి జిన్‌పింగ్ ముందు ఈ అసమానతలు రూపుమాపడం ఒక పెద్ద సవాలుగా నిలిచింది. 2017లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) 19వ జాతీయ మహాసభలో జిన్‌పింగ్ మాట్లాడుతూ సోషలిజం యొక్క నూతన యుగంలోకి చైనా ప్రవేశించిందని, దాంతో చైనా సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన వైరుధ్యం పరివర్తన చెందిందని చెప్పారు. ఆయన ఇలా పేర్కొన్నారు:

“చైనా లక్షణాలతో కూడిన సోషలిజం కొత్త శకంలోకి ప్రవేశించడంతో చైనా సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన వైరుధ్యం పరివర్తన చెందింది. ఈ రోజు మనం అసమతుల్యమైన, సరిపోని అభివృద్ధికీ, మరింత ఉన్నతమైన జీవనం కోసం ప్రజల్లో నిరంతరం పెరుగుతున్న అవసరాలకూ మధ్య వైరుధ్యాన్ని ఎదుర్కొంటున్నాం. చైనాలో 100 కోట్ల మందికి పైగా ప్రజల కనీసావసరాలు తీర్చడం జరుగుతోంది. ప్రజలు గౌరవప్రదమైన జీవనం సాగించగలుగుతున్నారు. త్వరలోనే దేశం ఒక మోస్తరు అభివృద్ధి చెందిన దేశంగా మారబోతోంది. ప్రజల జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు జరిగే ప్రయత్నాల్లో వారి అవసరాలు నిరంతరాయంగా పెరుగుతున్నాయి. వారి భౌతిక, సాంస్కృతికావసరాలు పెరగడమే కాదు ప్రజాస్వామ్యం, చట్టబద్ద పాలన, భద్రత, మంచి వాతావరణం కోసం కూడా డిమాండ్లు పెరుగుతున్నాయి. అదే సమయంలో చైనాలోని మొత్తం ఉత్పత్తి శక్తులు గణనీయంగా అభివృద్ధి సాధించాయి. అనేక విషయాల్లో మన ఉత్పత్తి సామర్థ్యం ప్రపంచంలోనే ఉన్నత స్థాయిలో ఉంది. అయితే మనం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఏమంటే మన అభివృద్ధి సమతుల్యంగా, సరిపోని విధంగా ఉంది. మరింత మెరుగైన జీవన ప్రమాణాల కోసం ప్రజల అవసరాలను తీర్చడంలో ఇది ప్రధాన అవరోధంగా ఉంది.

అందువల్ల ఆధునిక సోషలిస్టు సమాజ నిర్మాణానికి సంస్కరణలు, ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరవడం అనేది ఒక ముందస్తు షరతుగా మారింది. ఈ కాలంలోనే మనం అధికారికంగా ప్రకటించిన మూడు వ్యూహాత్మక లక్ష్యాల్లో రెండింటిని సాధించగలిగాము. ఈ కాలంలో పేదరికాన్ని నిర్మూలించి ‘ఒక మోస్తరు సంపద్వంతమైన సామాజంగా’ (సియాఓకాంగ్) మార్చగలిగాము.”

జిన్‌పింగ్ ఉపన్యాం తరువాత చైనా ప్రభుత్వం దేశంలో నిరుపేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు గాను దేశ ప్రజలనూ, ముఖ్యంగా పేద ప్రజలనూ, ప్రభుత్వాన్నీ, మార్కెట్‌నూ సమీకరించింది. సోషలిజం వైపు పరివర్తనలో ఇది ఒక ప్రధాన దశగా పరిగణించింది.

### 2. పేదరికం నిర్మూలన: సిద్ధాంతం, ఆచరణ

2030 నాటికి ప్రపంచం సుస్థిరాభివృద్ధి సాధించాలని ఐక్య రాజ్య సమితి ఒక ఎజెండా రూపొందించింది. 2030 నాటికి ‘పేదరికాన్ని అన్ని రూపాల్లోనూ, అన్ని కోణాల్లోనూ నిరుపేదరికంతో సహా నిర్మూలించాలి’ అని ఐరాస లక్ష్యంగా నిర్ణయించింది. దశాబ్దం ముందుగానే చైనా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన లక్ష్యాన్ని పరిపూర్తి చేసింది. చైనాలో శీఘ్ర ఆర్థికాభివృద్ధి కాలంలో కోట్లాది మంది ప్రజలు పేదరికం నుండి ఎలా బయటపడ్డారో చెప్పాలంటే ఆర్థిక రంగం ఒక్కటే చెప్పలేదు.

ఈ అధ్యయనం కోసం ట్రైకాంటినెంటల్ బృందం, ప్రపంచ బ్యాంకు మాజీ ప్రధాన ఆర్థిక వేత్త (వర్ధమాన దేశాల నుండి ఈ పదవికి ఎంపికైన తొలి వ్యక్తి) జస్టిన్ లిన్ యిఫుతో మాట్లాడింది. లిన్, పెకింగ్ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ మాత్రమే కాకుండా చైనా ప్రజా రాజకీయ సంప్రదింపుల జాతీయ కమిటీ స్థాయీ సంఘం సభ్యుడు కూడా. పేదరికం నిర్మూలనలో రెండు పద్ధతులున్నాయని లిన్ చెప్పారు. ఒకటి, ‘రక్తం ఎక్కించడం’. రెండు, ‘రక్తం ఉత్పత్తి చేయడం’. మొదటి పద్ధతి తరచూ పశ్చిమ దేశాల్లో అనుసరించేది. ప్రజల మౌలిక అవసరాలు తీర్చేందుకు గ్యారంటీ కల్పించే మానవతా సహాయం అందించడం, లేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం. రెండోది, అభివృద్ధి ఆధారంగా పేదరికాన్ని నిర్మూలించడం. ఇందులో అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఉపాధి కల్పిస్తాయి, ప్రజల ఆదాయాలు పెంచుతాయి. ఈ రెండు పద్ధతులు మాత్రమే అనుసరిస్తే చైనాలోని కొన్ని ప్రాంతాల్లో పేదరికం నిర్మూలించబడే పరిస్థితి లేదు. “ప్రకృతి వనరులు తక్కువగా ఉన్న

ప్రాంతాల్లోనూ, మార్కెట్‌కు దూరంగా ఉన్న ప్రాంతాల్లోనూ రవాణా, మౌలిక సదుపాయాలు లేని ప్రాంతాల్లోనూ ప్రజలను పేదరికం నుండి విముక్తి చేయాలంటే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం అవసరమవుతుంది" అని లిన్ చెప్పారు.

దీనికి గాను చైనాలో సమగ్ర పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని 2015, 2020 మధ్య అమలుపరిచారు. దేశంలోనూ, అంతర్జాతీయంగానూ దశాబ్దాలుగా గడించిన అనుభవాలను తీసుకుని ఈ పద్ధతిని అభివృద్ధి చేశారు. 'చైనాలో పేదరిక నిర్మూలన అనేది అభివృద్ధిపై ఆధారపడి జరుగుతుంది. సామాజిక మద్దతు, రైతుల స్వంత కృషి.. రెంటినీ కలిపి ప్రభుత్వం రూపొందించిన వ్యూహం ఇది. ఇది అభివృద్ధి ఆధారంగా జరిగే (రక్తం ఉత్పత్తి చేసే) వ్యూహం. సామాజిక భద్రతతో మౌలిక అవసరాలను ఉత్పత్తి చేస్తుంది' అని లిన్ పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వ పాత్ర గురించి లిన్ చెబుతూ "ప్రపంచంలోని ఇతర దేశాల్లో మాదిరిగా కాకుండా చైనాలో ప్రభుత్వం ఇందులో కీలకమైన పాత్ర నిర్వహిస్తుంది. పేద ప్రజలను గురించి ప్రభుత్వం పట్టించుకోకుండా వారిని మార్కెట్‌కు వదిలేస్తే పేదరికం నిర్మూలించబడదు" అని చెప్పారు.

చైనాలోని లక్షిత పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని ఒకే నినాదంలోకి కుదించి చెప్పాలంటే 'ఒక ఆదాయం, రెండు భరోసాలు, మూడు హామీలు' అని చెప్పవచ్చు. ఆదాయం ఎంత ఉండాలి అంటే ప్రపంచ బ్యాంకే అంతర్జాతీయంగా ఆ కొలమానాన్ని ప్రకటించింది. 2011 లెక్కల ప్రకారం రోజుకు మనిషికి 1.9 డాలర్లు (సుమారు రూ. 150) ఆదాయం ఉండాలని అది నిర్దేశించింది. చైనాలో దారిద్ర్య రేఖను 2011లో 2,300 యువాన్లకు పెంచారు. కొనుగోలు శక్తి సమానత (పిపిపి)ని బట్టి ఇది 2.3 అమెరికా డాలర్లతో (సుమారు రూ. 170తో) సమానం. అందువల్ల చైనా దారిద్ర్య రేఖ ప్రపంచ బ్యాంకు నిర్ణయించిన దానికన్నా ఎక్కువ. 2020 ధరలతో సరిపోలిస్తే వార్షిక ఆదాయం 4,000 యువాన్లు ఉండాలి. అయితే లక్షిత పేదరిక నిర్మూలన కోసం నిర్ణయించిన ఆదాయ పరిమితి 10,740 యువాన్లు. అంటే ప్రపంచ బ్యాంకు నిర్ణయించిన దానికన్నా చాలా ఎక్కువ అన్నమాట.

ఆదాయ పంపిణీ ద్వారా మాత్రమే పేదరికం నిర్మూలనం సాధ్యం కాదు కాబట్టి చైనా కార్యక్రమం బహుముఖ చర్యలను చేపట్టింది. దీనికి నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్ చెప్పిన భావనను ప్రాతిపదికగా తీసుకుంది. దీని ప్రకారం ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి), ఆక్స్‌ఫర్డ్ పేదరికం, మానవాభివృద్ధి కార్యక్రమాలు 10 సూచీల ఆధారంగా బహుముఖ పేదరిక సూచీ (ఎంపిఐ)ని రూపొందించాయి. ఇందులో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు తదితరాలు ఉన్నాయి. 2020లో ఈ సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రపంచంలోని 130 కోట్ల మంది ప్రజలు అంటే 22 శాతం మంది బహుముఖ పేదరికం (మల్టీడైమెన్షనల్ పోవర్టీ)లో ఉన్నారు. ఇక రోజుకు 1.9 డాలర్ల కన్నా తక్కువ ఆదాయంతో నిరుపేదరికంలో బతుకుతున్న వారు కరోనా మహమ్మారికి ముందు అంటే 2017లో 68.9 కోట్ల మంది అంటే 9.2 శాతం ఉన్నారు.

> ❝ **చైనా లెక్కప్రకారం బహుముఖ పేదరిక నిర్మూలన అంటే విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలతోపాటు మరో అయిదు అంశాలు కూడా ఉన్నాయి. ఇందులో ఆహారం, దుస్తులు అనే 'రెండు భరోసాలు' ప్రాథమిక వైద్య సర్వీసులు, మంచినీటి సురక్షిత సరఫరా, విద్యుత్‌తో కూడిన గృహవసతి, 9 ఏళ్లపాటు ఉచిత నిర్బంధ విద్య అనే 'మూడు హామీలు' ఉన్నాయి. ఐక్య రాజ్య సమితి సూచీలో కూడా చైనా పేదరికం నిర్మూలనలో ఉన్నన్ని అంశాలు లేవు.** ❞

చైనా లెక్క ప్రకారం బహుముఖ పేదరిక నిర్మూలన అంటే విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలతోపాటు మరో అయిదు అంశాలు కూడా ఉన్నాయి. ఇందులో ఆహారం, దుస్తులు అనే 'రెండు భరోసాలు' ప్రాథమిక వైద్య సర్వీసులు, మంచినీటి సురక్షిత సరఫరా, విద్యుత్‌తో కూడిన గృహవసతి, 9 ఏళ్లపాటు ఉచిత నిర్బంధ విద్య అనే 'మూడు హామీలు' ఉన్నాయి. ఐక్య రాజ్య సమితి సూచీలో కూడా చైనా పేదరికం నిర్మూలనలో ఉన్నన్ని అంశాలు లేవు. "మంచి నీటి సురక్షిత సరఫరా అంటే అర్థం 20 నిమిషాల నడక పరిధిలోపు ఎటువంటి కలుషితాలు లేని మంచినీరు నిరంతరాయంగా సరఫరా చేయడం" అని చైనా పేదరిక నిర్మూలన కార్యాలయ అధికారి వాంగ్ సాంగుయి చెప్పారు.

### 3. లక్షిత పేదరిక నిర్మూలన

2013 నవంబర్‌లో హ్యూనాన్ రాష్ట్రంలోని షిబాడాంగ్ గ్రామాన్ని అధ్యక్షుడు సి జిన్‌పింగ్ సందర్శించిన సందర్భంగా ఈ లక్షిత పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని రూపొందించారు. లక్షిత పేదరిక నిర్మూలన అంటే ఎన్నుకున్న గ్రామాలు, ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని అక్కడ పేదరికాన్ని నిర్మూలించడం. దీన్నే నిర్దిష్ట పేదరిక నిర్మూలన అని కూడా అన్నారు. 'ఈగను చంపడానికి గ్రెనేడ్‌ను ఉపయోగించనక్కర లేదు' అని జిన్‌పింగ్ స్థానిక పాలనాధికారులకు చెప్పారు. దానికి బదులు ఎక్కడ చిరుగు ఉందో అక్కడ డిజైన్ కుట్టుద్వారా దాన్ని పూడ్చే ఎంబ్రాయిడర్ పద్ధతిని అనుసరించాలని చెప్పారు. 2015లో ఈ వ్యూహాన్ని రూపొందించారు. దీనిలో నాలుగు ప్రశ్నలుంటాయి. పేదరికం నుండి ఎవరిని విముక్తి చేయాలి? ఈ పని ఎవరు చేయాలి? పేదరికం నుండి వారిని విముక్తి చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి? ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని చెప్పడానికి ఎటువంటి సమీక్ష నిర్వహించాలి?

140 కోట్ల మంది ప్రజల్లో పేదలెవరో నిర్దిష్టంగా గుర్తించడం చాలా కష్టంతో కూడిన పని. శాంపిల్ డేటా సేకరణ పద్ధతి కాకుండా ప్రతి పేదవాని గురించి తెలుసుకోవడం కోసం చైనా ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించింది. దానివల్ల ప్రతి పేద కుటుంబం పరిస్థితి, అవసరాలు తెలుసుకోవడం సాధ్యపడింది. ప్రజలను దేశంలోని ఇంటింటికీ పంపడం ద్వారానూ, ఉన్నత డిజిటల్ సాంకేతిక శాస్త్రాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ఇది సాధ్యపడింది. 2014లో 8 లక్షల మంది పార్టీ కార్యకర్తలను ఈ పనిలో నిమగ్నం చేశారు. వారు దేశంలోని 1,28,000 గ్రామాల్లో 2.95 కోట్ల ఇళ్లను సందర్శించి 8.96 కోట్ల మంది పేదలను గుర్తించారు. ఈ సమాచారంలో లోపాలను సరిచేయడానికి 10 లక్షల మంది ఈ నివేదికలను పరిశీలించారు.

పేదరికంలో ఉన్నారని చెప్పడానికి ఆదాయం ప్రధాన ప్రాతిపదిక అయినప్పటికీ గృహ, విద్యా, వైద్య సదుపాయాలను కూడా పరిగణలోకి తీసుకున్నారు. ఒక కుటుంబం పేదరికంలో ఉందా లేదా అని నిర్ణయించే

**❝ జాగ్రత్తగా ఎంపిక చేసిన 3 లక్షల మంది పార్టీ కార్యకర్తలను పేదగ్రామాలకు పంపారు. గ్రామాల్లో 2,55,000 బృందాలు తక్కువ సదుపాయాలతోనే పేద రైతులతో కలిసి మూడేళ్ల పాటు నివసించి స్థానిక అధికారులు, వాలంటీర్లతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి. దుర్గమమైన గ్రామాల్లో సుదీర్ఘ కాలం నివసించడం అంత తేలికైన పని కాదు. కుటుంబాలను విడిచి వెళ్లిన పార్టీ కార్యకర్తలు, అధికారుల్లో 1,800 మంది తిరిగి ఇళ్లకు చేరలేదు. పేదరికంతో జరిగిన పోరాటంలో వారు అమరులైనారు. ❞**

విషయంలో గ్రామ కమిటీలు, పట్టణ మున్సిపల్ ప్రభుత్వాలు, చివరికి గ్రామ ప్రజలను కూడా భాగస్వాములను చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా పేద కుటుంబాలను అంచనా వేయడం కోసం, ఫలానా కుటుంబాన్ని పేదరికం లిస్టులో ఉంచాలా తీసేయాలా అన్న విషయాన్ని నిర్ణయించడం కోసం గ్రామ, పట్టణాల్లోని స్థానిక సమూహాల్లో చర్చలు కూడా పెట్టి నిర్ణయించేవారు. కింది స్థాయి నుండి వచ్చిన ఈ సమాచారాన్ని జాతీయ స్థాయిలో పేదరిక నిర్మూలనా కార్యక్రమంతో అనుసంధానించి వారి పేదరికానికి ప్రధాన కారణాలు తెలుసుకునేవారు. దీని కోసం బిగ్ డేటా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకున్నారు. ఈ పనిలోనూ, ప్రణాళికలోనూ ప్రజలను సమీకరించడం, ప్రజా మద్దతు కూడగట్టడం ఒక కీలకమైన అంశం.

### 4. పేదరిక నిర్మూలన పని ఎవరు చేస్తారు?

నిర్వాహకులు లేకుండా సంస్థ ఉండదు. 2021 నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీలో 9.51 కోట్ల మంది సభ్యులున్నారు. వీరిలో 2.75 కోట్ల మంది మహిళలు. 49 లక్షల పార్టీ శాఖలున్నాయి. గ్రామ కమిటీల్లో, ప్రభుత్వరంగ సంస్థల్లో, పరిశ్రమల్లో, సామాజిక సంస్థల్లో ఇవి పనిచేస్తున్నాయి. చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యులంతా ఒక దేశంగా ఏర్పడితే అది ప్రపంచంలోనే 16వ అతి పెద్ద జనాభాగల దేశంగా మారుతుంది.

లక్షిత పేదరిక నిర్మూలన విజయం సాధించాలంటే గ్రామ స్థాయిలో, కింది స్థాయిలో ప్రజలకూ, పార్టీకీ మధ్య సంబంధాలు బలపడాలి. రాష్ట్రం, నగరం, కౌంటీ, టైన్‌షిప్ నుండి కింద గ్రామ స్థాయి వరకు పేదరికం నిర్మూలన కార్యక్రమాన్ని పర్యవేక్షించే బాధ్యతను ఆయా స్థాయిల్లోని పార్టీ కార్యదర్శులకు అప్పగించారు. అంటే రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి, గ్రామ స్థాయిలో గ్రామ కార్యదర్శి పర్యవేక్షించాలి. జాగ్రత్తగా ఎంపిక చేసిన 3 లక్షల మంది పార్టీ కార్యకర్తలను పేద గ్రామాలకు పంపారు. గ్రామాల్లో 2,55,000 బృందాలు తక్కువ సదుపాయాలతోనే పేద రైతులతో కలిసి మూడేళ్ల పాటు నివసించి స్థానిక అధికారులు, వాలంటీర్లతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి. దుర్గమమైన గ్రామాల్లో సుదీర్ఘ కాలం నివసించడం అంత తేలికైన పని కాదు. కుటుంబాలను విడిచి వెళ్లిన పార్టీ కార్యకర్తలు, అధికారుల్లో 1,800 మంది తిరిగి ఇళ్లకు చేరలేదు. పేదరికంతో జరిగిన పోరాటంలో వారు అమరులైనారు. 2013లో తొలి బృందాలు గ్రామాలకు బయలుదేరి వెళ్లాయి. రెండో బ్యాచ్ 2015లో వెళ్లాయి. పేదరికంలో ఉన్న వారిని విముక్తి చేయడం ఒక ఎత్తు అయితే నిరుపేదరికంలో ఉన్న వారిని విముక్తి చేయడం మరో ఎత్తు. దీని కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారు వెళ్లారు. ఆయా పేద ప్రజలు తమంత తాము పేదరికం నుండి బయటపడడంలో వీరు వాళ్లకు సహకరించారు. ఆ విధంగా 2020 చివరికి నిరుపేద ప్రజలందరినీ పేదరికం నుండి విముక్తి చేయగలిగారు.

ఒక ఉదాహరణ:- 45 ఏళ్ల లియు యువాన్‌సు పేదరిక నిర్మూలనలో తోడ్పడడం కోసం 2018లో దన్యాంగ్ గ్రామానికి వెళ్లాడు. ఆయన స్థానిక పార్టీ శాఖా కార్యదర్శి. ఆయనకు ఉన్నత పాఠశాలలో చదువుతున్న కూతురు ఉంది. గాంగ్సొ రాష్ట్రంలోని దన్యాంగ్ గ్రామంలో 2,855 మంది ప్రజలున్నారు. మొత్తం 805 కుటుంబాల్లో 137 కుటుంబాలు పేదరికంలో ఉన్నట్లు గుర్తించారు. ఈ 137 కుటుంబాలు పేదరికం నుండి విముక్తి చెందడానికి వివిధ రూపాల్లో సహకరించడానికి 57 మంది క్యాడర్‌ను అక్కడికి పంపారు. తమ రోజువారీ పని ఎలా ఉండేదో లియు యువాన్‌సు ఇలా చెప్పారు:

నాకు అయిదు పేద కుటుంబాల బాధ్యత అప్పగించారు. ఇందులో ఒక వ్యక్తి చనిపోయాడు గనుక ఇప్పుడు ఈ కుటుంబాల సంఖ్య 4కు వచ్చింది. నేను విద్యుత్ మోటారు సైకిల్ మీద ప్రతి రోజూ ఈ కుటుంబాలను సందర్శించి వారికి అన్ని విధాలా సహకరించేవాణ్ణి. యువకులతో వి-చాట్ (మన 'వాట్సాప్' లాంటిది)తోనూ, వృద్ధులతో ఫోన్‌లోనూ సంభాషించేవాణ్ణి. వారికి ఏమి కావాలన్నా నన్ను పిలిచేవారు. నేను గ్రామంలోని ప్రతి బృందాన్ని కలుసుకుని వారి మంచి చెడ్డలు చూసేవాణ్ణి. అందువల్ల ఈ రోజు ఆ గ్రామస్తులంతా నాకు పరిచయం అయ్యారు. ఇప్పుడు ప్రభుత్వం ఆ గ్రామంలో పేదలు, మధ్యతరగతి వాళ్లు, కాస్త స్తోమత గలవారి కుటుంబాల లిస్టు తయారు చేసింది. వారికి ఉపాధి ఉందా లేదా, వారికి ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉన్నాయా అన్న విషయాలు తెలుసుకోవడానికి ప్రభుత్వానికి డిజిటల్ సాధనాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మేము ఆ గ్రామంలోని ప్రజల పరిస్థితి గురించి తెలుసుకోడానికి ప్రతి నెలా గ్రామాన్ని సందర్శిస్తున్నాం.

ప్రభుత్వేతర సంస్థలు (ఎన్జీవోలు), అంతర్జాతీయ సహకారం అందించే సంస్థల నమూనాలను అనుసరించకుండా చైనా ప్రభుత్వం తన పేదరిక నిర్మూలనా కార్యక్రమంలోకి ప్రజలను సమీకరిస్తున్నది. ప్రభుత్వ విధానాలకూ, కింది స్థాయిలో ప్రజల నిర్దిష్ట పరిస్థితులను అర్థంచేసుకుని వాటిని అమలుపరచడానికీ మధ్య లియు లాంటి కార్యకర్తలు వారధుల్లా ఉపయోగపడుతున్నారు. పేదరికం నిర్మూలనలో ప్రజామద్దతు కూడగట్టడంలోనూ, ప్రభుత్వం, పార్టీ విశ్వాసం పొందడంలోనూ 10 లక్షల మంది పార్టీ క్యాడరు గ్రామ స్థాయిలో కీలకంగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమాల వల్ల ప్రభుత్వానికి చైనా ప్రజల మద్దతు గణనీయంగా పెరిగిందని అమెరికాకు చెందిన హార్వర్డ్ యూనివర్శిటీ, యార్క్ యూనివర్శిటీలు నిర్వహించిన సర్వేలు తెలిపాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రజల్లో ప్రభుత్వానికి మద్దతు బాగా పెరిగింది. "మనం మొత్తం పార్టీని, దేశాన్ని, మొత్తం చైనా సమాజాన్ని లక్షిత పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో సమీకరించాలి" అని అధ్యక్షుడు సి జిన్‌పింగ్ 19వ పార్టీ మహాసభలో పిలుపునిచ్చారు. "ప్రజలకు తమంత తాముగా పేదరికం నుండి బయటపడగలమనే

విశ్వాసాన్ని కల్పించడంపై మనం ముఖ్యంగా కేంద్రీకరించాలి" అని ఆయన చెప్పారు.

'కొంతమందిని మొదట ధనికులుగా మారనివ్వండి' అని డెంగ్ సియావో పెంగ్ చెప్పినట్లు కొంతమంది తప్పుగా ఉటంకిస్తుంటారు. కానీ అసలు వాస్తవమేమంటే, ధనికులైనవారు ముఖ్యంగా పారిశ్రామిక తూర్పు కోస్తా వారు మిగిలిన వారిని పేదరికం నుండి విముక్తి చేయడంలో తోడ్పడాలి అనేది ఈ పంథాలో కీలకమైన విషయం. మావో కాలంలో తూర్పు-పశ్చిమ సహకారం పేరుతో ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించినట్లే ఇప్పుడు కూడా పేదరికం నిర్మూలన కార్యక్రమంలో ప్రజలను సమీకరించడం ప్రధానమైన అంశం. 2015, 2020 మధ్య అయిదేళ్ల కాలంలో పేదరికం నిర్మూలన కోసం తూర్పు ప్రాంతంలోని 343 కౌంటీల పాలనా సంస్థలు 1,00,500 కోట్ల యువాన్ల (సుమారు 11.5 లక్షల కోట్ల రూపాయల) పెట్టుబడి పెట్టాయి. పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం, సామాజిక సంస్థలు 22,000 స్థానిక పరిశ్రమల నుండి మరో 1.1 లక్షల కోట్ల యువాన్లు (రూ. 12.65 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టాయి. 1,31,000 మంది అధికారులు, సాంకేతిక సిబ్బందిని పంపించాయి.

2013లో గీఝౌ రాష్ట్రంలోని టాంగ్రెన్ పట్టణంలో పేదరికం నిర్మూలన బాధ్యతను అభివృద్ధి చెందిన జియాంగ్సు రాష్ట్రంలోని సుఝౌ నగరానికి అప్పగించారు. చైనాలో దీన్ని అనుసంధానం (జతకట్టడం- పెయిరింగ్) అంటారు. 2017 ఏప్రిల్ నుండి 2020 మధ్య పేదరికంలో ఉన్న టోంగ్రెన్ పట్టణాన్ని పేదరికం నుండి విముక్తి చేయడం కోసం సుఝౌ నగరం 171 కోట్ల యువాన్లు ఆర్థిక సహకారం అందించింది. ఆ పట్టణంలో 1,240 ప్రాజెక్టుల అమలు కోసం సామాజిక బాధ్యత కింద 24 కోట్ల యువాన్ల సహాయం అందజేసింది. ఈ డబ్బుతో పట్టణంలో ఆర్థిక ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక ప్రాజెక్టులు చేపట్టారు. ఇవి కాకుండా తూర్పు ప్రాంత పరిశ్రమలు ఈ పట్టణంలో 2,641 కోట్ల యువాన్ల పెట్టుబడితో పరిశ్రమలు నిర్మించి 44,400 మందికి ఉద్యోగాలు కల్పించాచి. ఈ క్రమంలో టోంగ్రెన్ పట్టణంలో 19 పారిశ్రామిక, వ్యవసాయ పార్కులు ఏర్పాటు చేశారు. స్థానిక టూరిజం 30 శాతం పెరిగింది. పేదరిక నిర్మూలన కార్యక్రమంలో సహకరించడం కోసం జాంగ్సు నుండి టోంగ్రెన్ పట్టణానికి 5,345 మంది పార్టీ క్యాడరును పంపించారు.

> **" 2013లో టాంగ్రెన్ పట్టణంలో పేదరికం నిర్మూలన బాధ్యతను అభివృద్ధి చెందిన సుఝౌ నగరానికి అప్పగించారు. చైనాలో దీన్ని అనుసంధానం (పెయిరింగ్) అంటారు. 2017 ఏప్రిల్ నుండి 2020 మధ్య టోంగ్రెన్ పట్టణాన్ని పేదరికం నుండి విముక్తి చేయడం కోసం సుఝౌ నగరం 171 కోట్ల యువాన్లు ఆర్థిక సహకారం అందించింది. 1,240 ప్రాజెక్టుల అమలు కోసం సామాజిక బాధ్యత కింద అందించిన 24 కోట్ల యువాన్లతో పట్టణంలో ఆర్థిక ప్రాజెక్టులు, మౌలిక సదుపా యాలు, సాంకేతిక ప్రాజెక్టులు చేపట్టారు. "**



పేదరికం నిర్యూలనలో భాగంగా స్థానిక వ్యవసాయ పరిశ్రమలను ప్రోత్సహించం కోసం వాన్‌షాన్ జిల్లాలో నిర్మించిన గ్రీన్‌హౌస్‌లు

తూర్పు పడమర సహకారంతోబాటు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు, విద్యా సంస్థలు, సైన్యం, పౌర సమాజం కూడా తమ వంతు సహకారం అందించాయి. పెట్టిన పెట్టుబడిలో 4,276 కోట్ల యువాన్ల వాటా కేంద్ర ప్రభుత్వ శాఖలది. దీంతోపాటు 37 లక్షల మంది కింది స్థాయి అధికారులు, సాంకేతిక నిపుణులకు ప్రభుత్వ విభాగాలు శిక్షణ ఇచ్చాయి. 246 పేద కౌంటీల్లో 94 ప్రభుత్వ రంగ సంస్థలు 1,350 కోట్ల యువాన్లకు పైగా పెట్టుబడి పెట్టి సుమారు 10,000 సహకార కార్యక్రమాలను అమలు చేశాయి. దేశంలోని 2,301 జాతీయ సామాజిక సేవా సంస్థల్లో 686 సంస్థలు నిధులు సేకరించడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అనేక పేదరిక నిర్మూలనా కార్యక్రమాలను చేపట్టాయి. 'పదివేల గ్రామాలకు పదివేల సంస్థల నుండి సహకారం' అనే నినాదంలో భాగంగా దేశంలోని లక్షా 27 వేల ప్రయివేటు వ్యాపార సంస్థలు లక్షా 39 వేల పేద గ్రామాల్లో 1.8 కోట్ల మంది ప్రజలకు సహాయసహకారాలు అందించాయి. చైనా ప్రజావిమోచనా సైన్యం 4,100 పేద గ్రామాల్లో 9 లక్షల 24 వేల మంది ప్రజలకు సహకారం అందించింది. పాఠశాలలు, వైద్యశాలలు నిర్మించింది. ప్రత్యేక పారిశ్రామిక ప్రాజెక్టులు నెలకొల్పింది. విద్యా మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమంలో భాగంగా 44 కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పట్టణ గ్రామీణ ప్రణాళికా రంగాల్లో నిపుణులైన శిక్షకులను పంపింది.

గత ఎనిమిది సంవత్సరాలుగా చైనాలో అమలైన ఈ పేదరిక నిర్మూలనా కార్యక్రమాన్ని చైనా బయట ఉన్న వారు అర్థం చేసుకోవడం కొంత కష్టమైన పనే. ముఖ్యంగా ఇన్ని రకాలుగా ప్రజలను, పెట్టుబడినీ, సేవా కార్యాక్రమాలనూ సమీకరించడాన్ని అర్థం చేసుకోవాలంటే లోతైన అధ్యయనం అవసరం. మరీ కష్టమైన ప్రశ్న ఏమంటే పేద ప్రాంతాలకు వాలంటీర్లనూ, వనరులనూ తరలించాలని ప్రజలను ప్రభుత్వం ఎలా ఒప్పించగలిగింది? ఇదే చైనా సమాజంలో

> ❝ ఒక్క మాటలో చెప్పాలంటే పేదరిక నిర్మూలనా కార్యక్రమం చైనా సమాజంలోని మూలమూలలా తాకింది. అందువల్ల చైనాలో పేదరికంపై విజయం అనేది ఒక పార్టీ, లేక ప్రభుత్వపు విజయంగా కాకుండా చరిత్రలోనే గొప్పగా సమాజంలోని అన్ని కోణాలకు చెందిన అన్ని సెక్షన్ల ప్రజల భాగస్వామ్యంతో వికేంద్రీకృతంగా, ఉమ్మడిగా జరిగిన బృహత్తర కృషికి లభించిన విజయంగా చూడాలి. ❞

ప్రత్యేకత. చైనా సమాజం పశ్చిమ దేశాల సమాజాలకు భిన్నమైనది. ఎందుకంటే చైనా సమాజం వ్యష్టితత్వంతో కాకుండా సమిష్టితత్వం ఆధారంగా నిర్మించబడింది. సమాజం మొత్తాన్ని పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో సమీకరించడంలో ఈ సమిష్టితత్వం ప్రతిబింబించింది. ప్రభుత్వం సామాజిక సంస్థలతోనూ కలిసి పనిచేస్తుంది. రాజకీయ, సామాజిక వ్యవస్థలన్నీ ఒకే లక్ష్యంలో మమేకమవుతాయి. ఇవన్నీ కలిసి ఒక నాయకత్వ శక్తిగా మారుతాయి. ఇవి నిలువునా, అడ్డంగా సమీకరించబడ్డం ద్వారా ప్రతి ఒక్కరూ ఈ సామాజిక కార్యక్రమంలో భాగస్వాము లవుతారు.

ఒక్క మాటలో చెప్పాలంటే పేదరిక నిర్మూలనా కార్యక్రమం చైనా సమాజంలోని మూలమూలలా తాకింది. అందువల్ల చైనాలో పేదరికంపై విజయం అనేది ఒక పార్టీ, లేక ప్రభుత్వపు విజయంగా కాకుండా చరిత్రలోనే గొప్పగా సమాజంలోని అన్ని కోణాలకు చెందిన అన్ని సెక్షన్ల ప్రజల భాగస్వామ్యంతో వికేంద్రీకృతంగా, ఉమ్మడిగా జరిగిన బృహత్తర కృషికి లభించిన విజయంగా చూడాలి.

**5. చైనా పేదరికాన్ని నిర్మూలించిన పద్ధతి**

చైనాలో పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో ఇ-కామర్స్‌ను పెద్ద ఎత్తున ఉపయోగించుకున్నారు. 2016, 2020 మధ్య పేద కౌంటీల్లో ఆన్‌లైన్ వ్యాపారం 13.2 లక్షల యువాన్ల నుండి 31 లక్షల యువాన్లకు పెరిగింది. ఇది ప్రజల ఆదాయాలను పెంచడమే కాకుండా ఈ పేద గ్రామాలను బయటి మార్కెట్లతో అనుసంధానం చేసింది. దీని ద్వారా పేదరిక నిర్మూలనకు అయిదు రకాల పద్ధతులు అనుసరించారు. అవి: పరిశ్రమలు, పునరావాసం, పర్యావరణ నష్టపరిహారం అందించడం, విద్య, సోషలిస్టు సహకారం. మొదటిదైన పారిశ్రామిక రంగంలో ప్రధానంగా స్థానిక పరిశ్రమలను అభివృద్ధిపరచడం ప్రధానాంశం. దీనికి గాను పేద ప్రజలకు రుణాల రూపంలో పెట్టుబడి సమకూర్చడం, వారికి తగిన శిక్షణ ఇవ్వడం, పరిశ్రమలకు కావలసిన సాంకేతిక సామగ్రి అందించడం, మార్కెట్లను చూపించడం... ఈ పనుల్లో ప్రభుత్వ, ప్రయివేటు రంగ పారిశ్రామిక సంస్థలు భాగస్వాములవుతాయి. పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా పేద ప్రజల ఆదాయాలు పెంచే ఈ కార్యక్రమం ద్వారా 832 పేద కౌంటీల్లో 3 లక్షల పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పారు. ముఖ్యంగా వ్యవసాయాధార, పశువుల పెంపకం, మాంసం ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పారు. ఈ యూనిట్ల ద్వారా 98 శాతం పేద కుటుంబాల ఆదాయాలు పెరిగాయి. ఈ యూనిట్లలో 2.2 కోట్ల మంది పేదలకు ఉద్యోగాలు లభించాయి. వీటి ఆధారంగా మరో 1.3 కోట్ల మంది గ్రామీణులకు ఉపాధి లభించింది. ఇళ్లల్లోనే పెట్టే చిన్న చిన్న వర్క్‌షాపులు, ఉత్పత్తి యూనిట్ల ద్వారా 2015 నుండి 2019 మధ్య పేద కుటుంబాల సగటు వార్షికాదాయం మూడు రెట్లు పెరిగి 9,808 యువాన్లకు (సుమారు రూ. 1,12,800కు) చేరింది. దీనికి టూరిజం, పర్యావరణ ఆర్థిక కార్యకలాపాలు తోడు చేయడం వల్ల మరింతగా పేదరికం నిర్మూలనకు తోడ్పడ్డాయి.

చాలా మారుమూల ప్రాంతాల్లోనూ, ప్రకృతి వైపరీత్యాలకు నిలయాలుగా ఉన్న ప్రాంతాల్లోనూ నివసించేవారిని అక్కడే ఉంచి పేదరికం నుండి విముక్తి చేయడం సాధ్యం కాదు గనుక అటువంటి వారిని నివాసయోగ్యమైన ప్రాంతాలకు తరలించారు. ఇలాంటి 96 లక్షల మంది ప్రజలను అంటే పేదరికం నుండి విముక్తి పొందిన మొత్తం ప్రజల్లో 10 శాతాన్ని మారుమూల గ్రామాల నుండి కొత్తగా నిర్మించిన పట్టణాలకు తరలించారు. వారి కోసం నిర్మించిన నివాస ప్రాంతాల్లో 6,100 కిండర్ గార్డెన్, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు, 12,000 ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 3,400 వృద్ధుల సంరక్షణా కేంద్రాలు నిర్మించారు. 40,000 సాంస్కృతిక కేంద్రాలు, వేదికలు నిర్మించడమో, విస్తృతపరచడమో చేశారు.

మారుమూల గ్రామాల నుండి పట్టణాలకు తరలించినవారికి ఉపాధి కల్పించడం ప్రధాన సవాలు. దీనికోసం గాను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశ్రమలు నెలకొల్పి వాటిలో వారికి శిక్షణ గరిపింది. దీని ఫలితంగా నిర్వాసితుల్లో పనిచేయగలిగే వారిలో 73.7 శాతం మందికి పరిశ్రమల్లో ఉద్యోగాలు లభించాయి. కుటుంబాలుగా తీసుకుంటే పని చేయగల వ్యక్తులున్న 94.1 శాతం కుటుంబాలకు ఉద్యోగాలు లభించాయి.

పర్యావరణ పరిరక్షణ చేయాల్సిన ప్రాంతాల్లోని పేద ప్రజలకు పర్యావరణ ప్రాజెక్టుల్లో పనులు కల్పించారు. 2013 నుండి పేద కౌంటీల్లోని 49.7 లక్షల ఎకరాల్లో అడవుల పెంపకం, గడ్డి పెంపకం చేపట్టారు. దీనిలో ఫారెస్టు రేంజర్లుగా 11 లక్షల మంది పేదలకు ఉద్యోగాలు లభించాయి. 23,000 పేదరిక నిర్మూలనా సహకార సంస్థలను అటవీ పెంపకం పనుల్లో నిమగ్నం చేయడం ద్వారా పేదలకు ఉపాధి కల్పించారు. చైనాలో అడవుల పునరుద్ధరణ కార్యక్రమం ఈ విధంగా పేదరికం నిర్మూలనకూ ఉపయోగపడింది. 1990, 2020 మధ్య ప్రపంచంలో పునరుద్ధరించబడిన అడవుల్లో 25 శాతం చైనాలోనే పునరుద్ధరించబడ్డాయని ఐక్య రాజ్య సమితి ఆహారం వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) తెలిపింది.

తరాలుగా వస్తున్న పేదరికాన్ని బ్రేక్ చేయాలంటే విద్య ముఖ్యమైన సాధనం. ఈ చొరవలో భాగంగా 2013 నాటికి నిరుపేద కుటుంబాల్లోని 2 లక్షల మంది పాఠశాల డ్రాపౌట్ పిల్లలను తిరిగి పాఠశాలలకు పంపే ఏర్పాట్లు చేశారు. దాని వల్ల 2020 నాటికి చైనాలోని ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో 99.8 శాతం ఎన్‌రోల్‌మెంటు ఉంది. వీటిలో 95.3 శాతం పాఠశాలలకు ఇంటర్నెట్ కనెక్షన్, మల్టీమీడియా సదుపాయాలు ఉన్నాయి. ప్రభుత్వ నిధుల ద్వారా దేశంలోని 64 కోట్ల మంది ప్రజలకు విద్యా సహాయం అందుతోంది. ప్రతి ఏటా పాఠశాలల్లోని 4 కోట్ల మంది పిల్లలకు పౌష్టికాహారం అందుతోంది.

నాణ్యమైన విద్య అందించడం కూడా ప్రాధాన్యతగా ఎంచబడింది. పేద ప్రాంతాల్లో విద్య గరపడానికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న

9.5 లక్షల మంది టీచర్లను ప్రత్యేక పథకం ద్వారా నియమించారు. అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలూ, పశ్చిమ ప్రాంతాల్లోని గ్రామాల్లో చదువు చెప్పేందుకు మరో 1.7 కోట్ల మంది టీచర్లను అదనంగా నియమించారు. వీరిలో 1.9 లక్షల మందిని మారుమూల ప్రాంతాలకూ, మైనారిటీ జాతులు నివసించే ప్రాంతాలకూ డిప్యుటేషన్ మీద పంపించారు. దీని వల్ల యువజనులకు గ్రామీణ ప్రాంతాల్లోని జీవన విధానం గురించి తెలుస్తుంది. తరువాతి తరం విద్యావేత్తలు తయారవడానికి తోడ్పడుతుంది. చైనా సోషలిస్టు సంప్రదాయంలో ఇది ఒక భాగం.

విద్యారంగంలో ఈ కృషి గ్రామాల్లోనే కాకుండా దేశం మొత్తంగా మంచి ఫలితాలు ఇచ్చింది. 2020 జనాభా లెక్కల ప్రకారం చైనాలో సగటు విద్య గరిపే కాలం 9.08 సంవత్సరాల నుండి 9.91 సంవత్సరాలకు పెరిగింది. కాలేజీ విద్యనభ్యసించిన వారి సంఖ్య 2010లో లక్ష జనాభాకు 8,930 మంది నుండి 2020కి 15,467కు పెరిగింది. చైనా కళాశాల విద్యపై సింగువా విశ్వవిద్యాలయం జరిపిన సర్వే ప్రకారం చైనాలోని యూనివర్శిటీల్లో చేరిన పిల్లల్లో 70 శాతం మంది కుటుంబంలో తొలిసారిగా ఈ స్థాయికి వచ్చారు. వీరిలో కూడా 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చారు. కళాశాలల్లో మహిళలు చేరే విషయంలో చైనా ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉందని ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించిన ప్రపంచ లింగ అసమానతల నివేదిక 2020 తెలిపింది. గత దశాబ్ద కాలంలో చైనా అమలు చేసిన విద్యా సంస్కరణలు పేదరికం నిర్మూలనకు తోడ్పడ్డమే కాకుండా గ్రామాలు-పట్టణాలు, స్త్రీ-పురుషుల మధ్య అసమానతలను కూడా తగ్గించింది.

పేదరిక నిర్మూలనలో అనుసరించే అయిదు ప్రధాన పద్ధతుల్లో చివరిది సామాజిక సహకారం. 1993లో చైనా తొలిసారిగా షాంఘైలో పట్టణ కనీస జీవన గ్యారంటీ పథకం (డిబావో) అమలు పరిచింది. 1999లో దీన్ని అన్ని నగరాలు, పట్టణాలకు విస్తరించింది. 2007లో గ్రామీణ ప్రాంతాలకు వర్తింప జేసింది. ఈ పథకం కింద స్థానిక దారిద్ర్య రేఖ కన్నా తక్కువ ఆదాయం వచ్చే ఏ కుటుంబ మైనా సామాజిక సహకారానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రపంచంలోనే ఇది అతి పెద్ద నగదు బదిలీ పథకం. డిబావో పథకానికి విద్య, వైద్యం, గృహనిర్మాణం, అంగవైకల్యం, తాత్కాలిక సహాయం వంటి ఇతర సహాయాలు

> **❝ ఇంత పెద్ద ఎత్తున పేదరిక నిర్మూలన కార్యక్రమం చేపట్టినప్పుడు అన్ని ప్రాంతాల్లో అన్ని స్థాయిల్లో పని ఎలా జరుగుతున్నదో ఎప్పటి కప్పుడు తనిఖీ చేసే యంత్రాంగం పటిష్టంగా ఉండాలి. 2016 నుండి ప్రతి ఏటా జాతీయ స్థాయిలో పేదరిక నిర్మూలనా కార్యక్రమం అమలు విభాగం, ఇతర సంస్థలు కలిసి ఒక అంచనా నిర్వహిస్తూ వచ్చాయి. పేదరిక నిర్మూలనా చర్యలు ఎలా అమలవుతున్నాయి, నిధుల లభ్యత ఎలా ఉంది, అన్న విషయాలను కింది స్థాయిలో ప్రతి కుటుంబం నుండి వివరాలు సేకరించడం ద్వారా వీరు ఒక అంచనాకు వస్తారు. ❞**

తోడవుతాయి. 2009 గ్రామీణ ప్రాంత ప్రజలకు, 2011లో పట్టణ ప్రజలకు పింఛను పథకం అమలు ప్రారంభించారు.

2012లో గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం ఇచ్చే సహాయం 2,068 యువాన్లు (సుమారు రూ. 24,000) నుండి 2020 నాటికి 5,962 యువాన్లు (సుమారు రూ 68,000)కు పెరిగింది. 93 లక్షల మంది ప్రజలకు ఈ సహాయం అందిస్తున్నారు. 6 కోట్ల మంది ప్రజలకు కనీస పింఛను ఇస్తున్నారు. ఈ పథకం గ్రామీణ ప్రాంత ప్రజలందరికీ, పట్టణాల్లోని నిరుద్యోగులకూ వర్తిస్తుంది.

అయితే చైనా సామాజిక వ్యవస్థ నేడు ఒక తీవ్రమైన సమస్య నెదుర్కొంటోంది. జనాభా నియంత్రణ విధానం కారణంగా చైనాలో జననాల రేటు ఒక మహిళకు 1.3 పిల్లలకు పడిపోయింది. వృద్ధుల సంఖ్య పెరిగింది. దాంతో సామాజిక బీమా అందరికీ అందించడం కష్టమైపోతోంది. 2025 నాటికి చైనాలో 60 ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య 30 కోట్లకు చేరుతుంది. 2050 నుండి చైనా జనాభా తగ్గడం ప్రారంభమవుతుంది. సామాజిక బీమా పింఛన్లు తగ్గడంతో పట్టణాల్లో కార్మికులకు పింఛన్లు ఇచ్చే విషయంలో చైనా అనేక సంస్కరణలు చేస్తోంది. వచ్చే దశాబ్ద కాలంలో కార్మికులకు 8 లక్షల కోట్ల యువాన్ల (సుమారు రూ. 92 లక్షల కోట్లు) పింఛన్లకు కేటాయించాల్సి వస్తుంది.

గ్రామీణ పేదరికానికి రోగాలు, ఆరోగ్య సమస్యలు ఒక కారణం కనుక పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో వైద్యం ఒక ప్రధానాంశంగా ఉంది. పేద ప్రాంతాల్లో ఆరోగ్య వసతులు మెరుగుపరిచేందుకు గాను ఈ ప్రాంతాల్లోని 1,007 ప్రధాన ఆసుపత్రులను దేశవ్యాపితంగా ఉన్న 1,172 పెద్ద ఆసుపత్రులకు అనుసంధానం చేశారు. ఈ ఆసుపత్రులు దేశ వ్యాపితంగా 53,000 ఆరోగ్య పథకాలు నిర్వహించేందుకుగాను 1,18,00 మంది ఆరోగ్య కార్యకర్తలను గ్రామాలకు పంపాయి. ఈ డాక్టర్లు పేద గ్రామాల్లో 5.5 కోట్ల మంది ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వైద్యం చేశారు. 19 లక్షల శస్త్ర చికిత్సలు నిర్వహించారు. మరోవైపు గ్రామీణ ప్రాంత ఆసుపత్రుల్లో పనిచేయడానికి ఒప్పుకున్న 60,000 మంది మెడికల్ గ్రాడ్యుయేట్లకు ప్రభుత్వం ఉచితంగా చదివిస్తోంది.

**పేదరికం ఎంతమేరకు తగ్గిందో ఎలా నిర్ణయిస్తారు?**

ఇంత పెద్ద ఎత్తున పేదరిక నిర్మూలన కార్యక్రమం చేపట్టినప్పుడు అన్ని ప్రాంతాల్లో అన్ని స్థాయిల్లో పని ఎలా జరుగుతున్నదో ఎప్పటికప్పుడు తనిఖీ చేసే యంత్రాంగం పటిష్టంగా ఉండాలి. 2016 నుండి ప్రతి ఏటా జాతీయ స్థాయిలో పేదరిక నిర్మూలనా కార్యక్రమం అమలు విభాగం, ఇతర సంస్థలు కలిసి ఒక అంచనాను నిర్వహిస్తూ వచ్చాయి. పేదరిక నిర్మూలనా చర్యలు ఏ విధంగా అమలవుతున్నాయి, నిధుల లభ్యత ఎలా ఉంది, ఎక్కడైనా లోటుపాట్లు జరుగుతున్నాయా అన్ని విషయాలను కింది స్థాయిలో ప్రతి కుటుంబం నుండి వివరాలు సేకరించడం ద్వారా వీరు ఒక అంచనాకు వస్తారు. ఇందులో నాలుగు రకాల అంచానా పద్ధతులున్నాయి. ఒకటి, రాష్ట్రాల్లో ప్రతి ఇంటికీ పార్టీ కేడరును పంపి అంచనా వేయడం. రెండు, థర్డ్ పార్టీ అంచానా. అంటే పేదరిక నిర్మూనా కార్యాలయం నేరుగానూ, కొన్ని శాస్త్రీయ పరిశోధనా సంస్థలతోనూ, సామాజిక సంస్థలతోనూ సర్వేలు చేయించడం. మూడు, సామాజిక పర్యవేక్షణ. పార్టీ కార్యకర్తలు అప్పుడప్పుడు (రాండమ్) అంచానాలు నిర్వహించడం. నాలుగు, మూల్యాంకన (ఇవాల్యుయేషన్) పద్ధతి. ఏ ప్రాంతంలో అనుకున్న లక్ష్యాలు ఎంతమేరకు సాధించబడ్డాయి, సాధించలేకపోతే కారణాలేమిటో తెలుసుకునే పద్ధతి. నిధుల దుర్వి

(మిగతా 25వ పేజీలో)

**రాజకీయ విశ్లేషణ**

# తెలంగాణలో ఏం జరుగుతున్నది?

**ఎస్ వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటి సభ్యులు

తెలంగాణ రాజకీయ చిత్రం హుజూరాబాద్ ఎన్నికల చుట్టూ తిరుగుతున్నది. అధికార, ప్రతిపక్షాలు ఉప ఎన్నికల లెక్కల్లో బిజీగా ఉన్నాయి. ఈటల రాజేందర్ రాకతో బిజెపి ఆశలు పెరిగాయి. టీఆర్ఎస్ నాయకత్వం దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడుగా రేవంత్‌రెడ్డి ఎన్నిక కావటంతో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహపడ్డాయి. ఈ పరిణామంతో బిజెపి కొంత కంగుతిన్నది. దళిత బంధు పథకాన్ని హుజూరాబాద్ నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని చెప్పింది. అదే సమయంలో అన్ని నియోజకవర్గాలలో అమలు చేస్తామని కూడా ప్రకటించింది. హైద్రాబాద్ నుంచి హుజూరాబాద్ పాదయాత్ర చేస్తానన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆశలమీద నీళ్ళు చల్లినట్టయ్యింది. దీనికితోడు కాంగ్రెస్ నుంచి బయటికి తొంగిచూస్తున్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లోనే కొనసాగే వాతావరణం కనిపిస్తున్నది. ఈ పరిణామాలు బిజెపి నాయకత్వానికి రుచించలేదు. అందుకేనేమో! బిజెపి నేతలు మౌనంగా ఉన్నారు. ఇది తాత్కాలికమే. ఎట్లాంటి ఎత్తుగడలతో ముందుకొస్తారో వేచిచూడాలి. మరోవైపు రేవంత్‌రెడ్డి రావటంతో కొందరు 'హమ్మయ్య'.... అన్నట్టు ఉన్నారు. నిరాశా నిస్పృహల్లో ఉన్న కాంగ్రెస్ శ్రేణులకు విశ్వాసం నింపటంలో ఆయన జయప్రదం కావచ్చు. కానీ తెలంగాణా ప్రజలకేమి ప్రయోజనం? కాంగ్రెస్‌లో నాయకులెవరన్నది ముఖ్యం కాదు. ఆ పార్టీ విధానాలేమిటన్నదే ప్రజలకు ముఖ్యం. ఉమ్మడి రాష్ట్రాన్ని అత్యధిక కాలం పరిపాలించింది కాంగ్రెస్ పార్టీ. ఏమి ఒరగబెట్టింది? కేంద్రంలో కూడా అత్యధిక కాలం పాలించింది కాంగ్రెసే కదా! ఆ ప్రభుత్వం తప్పుడు విధానాల వల్లనే కదా ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. దాని ఫలితమే కదా అంతకంటే ప్రమాదకరమైన బిజెపి కేంద్రంలో తిష్టవేసింది. అవకాశం వచ్చినప్పుడు ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించారు. తెలంగాణ ప్రజల సమస్యలన్నింటికీ మూలం కాంగ్రెస్ పాలనలోనే ఉన్నది కదా! ఇప్పుడు అదే ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు కేంద్రంలో మోడీ సర్కారు మరింత దూకుడుగా అమలుచేస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వం దళితుల సాధికారత గురించి అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. దళితబంధు పథకం గురించి ప్రతిపాదించింది. అన్ని రాజకీయ పార్టీలు ఆమోదించాయి. అనేక సూచనలు కూడా చేశాయి. నాలుగు రోజులయ్యిందో లేదో.... బిజెపి, కాంగ్రెస్ పార్టీల నేతలు ఎదురుతిరిగారు. పథకం మీద దాడి ప్రారంభించారు. ఈ పథకం వల్ల హుజూరాబాద్ ఎన్నికలలో తమ ప్రయోజనాలు దెబ్బతింటాయన్న భయం పట్టుకున్నదేమో! తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి ఇక్కడ చర్చనీయాంశం. ఉప ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ పథకం ప్రారంభించిందని వారి ఆరోపణ. అది నిజం కూడా. కానీ దళితులకు అది ఉపయోగపడుతుందా లేదా అన్నదే కీలకమైన ప్రశ్న. దళితులకు కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇస్తామన్నారు. కానీ 6,662 మందికి మాత్రమే భూమి ఇచ్చారు. మూడెకరాల భూమికి అర్హులు నాలుగు లక్షల మంది ఉన్నారు. ఎకరం, అరెకరం భూమికి అర్హులను కూడా కలిపితే 9 లక్షలమంది అవుతారు. కానీ ఈ పథకం గురించి మాట్లాడడమే దాదాపు మానేసింది ప్రభుత్వం. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కూడా సుమారు 50 వేల కోట్లు ఖర్చు చేయలేదు. ఎస్టీ కార్పొరేషన్ నుంచి అప్పుల కోసం 9 లక్షల అప్లికేషన్స్ వచ్చాయి. కేవలం లక్షమందికి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రైతుబంధు పథకం కౌలు రైతులకు వర్తింపజేయలేదు. కౌలు రైతులలో గణనీయమైన సంఖ్యలో దళితులు ఉన్నారు. అందువల్ల ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రశ్నార్థకమే! వీటికోసం పోరాడటం ద్వారా ప్రతిపక్షాలు కూడా తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. ఇప్పటివరకు ఈ సమస్యల పరిష్కారం కోసం వామపక్షాలు తప్ప ఇతర పార్టీలు పోరాడలేదు. బిజెపి, కాంగ్రెస్ నాయకులు రాజకీయ ప్రయోజనం కోసం మాట్లాడటం తప్ప ప్రజలను సమీకరించి పోరాడింది లేదు. భవిష్యత్తులో కూడా ఈ సమస్యల మీద చిత్తశుద్ధితో పోరాడేది వామపక్షాలే! అదే సమయంలో ఇప్పుడు ప్రారంభించిన దళిత బంధు పథకం ఏ మేరకు ఉపయోగపడ్డా మంచిదే. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఈ సందర్భంగా నిర్దిష్ట సూచనలు చేసింది. దళితుల్లో అత్యధిక శాతం వ్యవసాయ కార్మికులు, రోజువారీ వేతన కార్మికులు, అసంఘటిత కార్మికులు, పారిశుధ్య, స్కీమ్ వర్కర్లు ఉన్నారు. ఆ గ్రామాల్లో ఉన్న సౌకర్యాలు కూడా దళిత నివాస ప్రాంతాల్లో అందుబాటులో లేవు. కుల వివక్ష, అంటరానితనం ఇప్పటికీ తీవ్రంగానే ఉన్నది. రాజకీయ రిజర్వేషన్లు ఉన్నా అన్ని స్థాయిల్లో తగినంత గౌరవం లభించడంలేదు. కాబట్టి దళితుల సాధికారతకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల్లో తక్షణ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) కోరుతున్నది. రానున్న కాలంలో వీటికోసం ప్రజలను సమీకరించి పోరాడుతుంది. వామపక్షాలన్నీ ఐక్యంగా పోరాడవలసిన అవసరం కూడా ఉంటుంది.

నిజానికి దళితబంధు పథకం ఒక్కటే సమస్య కాదు. సమాజంలో ఇంకా గిరిజనులు, సంచార జాతులు, బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలున్నాయి. కార్మికులు, రైతులు, వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు వ్యతిరేక చట్టాల మీద పోరాటానికి టీఆర్ఎస్ నాయకత్వం సిద్ధంగా లేదు. కార్మిక చట్టాల రద్దును సమర్థించింది. జీఎస్టీ నిధుల వాటా కోసం, అదనపు నిధుల కోసం కేంద్రం మీద ఒత్తిడి చేయడానికి సిద్ధపడడంలేదు. కేంద్రంతో

లాలూచీ, కుస్తీ కొనసాగుతున్నది. ఇలాంటి అనేక సమస్యల మీద రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడవల్సి ఉన్నది. ప్రజలతో మమేకమై, వామపక్షాలు కృషిని పెంచవల్సిన సమయమిది. బిజెపి, కాంగ్రెస్‌లు ఉప ఎన్నికల కోసం రాజకీయంగా వాడుకోవటం తప్ప నిజాయితీతో పోరాడటానికి సిద్ధంగా లేవు. ప్రజలను కదిలించడానికి అసలే సిద్ధంగా లేవు.

> **❝ కెసీఆర్‌కు వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలన్న నినాదాన్ని బిజెపి ముందుకు తెచ్చింది. ఆశ్చర్యకరంగా ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు కూడా అదే నినాదం పట్టుకున్నారు. అందరూ ఏకమై కొట్లాడి, టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి, ఎవరు అధికారంలోకి రావాలి? అందరూ కలిసి అధికారంలోకి రావాలా? అంటే బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీలు కలిసి అధికారం పంచుకోడానికేనా ఈ ప్రయత్న మంతా! లేదా బిజెపి, కాంగ్రెస్ పార్టీలలో ఎవరొచ్చినా సర్దుకుపోదామను కుంటున్నారా? ❞**

కెసీఆర్‌కు వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలన్న నినాదాన్ని బిజెపి ముందుకు తెచ్చింది. ఆశ్చర్యకరంగా ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు కూడా అదే నినాదం పట్టుకున్నారు. అందరూ ఏకమై కొట్లాడి, టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి, ఎవరు అధికారంలోకి రావాలి? అందరూ కలిసి అధికారంలోకి రావాలా? అంటే బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీలు కలిసి అధికారం పంచుకోడానికేనా ఈ ప్రయత్న మంతా! లేదా బిజెపి, కాంగ్రెస్ పార్టీలలో ఎవరొచ్చినా సర్దుకుపోదామను కుంటున్నారా? ఇలాంటి ఆలోచనలు లేకపోతే బిజెపి విధానాల మీద పోరాటాన్ని కాంగ్రెస్ ఎందుకు పక్కన పెడుతున్నట్టు? ఇక్కడ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదు... అధికారం చేజిక్కించుకోడానికే ఈ ప్రయత్నమంతా. కాంగ్రెస్ ఎదగాలంటే కెసీఆర్‌ను టార్గెట్ చేయాలని కూడా అంటున్నారు. ఇక్కడ ఎవరిని టార్గెట్ చేయాలి, ఎవరు అధికారం సంపాదించాలి అన్న యావే తప్ప తెలంగాణా ప్రజల సమస్యల పరిష్కారం గాలికి వదిలేస్తున్నారు. కోకాపేట భూముల అమ్మకంలో కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వ అధినేతలు తమ బినామీల కోసం, బంధుమిత్రుల కోసం వెయ్యికోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. తమకు కావాల్సిన వారికి చవకగా భూములు కట్టబెట్టారన్నారు. అదే జరిగి కూడా ఉండవచ్చు. వీటిమీద కాంగ్రెస్ నాయకత్వం ప్రజల్లోకి పోవచ్చు. తగిన ఆధారాలుంటే న్యాయ పోరాటం కూడా చేయవచ్చు. ఇవేవీ చేయకుండా....కేంద్రానికి ఫిర్యాదు చేస్తామన్నారు కాంగ్రెస్ నేతలు. దీని అర్థం ఏమిటి? టీఆర్ఎస్ ప్రభుత్వం కన్నా కేంద్రంలో మోడీ ప్రభుత్వం నీతిమంతమైందని కాంగ్రెస్ భావిస్తున్నదా? తెలంగాణ ప్రజలకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవినీతిరహిత మైనదనీ, రాష్ట్ర ప్రభుత్వం చేసే తప్పులను సరిదిద్ది ప్రజాహిత పాలనకు తోడ్పడుతుందని చెప్పదలచారా? పైగా... కేంద్రం జోక్యం చేసుకోవాలంటు న్నారు. ఇప్పటికే తమతో విభేదించే రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం బతకనీయటం లేదు. ప్రశ్నించేవారిని వెంటాడుతున్నది. కేంద్రం జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ కోరటం ఆశ్చర్యకరం! ఇలాంటి ఎత్తుగడలు తెలంగాణను బిజెపి చేతుల్లో పెట్టేందుకే తోడ్పడతాయి. కెసీఆర్‌కు వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలన్నా, కేంద్రం జోక్యం చేసుకోవాలన్నా.... తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తోడ్పడక పోగా, పెనం మీద నుంచి పొయ్యి లోకి నెడతాయి. అందుకే ఇలాంటి ప్రయత్నాలు సరైనవి కాదని సిపిఐ(ఎం) స్పష్టంగానే చెపుతున్నది. తెలంగాణలోనే కాదు... జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వం కూడా ఇదే ధోరణితో ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ బిజెపి మీద దృష్టి సారించలేదు. కేరళలో వామపక్షాల మీద పోరాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా కూడా బెంగాల్ పర్యటనకు సిద్ధపడలేదు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడటంలో కాంగ్రెస్ నాయకత్వం అవకాశవాద విధానాలు అనుసరిస్తున్నది.

కేంద్రంలో మోడీ పాలన కార్మికులు, రైతుల పట్ల శాపంగా మారింది. కార్మిక చట్టాలు రద్దు చేసింది. రైతువ్యతిరేక చట్టాలు చేసింది. అంబానీ, అదానీ లాంటి బడా పెట్టుబడిదారులకు వరంగా మారింది. అంతేకాదు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళల హక్కులు హరిస్తున్నది. సామాజిక వివక్షను పెంచిపోషిస్తున్నది. ప్రజలలో అసంతృప్తి పెరిగినపుడల్లా మతం, జాతీయ దురభిమానం ముందుకు తెచ్చి భావోద్వేగాలు రెచ్చగొడుతున్నది. ప్రజల దృష్టిని మరలిస్తున్నది. మతాన్ని తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశ చరిత్రలో ఎప్పుడూ లేనంతమంది దళితుల మీద దాడులు జరిగాయి. ఎప్పుడూ జరగనంతగా మహిళల మీద లైంగిక దాడులు జరిగాయి. కేంద్రం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం సవరించి బలహీనపరిచే ప్రయత్నం చేసింది. దేశవ్యాపితంగా నిరసన పెల్లుబికిన తర్వాతే ఆ ప్రయత్నాలు మానుకున్నది. హత్రాస్ గ్రామంలో దళిత యువతి మీద సామూహిక లైంగిక దాడి ఘటనలో యుపి బిజెపి ప్రభుత్వం లైంగికదాడి చేసిన దుర్మార్గులకు అండగా నిలబడ్డది. ప్రజా ఉద్యమమే నిజాలను బయటపెట్టేటట్టు చేసింది. హర్యానాలో ఆవును చంపారని దళితులను హత్య చేసారు. దళితుల ప్రాణం కన్నా ఆవు ప్రాణమే మిన్న అని చెప్పడానికి బిజెపి పాలకులు వెనుకాడలేదు. ఉపాధిహామీ నిధులు గ్రామీణ పేదలకు ఆదరువుగా ఉన్నాయి. లబ్ధిదారులలో దళితులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఉపాధి నిధులకు కోత పెట్టింది కేంద్రం. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి పాలనలో పాపాలు కోకొల్లలు. వీటికి వ్యతిరేకంగా పోరాడకుండా దేశాన్ని రక్షించుకోలేము. తెలంగాణ ప్రజల హక్కులు కాపాడుకోలేము. ❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.


మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

చరిత్ర

# క్రీ.పూ. 700-350 మధ్య కాలంలో వివిధ సామాజిక దొంతరలు

ఎంవిఎస్ శర్మ



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

ఆధిపత్య వర్గాలు రూపొందించిన స్మృతులు, ఉపనిషత్తులు మాత్రమే గాక ఈ కాలంలో చరిత్రను అర్థం చేసుకోడానికి తోడ్పడే చారిత్రిక ఆధారాలుగా పాళీ భాషలో రూపొందిన పలు బౌద్ధ గ్రంధాలు ఉన్నాయి. చాలాకాలం ఈ గ్రంధాలను చరిత్ర అధ్యయనంలో ఉపయోగించలేదు. గత మూడు, నాలుగు దశాబ్దాల కాలంలో చరిత్రకారులు ఈ గ్రంధాలను ముఖ్యమైన ఆధారాలుగా ఉపయోగించడం ప్రారంభించారు.

బ్రాహ్మణ మత గ్రంధాలైన బ్రహ్మ సూత్రాలు వంటివి సామాజిక దొంతరలకు సంబంధించి వర్ణం, జాతి అనే రెండు పదాలనే ప్రధానంగా ప్రస్తావించాయి. కాని పాళీ గ్రంధాలలో పలు ఇతర పదాలు కూడా ఉన్నాయి. "ఘర" అనే పదం గృహం అన్న అర్థంలో ఉపయోగించారు. గృహం అంటే భార్య, భర్త, వారి సంతానంతో కూడిన కుటుంబం. ఐతే, ఉమ్మడి కుటుంబం గురించి ప్రస్తావించినప్పుడు కూడా గృహం అన్న పదాన్నే ఉపయోగించారు. అంతే కాదు, కొన్ని సందర్భాలలో ఆ ఇంటి పనివారు, దాసదాసీ జనం కూడా ఆ గృహానికి చెందినవారిగానే పరిగణించబడ్డారు. ఆ కుటుంబానికి చెందిన భూములపై జరిగే వ్యవసాయ పనులను పర్యవేక్షించేవారు, బంధుమిత్రులు కూడా 'ఘర' పరిధిలోనే ఉన్నారు. ఇక్కడ ప్రధానమైన అంశం ఆ 'ఘర' లోని సభ్యులందరి నడుమ ఉన్న రక్త సంబంధం. ఈ రక్త సంబంధం ఆధారం గానే ఆస్తిపై వారసత్వ హక్కు కూడా నిర్ధారించబడేది. ఈ 'ఘర' అన్న పదంతో ముడిపడిన ఇతర పదాలు–'నివేశన' (ఇల్లు), 'ఉద్ధోసిత' (పశువుల, గుర్రాల శాల), 'మాలో' ( కాపలివారు ఉండే ప్రదేశం ), 'నావ' (పడవ), 'ఖేత్త' (వ్యవసాయ క్షేత్రం), 'ధాన్న కారనియ' ( ధాన్యాగారం) వంటివి పరిశీలిస్తే కొన్ని కుటుంబాల వద్ద భారీగా సంపద పోగుబడినట్టు పరిగణించవచ్చు.

ఈ 'ఘర' అన్న పదంతోటే "కులపుత్త" (కుటుంబంలోని జూనియర్ సభ్యుడు' ), 'కులపతి', లేదా 'కుల జెట్ట' (కుల పెద్ద) 'ఏక కులస్స' (ఒక కులానికి చెందిన సంపద) వంటి పదాలు కూడా ఉపయోగించడం చూస్తే 'కుల' అన్న పదాన్ని రక్త సంబంధీకుల సమూహానికి పర్యాయ పదంగా ఉపయోగించినట్టు భావించాలి.

పాళీ గ్రంధాలలో ఉపయోగించిన 'కుల' పదానికి, బ్రాహ్మణ సాహిత్యంలో ఉపయోగించిన 'జాతి' పదానికి చాలా పోలికలు ఉన్నాయి. ఖత్తియ, బమ్హన, వెస్స, సుద్ద అనే నాలుగు రకాలుగా కులాలను వర్గీకరించడం, వాటిలో ఖత్తియ, బమ్హన, గహపతి వంటివి ఉచ్ఛ కులాలుగాను, ఛండాల, నిషాద, రథకార, పుక్కుసర వంటివి నీచ కులాలుగాను పాళీ గ్రంధాలలో వర్ణించారు. ఖత్తియ, బమ్హన కులాలు 'ఉక్కట' కులాలుగా, మహాకులాలుగా వర్ణించారు. వీటిని 'అద్ధకులాలు' (సంపన్న కులాలు) గా కూడా పేర్కొన్నారు. 'నాతి' అనే ఇంకో పదాన్ని పాళీ గ్రంధాలలో చూస్తాం. ఇది ప్రధానంగా రక్త సంబంధీకుల గుంపులను ఉద్దేశించి ఉపయోగించారు. గణం, లేదా గోత్రం అనే అర్థంలో దీనిని చూడాలి.

**బానిస వ్యవస్థ –దృష్టాంతాలు**

సమాజంలో సంపద పరంగా విభజన బాగా పెరిగినట్టు పాళీ గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. గహపతులు, శెట్టిలు సంపదను పోగేయడంతోబాటు పెద్ద సంఖ్యలో దాస, దాసీ జనాన్ని కూడా కలిగివుండేవారని ఆ గ్రంధాలు తెలుపుతున్నాయి. 'దాస' పదం బానిస స్వభావం కలిగిన వర్గాన్ని సూచిస్తున్నది. దాసులకు ఎటువంటి సంపదనూ కలిగివుండే హక్కు లేదు. ఈ దానులు 'ఆరియుల' ఆస్థిగా పరిగణింపబడేవారు. తన వద్దనుండే దాసులను చంపినా, లేక వారి ముక్కు చెవులను కోసివేసినా యజమానికి ఎటువంటి శిక్షా లేదు. దాసీల పరిస్థితి ఇంకా ఘోరం. యజమాని కోరితే అతని లైంగిక వాంఛలను తీర్చడం దాసి బాధ్యత. దానికి తోడు యజమానురాలి ఆగ్రహానికి కూడా పాత్రురాలు కావలసివచ్చేది. దాని ఫలితంగా ఆ దాసి అంగ వైకల్యానికి సైతం గురికావలసివచ్చేది.

**వైవాహిక సంబంధాలు –తీరుతెన్నులు**

సమాజంలో వర్గ విభజన, శ్రమ దోపిడీ పెరుగుతున్న కొద్దీ స్త్రీ పరిస్థితి దిగజారుతూ వచ్చింది. స్త్రీని పురుషుడి ఆస్తిగా పరిగణించడం మొదలైంది. వినయపిటకలో పది రకాల వివాహ పద్ధతుల గురించి ప్రస్తావించారు. అవి : 1. ధనక్కిత– ధనంతో కొనడం, 2. చందవాసిని– తన ఇష్టపూర్వకంగా స్త్రీ పురుషుడితో ఉండానికి అంగీకరించడం, 3. భోగవాసిని – వాంఛలు తీర్చుకోవడం కోసం స్త్రీని ఉంచుకోవడం, 4. పట్టవాసిని– దుస్తులు ఇచ్చి స్త్రీని తెచ్చుకోవడం, 5. ఒడపట్టకాని– నీటితో అభిషేకించి స్త్రీని వివాహమాడడం, 6. ఒభటచుంబట – స్త్రీ తన తలమీద ముసుగు తొలగించి పురుషుడి అధీనం కావడం, 7. దాసీనామ – పురుషుడికి జంటగా ఉంటూనే అతడికి దాసిగా కూడా ఉండడం, 8. కమ్మకారి– అతడికి భార్యగా ఉంటూనే అతడివద్ద పనిమనిషి గా ఉండడం, 9. ముహుత్తిక– తాత్కాలికంగా భార్యగా ఉండడం, 10. ధజహటా– దాడులలో దొరికిన స్త్రీ.

సహోదరుల మధ్య వివాహ సంబంధాలు ఉండినట్టు కూడా దాఖలాలు ఉన్నాయి. రక్తం అపవిత్రం కాకూడదనే అభిప్రాయంతో ఇటువంటి పద్ధతి వచ్చినట్టు

> **రాజ్యంలో అందరికన్నా ఎక్కువమందిని నియమించే యజమాని రాజు. ముఖ్యంగా సైన్యంలోకి వివిధ రకాలవారిని నియమించేవారు. వీరిని యోధజీవులు అనేవారు. విలుకాళ్ళు (ఇస్సితేన), గజారోహకులు (హత్తారోహ), అశ్వ దళం (అస్సారోహ), రథచోదకులు (రథిక), పతాక వాహకులు(చేలక) సైన్యానికి వివిధ రకాల సరఫరాలు చేసేవారు (పిండదావిక), మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించేవారు (కరణిక) వంటి విభాగాలు సైన్యంలో ఉండేవి.**

అనిపిస్తుంది. అయితే వజ్జియినులు, శాక్యులు వంటి తెగలు అనతికాలంలోనే ఇటువంటి వైవాహిక సంబంధాలను నిషేధించారు.

వినయపిటకలో 10 రకాల వివాహాలు ప్రస్తావిస్తే, బ్రహ్మసూత్రాలలో 8 రకాల వివాహ పద్ధతులను పేర్కొన్నారు. అవి: 1. బ్రహ్మ వివాహం–పెళ్ళికుమారుడిని పెళ్ళికూతురు తండ్రి ఎంపిక చేస్తాడు. పెళ్ళికూతురి ఇష్టంతో నిమిత్తం లేదు. 2. దైవ వివాహం – వధువును పురోహితుడికి తండ్రి స్వాధీనం చేస్తాడు. దానికి బదులుగా పురోహితుడు తండ్రి తరఫున యజ్ఞం నిర్వహిస్తాడు. 3. ప్రజాపత్య వివాహం – వధూవరులిద్దరూ కలిసి ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించాలనే నిబంధనతో జరిగే వివాహం. 4. ఆర్ష వివాహం – వరుడు ఒక ఆవును గాని, ఎద్దును గాని వధువు తండ్రికి ఇచ్చి ఆ వధువును వివాహమాడడం, 5. రాక్షస వివాహం – వధువును ఆమె ఇష్టం లేకుండా ఎత్తుకుపోయి వివాహమాడడం, 6. అసుర వివాహం – వధువు తల్లిదండ్రులకు డబ్బిచ్చి వధువును కొనుక్కోవడం (కన్యాశుల్కం) 7. గాంధర్వ వివాహం – పెద్దల అనుమతి లేకుండా స్వతంత్రించి వివాహం చేసుకోవడం, 8.పైశాచిక వివాహం – స్త్రీని మత్తులో ఉంచి బలవంతంగా అనుభవించడం

పైన తెలిపిన పద్ధతులలో మొదటి నాలుగు పద్ధతులు సమ్మతించదగినవిగాను, తక్కిన నాలుగు పద్ధతులు విసర్జించదగ్గవిగాను వర్గీకరించబడ్డాయి.

పురుషుడికి ఒకరు కన్నా ఎక్కువ భార్యలు ఉండడం ఆనాటి సమాజంలో ఆమోదయోగ్యం గానే ఉండేది.

**వృత్తుల వారీ వర్గీకరణ**

వృత్తిలో నైపుణ్యానికి ప్రాధాన్యత ఉండేది. ఐతే, చేసే వృత్తిని బట్టి ఉచ్ఛ, నీచ వృత్తులుగా విభజన ఉండేది. నాణాల గణన, అకౌంట్స్ నిర్వహించడం, వ్రాయడం వంటివి ఉచ్ఛ వృత్తులుగా పరిగణించబడితే, చర్మకారులు, నాలకారులు(చాపలు అల్లేవారు), కుంభకారులు (కుమ్మరులు), పేశకారులు (దుస్తులు కుట్టేవారు) నహపిత (మంగలి), నజక వంటివి నీచ వృత్తులుగా పరిగణించబడేవి.

పైన పేర్కొన్నవి గాక యానకార (రథాలను తయారు చేసే వారు) తున్నవాయ (దుస్తులు నేయడం, కుట్టడం), సూచీకార (సూదులు తయారు చేయడం), సువన్నకార (కంసాలి) కమ్మర, పాలగండ (కార్పెంటర్) దంతకార (ఏనుగు దంతాలతో వస్తువుల తయారీ), మాలకార (పూవుల దండల తయారీ), కొసియకార (పట్టుదుస్తుల తయారీ) వంటి వృత్తుల ప్రస్తావన ఉంది. ఈ వృత్తులలో అత్యధిక భాగం ఆయా కుటుంబాల వారీగానే కొనసాగేది.

ఇనుము, రాగి, సీసం, తగరం, అభ్రకం, బంగారం, వెండి వంటి లోహాలను, గంధకం, పాదరసం, రాతి ఉప్పు తదితర ఖనిజాలను వినియోగించినట్టు పాళీ గ్రంథాలు తెలియజేస్తున్నాయి. వివిధ రకాల వలలను ఉపయోగించి చేపలు పట్టడం గురించి ప్రస్తావనలున్నాయి.

వ్యవసాయం అభివృద్ధి చెందడంతో బాటు దానిమీద ఆధారపడిన ఇతర వ్యాపకాలు కూడా పెరిగాయి. చెరుకు నుండి బెల్లం, పంచదార తయారు చేయడం, పత్తి, ఉన్ని, పట్టు నుండి దుస్తుల తయారీ, వివిధ రకాల ఫలాల నుండి రకరకాల సారాయి తయారీ, కలప నుండి బల్లలు, మంచాలు ఇతర వస్తువుల తయారీ, తోళ్ళ నుండి రకరకాల చర్మ వస్తువులు తయారు చేయడం – ఈ విధంగా బహుముఖంగా వృత్తులు విస్తరించాయి.

వైద్య వృత్తి చాలా గౌరవప్రదమైనదిగా పరిగణించబడేది. లేఖకులు, గణకులు వంటి వృత్తుల వారు కొద్దిమందే ఉండడం, తరచూ ఉన్నత కులాలవారై ఉండంతో ఆ వృత్తులకూ అధిక గౌరవం ఉండేది.

**కళాకారులు**

నటులు, నర్తకులు, లాంఘికులు (సాముగరిడీల వంటి విన్యాసాలు చేసేవారు), ఐంద్రజాలికులు, డప్పులు, మృదంగాలు వంటివి వాయించేవారు (కుంభతునిక), సోది చెప్పే వనితలు (ఇఖ్ఖానిక), నాట్యకత్తెలు (గణిక), వేశ్యలు (వెశి) – వీరందరినీ వినోదం కలిగించేవారుగా పేర్కొన్నారు. గణిక వృత్తిలో ఉన్న వారిని చిన్నచూపు చూసినట్టు తోచదు. ఆమ్రపాలి అనే గణిక బుద్ధుడిని, అతడితోబాటు 1250 మంది బౌద్ధ సన్యాసులను తన ఇంటికి విందు కోసం ఆహ్వానించిన సంఘటన, బౌద్ధ ఆరామ నిర్మాణానికి విరాళం ఇచ్చిన ఘటన ఇందుకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

**రాజ సేవకులు, రాజోద్యోగులు**

రాజ్యంలో అందరికన్నా ఎక్కువమందిని నియమించే యజమాని రాజు. ముఖ్యంగా సైన్యంలోకి వివిధ రకాలవారిని నియమించేవారు. వీరిని యోధజీవులు అనేవారు. విలుకాళ్ళు (ఇస్సితేన), గజారోహకులు (హత్తారోహ), అశ్వ దళం (అస్సారోహ), రథచోదకులు (రథిక), పతాక వాహకులు(చేలక) సైన్యానికి వివిధ రకాల సరఫరాలు చేసేవారు (పిండదావిక), మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించేవారు (కరణిక) వంటి విభాగాలు సైన్యంలో ఉండేవి.

ఇతర విభాగాలలో మంత్రులు, సామంతులు, రాజ్యం యొక్క భూముల నిర్వహణ చూసేవారు, గుర్రాలకు, ఏనుగులకు శిక్షణ ఇచ్చేవారు, రాజ భటులు, తలారి, గ్రామ పెద్దలు, గూఢచారులు, సమాచారం పంపేవారు, కోట దుర్గాన్ని రక్షించేవారు ఇతర ఉద్యోగులుగా ఉండేవారు.

దినసరి బత్తెం మీద పని చేసేవారు, ఒక నిర్ణీత ప్రయాణ కాలానికి నియమించబడిన వారు (టెంపరరీ) ఏ విధమైన పనిని అప్పగించినా చేయవలసిన వారు, ఒకానొక పనికోసం మాత్రమే నియమించబడినవారు (కాంట్రాక్టు ఉద్యోగులు) – ఇలా నాలుగు రకాలుగా రాజోద్యోగులు ఉండేవారని జైన గ్రంథాలు పేర్కొన్నాయి.

నగరాలలో ప్రధానంగా నగదు రూపంలో వేతనాలు చెల్లించే పద్ధతి అమలులో ఉంటే, గ్రామాల్లో వేతనాలు వస్తురూపేణా చెల్లించడం ప్రధానంగా ఉండేది.

కుల వ్యవస్థ విస్తరించిన తీరు గురించి వచ్చే వ్యాసంలో తెలుసుకుందాం.

**(సశేషం)**

అంతర్జాతీయం

# అంతరిక్ష ప్రయివేటీకరణకు పోటీ



రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకులు

**ఎస్ వెంకట్రావు**

**2021** జులై నెలలో మానవుని అంతరిక్ష యాన రంగంలో ఒక తిరోగమన పోకడ ప్రారంభమైంది. అంతరిక్షంలోకి తొలి ఉపగ్రహం స్పుత్నిక్‌ను సోవియట్లు పంపినప్పుడు, లేక అంతరిక్షంలోకి తొలి మానవుడు యూరిగెగారిన్ వెళ్లి వచ్చినప్పుడు, లేక చంద్ర గ్రహం మీద తొలి మానవుడు కాలు మోపినప్పుడు యావత్ ప్రపంచ మానవాళి ఉత్సవాలు జరుపుకుంది. మానవ అంతరిక్ష పరిశోధనా రంగంలో పురోగతికి మురిసి పోయింది. కాని ఈ ఏడాది జులైలో జరిగిన రెండు ముఖ్యమైన అంతరిక్ష యానాలు అటువంటి పురాగామి ఘట్టాలు కాదు. ఇప్పటివరకు మానవుడు అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను కొద్ది మంది ధనికస్వాములు చేజిక్కించుకుని తమ స్వార్థప్రయోజనాల కోసం వాడుకునే తిరోగామి అడుగులు. అందుకే కార్పొరేట్ మీడియా ఈ ఘటనలను శ్లాఘిస్తే సామాన్య ప్రజానీకం సోషల్ మీడియాలో దీన్ని పరమ తిరోగమన చర్యగా, అంతరిక్షాన్ని కొద్ది మంది కార్పొరేట్ ధనికులు ఆక్రమించుకునే దురాక్రమణ చర్యగా అభివర్ణించారు.

మొదటిది, జులై 11వ తేదీన బ్రిటిష్ శత కోటీశ్వరుడు, వర్జిన్ గ్రూప్ కంపెనీల అధిపతి అయిన 71 ఏళ్ల రిచర్డ్ బ్రాన్సన్ మరో అయిదుగురితో కలిసి తన "స్వంత" అంతరిక్ష విమానంలో అంతరిక్షం అంచుల వరకు వెళ్లి వచ్చిన యాత్ర. రెండవది, అదే నెల 20వ తేదీన అమెజాన్ సంస్థ అధిపతి, ప్రపంచంలో అత్యధిక ధనవంతుడైన 57 ఏళ్ల జెఫ్ బెజోస్ మరో ముగ్గురితో కలిసి తన న్యూ షెపర్డ్ రాకెట్‌లో అంతరిక్ష యానం చేసి తిరిగి వచ్చిన ఘటన. అమెరికాకు చెందిన మరో శత సహస్ర కోటీశ్వరుడు టెస్లా కంపెనీ యజమాని అయిన 50 ఏళ్ల ఎలోన్ మస్క్ తన స్పేస్ ఎక్స్ సంస్థ తయారు చేసిన డ్రాగన్ వి2 అనే అంతరిక్ష వాహనంలో త్వరలోనే వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకుపోతానని ప్రకటించాడు. ఇప్పటికే బెజోస్ తన అంతరిక్ష సంస్థ బ్లూ ఆరిజిన్ ద్వారా భవిష్యత్తులో అంతరిక్ష యానం చేసేయాలనుకున్న వారికి 10 కోట్ల డాలర్ల (రూ. 750 కోట్ల) టిక్కెట్లు అమ్మేశాడు. బహిరంగ వేలంలో ఒక టిక్కెట్టు ధర 2.8 కోట్ల డాలర్లు (సుమారు రూ. 200 కోట్లు) పలికింది. అంతరిక్ష ప్రయివేటీకరణ రేస్‌లో బెజోస్ ముందున్నాడని తెలుసుకున్న బ్రాన్సన్ బెజోస్ కంటే పది రోజుల ముందుగానే తన యాత్ర ప్రారంభించి పోటీకి తెరలేపాడు. వీరిద్దరికీ పోటీగా ఎలాన్ మస్క్ తన స్పేస్ ఎక్స్ అంతరిక్ష నౌకలో ప్రయాణీకులను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికీ, చంద్రుని మీదకూ తీసుకుపోతానని ప్రతిజ్ఞ చేశాడు.

నిజానికి పోటీ పడుతున్న ఈ ముగ్గురూ ఎటువంటి అంతరిక్ష పరిశోధనలు చేయలేదు, కొత్త అంతరిక్ష టెక్నాలజీ రూపొందించలేదు. కానీ చేసిందేమిటంటే ప్రపంచ ప్రజలందరి ఉమ్మడి కృషితో తయారైన రాకెట్ టెక్నాలజీని తమ డబ్బు సంచులతో కొనేసి, ప్రపంచ ప్రజల ఉమ్మడి ఆస్తి అయిన అంతరిక్షాన్ని కూడా ప్రయివేటీకరణ బాట పట్టిస్తున్నారు. అందుకనే వీరి అంతరిక్ష యానాలు పురోగామి చర్యలు కాదు తిరోగామి చర్యలని చెప్పేది. జులై 20 జెఫ్ బెజోస్ అంతరిక్షంలోకి వెళ్లి వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో వచ్చిన ఈ వ్యాఖ్యానాలే ఈ విషయాన్ని తెలియజేస్తున్నాయి: "అతన్ని మళ్లీ కిందకు తీసుకురావడం సిగ్గుమాలిన చర్య" అని ఒక వ్యక్తి వ్యాఖ్యానిస్తే, మరొకరు "వాణిజ్య ప్రపంచాన్ని సర్వనాశనం చేస్తున్న ఈ వ్యక్తి పది నిమిషాల వైభోగానికి ఎంత ఖర్చు చేస్తున్నాడో చూడండి. ఈ ఒక్క యాత్ర కోసం ఆయన తన దగ్గర పనిచేస్తే మొత్తం ఉద్యోగులు తమ జీవితాంతం సంపాదించినంత ఖర్చు చేశాడు" అని ఈసడించాడు. "మీ ఉద్యోగులకు మంచి జీతాలు, మంచి పని పరిస్థితులు కల్పిస్తే దీనికన్నా అది అందరికీ స్ఫూర్తి దాయకంగా ఉంటుంది" అని మరొకరు వ్యాఖ్యానించారు. అయితే బెజోస్ ఆధ్వర్యంలోని 'వాషింగ్టన్ పోస్ట్', మరో శతకోటీశ్వరుడు రూపర్ట్ మర్డోక్ నాయకత్వంలోని 'న్యూయార్క్ పోస్ట్' వంటి పత్రికలు మాత్రం బెజోస్, బ్రాన్సన్ ప్రయివేటు అంతరిక్ష యాత్రను ఆకాశానికెత్తి ప్రచారం చేశాయి.

### కొత్తదనం లేనే లేదు

కాని వాస్తవం ఏమంటే బ్రాన్సన్, బెజోస్‌ల అంతరిక్ష యాత్రల్లో కొత్తదనం గానీ, లేక కొత్త సాంకేతిక అభివృద్ధిగానీ అసలు లేనే లేదు. మొదటి విషయం, వీరిది తొలి ప్రయివేటు అంతరిక్ష యానం కాదు. ఎందుకంటే ఇంతకుముందే 2001 ఏప్రిల్ 30న అమెరికన్ శతకోటీశ్వరుడు డెన్నిస్ టిటో 2 కోట్ల డాలర్లతో (సుమారు రూ 150 కోట్లతో) టికెట్ కొనుక్కుని రష్యాకు చెందిన సోయుజ్ రాకెట్‌లో భూకక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించి వచ్చాడు. ఆయన తరువాత అనేక మంది టిక్కెట్లు కొనుక్కుని అంతరిక్ష యానం చేశారు. అయితే వీరెవరూ స్వంత అంతరిక్ష విమానాల్లోగానీ, ప్రయివేటు రాకెట్లలో గానీ ప్రయాణించలేదు. ప్రభుత్వాల ఆధ్వర్యంలోని అంతరిక్ష సంస్థలు తమ కార్యకలాపాల్లో అనుబంధ చర్యగా ఈ ప్రయివేటు వ్యక్తులను అంతరిక్షంలోకి తీసుకుపోయాయి.

రెండవది, బ్రాన్సన్, బెజోస్‌లు నిజానికి అంతరిక్ష యాత్రలు జరపలేదని నిపుణులు వాదిస్తున్నారు. నిజమైన అంతరిక్షం అంటే భూమిచుట్టూ ఉండే స్థిర కక్ష్యను చేరడం. అక్కడ గురుత్వాకర్షణ రహిత స్థితి ఉంటుంది. కానీ బ్రాన్సన్ అంతరిక్ష విమానం భూమి నుండి కేవలం 86 కిలో మీటర్ల ఎత్తుకు వెళ్లి వెంటనే

కిందికి దిగిపోయింది. మొత్తం ప్రయాణం గంటలోపే అందులో 45 నిమిషాల పాటు విమానం నెమ్మదిగా 15 కిలో మీటర్ల ఎత్తుకు ఎగిరింది. ఆ ఎత్తులో విమానానికి అతికించి ఉన్న అంతరిక్ష వాహనం రాకెట్ ఇంజిన్ మండడంతో దాని వేగం శబ్దానికన్నా మూడు రెట్లు అధికం అయింది. ఈ వేగంతో ఒక్క నిమిషంలోనే అంతరిక్ష వాహనం భూమి నుండి 86 కిలో మీటర్ల ఎత్తుకు చేరుకున్నది. అక్కడ రాకెట్ ఇంజిన్ వేరుపడ్డంతో అంతరిక్ష విమానం కిందికి ప్రయాణం సాగించింది. 20 కిలో మీటర్ల ఎత్తుకి దిగిన తరువాత విమానం వెనుక రెక్కలను నియంత్రిండం ద్వారా విమానం వేగాన్ని తగ్గించి మామూలు విమానం మాదిరిగా కిందికి దించారు. ఈ విన్యాసాలు చేయడానికి విమానంలో ఇద్దరు పైలట్లు ఉన్నారు. భూమి నుండి 100 కిలో మీటర్ల ఎత్తులోని సరిహద్దును కర్మాన్ రేఖ అంటారు. ఈ రేఖ దాటిన తరువాత అంటే నేల నుండి 100 కిలో మీటర్ల ఎత్తు తరువాత అంతరిక్షం వచ్చినట్లు అంతర్జాతీయ వైమానిక ఫెడరేషన్ నిర్ణయించింది. కానీ బ్రాన్సన్ విమానం 86 కిలో మీటర్ల ఎత్తుకు మాత్రమే వెళ్లింది కాబట్టి దాన్ని అంతరిక్షంగా పిలవకూడదు అనేది నిపుణుల అభిప్రాయం. అయితే అమెరికా అంతరిక్ష సంస్థ 80 కిలో మీటర్లు దాటిని తరువాత నుండి అంటే స్ట్రాటో స్పియర్ వద్ద నుండి అంతరిక్షంగా పరిగణిస్తోంది కాబట్టి తనది అంతరిక్షయానమే అంటాడు బ్రాన్సన్. అయితే బెజోస్ అంతరిక్ష వాహనం కర్మాన్ రేఖను అంటే 100 కిలో మీటర్లు దాటి పైకి వెళ్లింది. ఈయన టిక్కెట్లను గరిష్టంగా అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు తన వాహనంలో పైలట్లు గానీ, సిబ్బంది గానీ లేకుండా పూర్తి ఆటోమేటిక్ వాహనాన్ని రూపొందించాడు. రాకెట్‌కు థ్రస్టర్లు ఉండవు. కేవలం 7 నిమిషాల్లో ఇది యాత్ర ముగించుకుని స్పేస్ కాప్స్యూల్ పారాచూట్ సహాయంతో కిందికి దిగుతుంది. అయితే ఈ రెండు వాహనాలు కూడా అంతరిక్ష కక్ష్య దిగువ (సబ్-ఆర్బిటల్) యాత్రలు మాత్రమే నిర్వహించాయి. అలాన్ మస్క్ మాత్రం తనది నిజమైన అంతరిక్ష యాత్ర అంటున్నాడు. ఆయన తన స్పేస్ ఎక్స్ రాకెట్‌లో వ్యోమగాములను కొన్ని రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో గడపడానికి పంపిస్తున్నాడు.

> **“ కాని వాస్తవం ఏమంటే బ్రాన్సన్, బెజోస్‌ల అంతరిక్ష యాత్రల్లో కొత్తదనం గానీ, లేక కొత్త సాంకేతిక అభివృద్ధిగానీ అసలు లేనే లేదు. మొదటిది, వీరిది తొలి ప్రయివేటు అంతరిక్ష యానం కాదు. రెండవది, బ్రాన్సన్, బెజోస్‌లు నిజానికి అంతరిక్ష యాత్రలు జరపలేదని నిపుణుల వాదన. నిజమైన అంతరిక్షం అంటే భూమిచుట్టూ ఉండే స్థిర కక్ష్యను చేరడం. అక్కడ గురుత్వాకర్షణ రహిత స్థితి ఉంటుంది. కానీ బ్రాన్సన్ అంతరిక్ష విమానం భూమి నుండి కేవలం 86 కిలో మీటర్ల ఎత్తుకు మాత్రమే వెళ్లింది. ”**




రిచర్డ్ బ్రాన్సన్, జెఫ్ బెజోస్

మూడవ విషయం, ఈ అంతరిక్ష యానంలో మనుషులు గురుత్వాకర్షణ శక్తి రహిత స్థితిలోకి వెళతారని కొందరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. సబ్-ఆర్బిటల్ స్థాయిలో భూమి గురుత్వాకర్షణ శక్తి పూర్తిగా పనిచేస్తుంది. కానీ బ్రాన్సన్, బెజోస్ రాకెట్లలో వ్యక్తులు కొద్ది సేపు (నాలుగైదు నిమిషాలు) భార రహిత స్థితిని అనుభవించారు. భార రహిత స్థితి వేరు. గురుత్వాకర్షణ రహిత స్థితి వేరు. ఒక వస్తువు భూమి గురుత్వాకర్షణ శక్తికి వెలుపలకు వెళ్లిపోతే అక్కడ గురుత్వాకర్షణ రహిత స్థితి ఏర్పడుతుంది. భార రహిత స్థితి (వెయిట్‌లెస్‌నెస్) అనేది గురుత్వాకర్షణ శక్తితో సంబంధం లేకుండ ఏర్పడుతుంది. మనం జెయంట్ వీల్ ఎక్కినప్పుడు అది కిందికి దిగే సమయంలో మనకు గాలిలో తేలిపోతున్నట్లుంది. అలాగే అంతరిక్ష వాహనం ఒక్కసారిగా కిందికి దిగినప్పుడు అందులోని మనుషులు ముందుకు ప్రయాణించే వేగానికీ, గురుత్వాకర్షణ కిందికి లాగే వేగానికీ మధ్య కొద్ది సేపు ఏర్పడిన సమతుల్యత వల్ల ఆ కొద్ది నిమిషాలు మనం భార రహిత స్థితికి పోతాం. ఈ భార రహిత స్థితే అంతరిక్ష యానం చేసిన అనుభూతిని కలిగిస్తుంది. వాస్తవానికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు గురయ్యే గురుత్వాకర్షణ రహిత స్థితి (జీరో గ్రావిటీ)కీ, ఈ భార రహిత స్థితికీ సంబంధం లేదు.

### టెక్నాలజీలోనూ కొత్తదనం లేదు

బ్రాన్సన్, బెజోస్ అంతరిక్ష యానంలో గొప్ప సాంకేతిక అద్భుతాలు సాధించినట్లు వారి మీడియా ఆకాశానికి ఎత్తు తున్నది. అది కూడా నిజం కాదు. నిజానికి బ్రాన్సన్ తరహా విన్యాసాలతో అంతరిక్షంలోకి వెళ్లే టెక్నాలజీ కన్నా గొప్ప టెక్నాలజీని 1959లోనే తయారు చేశారు. ఆ టెక్నాలజీతో తయారుచేసిన ఎక్స్-15 అంతరిక్ష విమానాన్ని ఆరు దశాబ్దాల క్రితమే రూపొందించారు. ఈ టెక్నాలజీని మరింత అభివృద్ధి చేసి రూపొందించిన అంతరిక్ష వాహనంలో అమెరికా వ్యోమగామి అలాన్ షెఫర్డ్ 1961 మేలో తొలిసారి అంతరిక్షంలోకి వెళ్లి వచ్చాడు. ఇప్పుడు బ్రాన్సన్ 86 కిలో మీటర్లు, బెజోస్ 100 కిలోమీటర్లు ఎత్తుకు వెళ్లి వస్తే నాడు షెఫర్డ్ 187 కిలో మీటర్ల ఎత్తుకు వెళ్లి వచ్చాడు. అంతకన్నా ముందు 1961 ఏప్రిల్‌లో ప్రపంచ తొలి వ్యోమగామి యూరీ గెగారిన్ సోవియట్‌కు చెందిన వాస్తోక్1 వ్యోమనౌకలో గరిష్టంగా 327 కిలో మీటర్ల

(మిగతా 34వ పేజీలో)

ఆర్థిక రంగం

# కోవిడ్ 19: ద్రవ్య పెట్టుబడికి గరిష్టలాభాలు

**జాన్ బెల్లమి ఫాస్టర్**


అంతర్యుద్ధం తరువాతి కాలంలో ఎన్నడూ లేనంతగా 2021 ప్రారంభం నాటికి అమెరికా ఆర్థిక ,సామాజిక వ్యవస్థలు రెండు ధృవాలుగా చీలిపోయాయి. దూసుకుపోతున్న స్టాక్ మార్కెట్ ఫలితంగా సంపన్నులు సంపదలలో మునిగి తేలుతుంటే, అసంఖ్యాకంగా ఉన్న ప్రజలు బతుకులు ఎలా వెళ్లతీయాలో తెలియక సతమతమవుతున్నారు. కొందరయితే నానాటికీ దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోతున్నారు. ఉత్పత్తి , ఆర్థిక కార్యకలాపాలలో నెలకొన్న స్తబ్దత సమాజంలో కొందరు సంపదలతో తులతూగుతూ ఉన్నతస్థాయిలో బతకటానికి, అత్యధికులు అట్టడుగుస్థాయికి దిగజారటానికి దారితీసింది. అదే సమయంలో ద్రవ్య సంపద పోగుపడే వేగం పెరిగి, చాలా కొద్దిమంది చేతులలో కేంద్రీకృతమౌతున్నది. కోవిద్–19 మహమ్మారితో సంక్షోభం తీవ్రం అయినట్లు కనబడుతున్నప్పటికీ, అసలు సమస్య మరింత లోతయినది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలోని ద్రవ్య గుత్త పెట్టుబడి యొక్క అంతర్గత వైరుధ్యాల వ్యక్తీకరణ. అవినీతి, బలవంతంగా డబ్బు సంపాదనకు పూనుకున్నవారి కూటమి అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నది. మానవ జీవనంలోని అన్నిపార్శ్వాలనూ ప్రభావితం చేస్తున్నది.

**ద్రవ్య పెట్టుబడిగా మారిన పెట్టుబడి**

"సామాజిక, ఆర్థిక జీవనంలో పెట్టుబడిని పోగుచేసుకోవటం మౌలికాంశంగా ఉంటుంది" అని హైల్రోబ్నేర్ అనే వామపక్ష అర్థశాస్త్రవేత్త 1985లో రాసిన పెట్టుబడి యొక్క స్వభావం, తార్కికత అనే తన పుస్తకంలో పేర్కొన్నారు. ప్రధానంగా పెట్టుబడి సంచయనం, పొదుపు–పెట్టుబడి లేదా అదనపు విలువ, పెట్టుబడులలో జరిగే మార్పుల వలన పెట్టుబడిదారీ వ్యవస్థలో తాత్కాలిక లేదా దీర్ఘకాలిక ఆర్థిక సంక్షోభాలు ఏర్పడతాయి. కొత్త రంగాలలోకి పెట్టుబడులు చేరి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతున్నాయా? లేక వున్న వాటిలోకే ప్రవేశించి, అంతకు ముందున్న ఉత్పత్తినే కొనసాగిస్తున్నాయా? అన్నదే కొత్తగా వచ్చి చేరిన పెట్టుబడి అభివృద్ధికి దోహదపడుతుందా లేదా అని నిర్ణయించడంలో కీలకాంశం. తాము ఆశించే లాభాలు వస్తాయా, రావా అన్న అంచనాలను బట్టి కొత్త పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటారు.

ఈ రకంగా పరిశీలించినపుడు, అమెరికా, యూరప్ లేదా జపాన్ లాంటి గుత్తాధిపత్యం కలిగిన ఆర్థిక వ్యవస్థలు ఉన్న దేశాలలో గత 50 సంవత్సరాలుగా నికరపెట్టుబడి క్షీణిస్తూ ఉండడాన్ని చూస్తుంటే ఇది శరీరాన్ని పీల్చి పిప్పి చేసే క్షయ రోగంలాగా ఉందనిపిస్తుంది. గుత్తాధిపత్యం కారణంగా ఇప్పటికే (పరిశ్రమలలో) నిరుపయోగంగా ఉన్న అదనపు ఉత్పాదక సామర్థ్యం కొత్త పెట్టుబడులను నిరుత్సాహపరుస్తుంది. అమెరికా ఆర్థికవ్యవస్థలో దీర్ఘకాలంగా పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్య వినియోగం దిగజారుతున్నది. 1972–2019ల మధ్య పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యంలో సరాసరిన 78 శాతాన్ని మాత్రమే ఉపయోగించుకున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా పారిశ్రామిక పెట్టుబడి సంచయన క్రమం కొత్త పెట్టుబడులను ప్రోత్సహించే స్థాయిలో లేదు. పారిశ్రామిక రంగం కొత్త పెట్టుబడులను ఆకర్షించలేక స్తబ్దుగా ఉండిపోయింది.

1960–1980ల మధ్య నికర ప్రైవేటు పెట్టుబడి మొత్తం స్థూల పెట్టుబడిలో 40 శాతంగా ఉన్నది. 2000 తరువాత జాతీయ ఆదాయంలో ఇది 20 శాతానికి తగ్గింది. ప్రధాన పెట్టుబడిదారీ దేశాలలో నికర పెట్టుబడి తగ్గుతుండటాన్ని తీవ్రమైన విషయంగా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఈ రోజు ప్రపంచంలో అత్యధికంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ చైనాకు చెందిన ఆర్థికవేత్త జహున్ క్సు అన్నట్టు, "అధిక బరన్ నిష్పత్తి" (జాతీయ ఆర్థిక మిగులుకు, పెట్టుబడికి మధ్య నిష్పత్తి)" కల దేశం చైనా. జాతీయ ఆర్థిక మిగులులో కొంత భాగాన్ని నిలకడగా పెట్టుబడికి కేటాయించగల దేశం. ఆర్థిక మిగులు అంటే – జాతీయ ఉత్పత్తికి, వేతన ఆదాయాలకు, లేదా వినియోగానికి మధ్య ఉన్న అంతరం – స్థూల సంపదల ఆదాయాలు– (లాభాలు, అద్దెలు, వడ్డీలు). పై 10 శాతం ప్రజల ఆదాయాలను దేశం యొక్క ఆర్థిక మిగులుగా జహున్ క్సు పరిగణించారు. ఆ ప్రాతిపదికన ఆర్థిక మిగులులో 80 శాతాన్ని చైనా పెట్టుబడిగా పెట్టింది. అందువలనే 7 శాతం లేదా అంతకు మించిన అభివృద్ధి సాధించింది. అందుకు భిన్నంగా బడా పెట్టుబడిదారీ దేశాలైన జి–7 (అమెరికా, జపాన్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా) దేశాలలో బరన్ నిష్పత్తి అతి తక్కువగా ఉంది. జాతీయార్థిక మిగులులో 50 శాతం కన్నా తక్కువ పెట్టుబడి పెడుతున్నాయి. అందువలన ఆయా దేశాలలో దశాబ్దాలుగా వార్షిక అభివృద్ధి క్రమంగా దిగజారుతున్నది.



రచయిత అమెరికాలోని ఓరెగావ్ యూనివర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసర్, మంత్లీ రివ్యూ పత్రిక సంపాదకుడు

ఈ పరిస్థితులలో ఒక ముఖ్యమైన ప్రశ్న ఉదయిస్తుంది: కార్పొరేట్ల వద్ద, వ్యక్తులుగా ఉన్న పెట్టుబడిదారుల వద్ద పోగుపడిన, పెట్టుబడి పెట్టని ఆర్థిక మిగులు పరిస్థితి ఏమిటి? అందులో కొంత మొత్తం పెట్టుబడిదారుడు తన అవసరాల కోసం ఉపయోగించుకుంటాడు. అయితే ఇందుకు పరిమితులు ఉన్నాయి. ఈనాటి వ్యవస్థలో ధనికులు ఎంతటి విలాసవంతమైన జీవితాలు గడిపినా ఖర్చుచేయలేనంత అధికస్థాయిలో ఆర్థిక దోపిడీ ఉన్నది. మరో ముఖ్యమైన విషయం,

**" రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టని మిగులు పెరుగుతూ వచ్చింది. మాంద్యంలో ద్రవ్య పెట్టుబడులు తగ్గుతాయి. కానీ ఆ తరువాత ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు అనుగుణంగా పెట్టుబడులు పెరగకపోవడం వలన ద్రవ్య పెట్టుబడులు పెరిగిపోతుంటాయి. ప్రతి మాంద్యదశలోనూ, "మార్కెట్లు కుప్పకూలిపోతాయని" చెబుతూ ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించి, కార్పొరేట్లకువరాల జల్లులు కురిపించటం ఆకస్మికంగా ద్రవ్య పెట్టుబడులు పెరగడానికి మరో కారణం. "**

పెట్టుబడిదారులు తమ వద్ద ఉన్న ఆర్థిక మిగులులో అత్యధిక భాగాన్ని వినిమయ వస్తువులు కొనడానికి వినియోగించరు. మరింత సంపద పోగు చేసుకునేందుకే వినియోగించాలనుకుంటారు.

ఆర్థికమిగులు నుండి కొంతభాగం ప్రభుత్వం చేసే ఖర్చులకు తీసుకుంటుంది. కాని ప్రభుత్వ లోటు వ్యయం కూడా కార్పొరేట్ల పన్నులు, పెట్టుబడి వ్యయాలకు మించి లాభాలను పెంచుతుంది. ఫలితంగా ప్రభుత్వ లోటు వ్యయం, పెట్టుబడులు పెట్టడంలో స్తబ్దత కలిసి కార్పొరేట్ల ఖజానాలలోని ద్రవ్య పెట్టుబడులను (ఫ్రీ క్యాష్) విపరీతంగా (నాటకీయంగా)పెంచుతాయి. సమాజంలో రెండు విభిన్న ధ్రువాలు ఏర్పడటంలో ద్రవ్య పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయి. కార్పొరేట్ పన్నులు చెల్లించిన తరువాత, అరుగుదలను తీసివేయగా పెట్టుబడి పొందిన లాభాలను ద్రవ్య పెట్టుబడులుగా క్రైగ్ మెడలైన్ చెబుతున్నారు.

విస్తృత పరిధిలో ఉపయోగించే ఈ ద్రవ్య పెట్టుబడులలో నికరవడ్డీ కూడా చేరి ఉంటుంది. అంటే విస్తృత అర్థంలో –పన్నులు చెల్లించిన తరువాత కార్పొరేట్ల లాభాలు – తరుగు – నికర వడ్డీ – ద్రవ్య పెట్టుబడులు అవుతాయి. ఈ ద్రవ్య పెట్టుబడి కార్పొరేట్ల అధీనంలో ఉంటుంది. భాగస్వాములకు డివిడెండ్ల రూపంలో పంచటం లేదా కార్పొరేట్లు తిరిగి వాటాలను స్వాధీనం చేసుకునేందుకు దీనిని ఉపయోగిస్తారు.

మైఖేల్ కలెక్కి పరిశోధనలను మరింత ముందుకు తీసుకుని వెళుతూ ఫెడరల్ ప్రభుత్వలోటు, కార్పొరేటేతరులు పెట్టుబడులు పెట్టగా మిగిలిన పొదుపును (ఇప్పుడది లోటులో ఉంది) తీసివేసి, దానికి కరెంటు ఖాతాలో నిల్వ ఉన్న మొత్తాన్ని కలిపితే ద్రవ్య పెట్టుబడులవుతాయని మెడలైన్ నిరూపించారు. అందువలన మూడు అంశాలు 1) ఫెడరల్ ప్రభుత్వ లోటు 2) దేశం యొక్క వాణిజ్య ఖాతాలో నిల్వ 3) కార్పొరేటేతర రంగం లోటు వ్యయం (డెఫిసిట్ స్పెండింగ్ – ఇందులో కార్పొరేటేతర వాణిజ్యం, గృహ, వ్యక్తిగత వనరులు) ద్రవ్య పెట్టుబడికి ప్రధాన భూమికగా ఉంటాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత నుండి అమెరికా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టని మిగులు పెరుగుతూ వచ్చింది. 1980ల తరువాత దీర్ఘకాలం కార్పొరేట్ పన్నులు తరుగుతూ రావడం, ఫెడరల్ ప్రభుత్వ లోటు పెరుగుతుండడం, నికర పెట్టుబడులు క్షీణిస్తుండడంతో అమెరికా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య పెట్టుబడులు ప్రధాన భాగమైనాయి.

మాంద్యంలో (దిగజారుతున్న వాణిజ్య కార్యకలాపాలు, ఆదాయాలు) ద్రవ్య పెట్టుబడులు తగ్గుతాయి. కానీ ఆ తరువాత ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు అనుగుణంగా పెట్టుబడులు పెరగకపోవడం వలన ద్రవ్య పెట్టుబడులు పెరిగిపోతుంటాయి. ప్రతి మాంద్యదశలోనూ, "మార్కెట్లు కుప్పకూలిపోతాయని" చెబుతూ ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించి, కార్పొరేట్లకు విచ్చలవిడిగా వరాల జల్లులు కురిపించటం ఆకస్మికంగా ద్రవ్య పెట్టుబడులు పెరగడానికి మరో కారణం.

ఈ పరిస్థితులను మరోలా కూడా అర్థం చేసుకోవచ్చు. కార్పొరేట్లు పెట్టుబడులు పెట్టాలనుకుంటే వారి వద్ద ఉన్న ద్రవ్య పెట్టుబడులను వినియోగించవచ్చు. నిజానికి కార్పొరేట్లు పెట్టే పెట్టుబడులకు వారి వద్ద నిల్వలు ఉండాల్సిన అవసరం గాని లేదా మిగులు ఉండాల్సిన అవసరం గాని లేదు. ఎందుకంటే చాలా కాలం కిందటే జోసెఫ్ షుంపీటర్ చెప్పినట్టు, వ్యవస్థే "ముందస్తు రుణాన్ని" కల్పిస్తుంది. పెట్టుబడులు పొదుపును నిర్ణయిస్తాయి గాని పొదుపు పెట్టుబడులను నిర్ణయించదని జాన్ మేనార్డ్ కీన్స్, కలెక్కి కూడా స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రస్తుతం ఉన్న ద్రవ్య గుత్త పెట్టుబడి దశలో లాభాలను ఆర్జించి పెట్టే పెట్టుబడుల కన్నా కార్పొరేట్ల వద్ద నగదు నిల్వలు చాలా అధికంగా ఉన్నాయి. 2020 మొదట్లో విత్తేతర కార్పొరేట్ల వద్ద నాలుగు లక్షల కోట్ల డాలర్ల నగదు నిల్వలు ఉండేవి. 2020 ముగిసే నాటికీ అవి ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేరాయి. ఫెడరల్ రిజర్వు గణాంకాల ప్రకారం అమెరికా స్థూల జాతీయోత్పత్తిలో విత్తేతర కార్పొరేట్ల వద్ద ఉన్న నగదు నిల్వలు 1990 నుండి నేటికి మూడురెట్లు పెరిగాయి.

ఏ సమయంలో అయినా విత్తేతర కార్పొరేట్ల వద్ద ఉన్న మొత్తం నగదుని ద్రవ్య పెట్టుబడిగా భ్రమ పడకూడదు. ద్రవ్య పెట్టుబడి నగదు నిలవే, కానీ అది ఏ ఏడాది కాలంలో అయినా పెట్టుబడి పెట్టగా కార్పొరేట్ల వద్ద మిగిలిన నగదు ప్రవాహంలో భాగం. ఇందులో అత్యధిక భాగం నగదు రూపంలో నిల్వ ఉండదు. అప్పటికే స్థాపించబడి ఉన్న పరిశ్రమలను కొనడానికో, ఉన్న పరిశ్రమలలో ఇతరుల వాటాలు కొనడానికో లేదా ఇతర ద్రవ్య సాధనాలు కొనడానికో ఉపయోగిస్తారు. ఫెడరల్ రిజర్వు నగదు ప్రవాహాన్ని నిర్ణయించేటప్పుడు కార్పొరేటేతర ఖాతాలలో ఉన్న నగదు నిల్వలను పరిగణిస్తుంది. దీనికి త్రైమాసిక గణాంకాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. విత్తేతర కార్పొరేట్ సంస్థల అధీనంలోని నగదు, స్థూల జాతీయోత్పత్తిలో భాగంగా త్వరితగతిన నగదు పెరగటం ఆర్థికవ్యవస్థలు పెట్టుబడులను వినియోగించుకోవటం నుండి సట్టా వ్యాపారం లోకి మారటాన్ని సూచిస్తుంది.

ఇదివరకు చూసినట్టు కార్పొరేట్లు తమ వద్ద ఉన్న ఆర్థిక మిగులును కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి ఉపయోగించకపోతే – ప్రధానంగా ఆర్థిక వ్యవస్థలో అదనపు సామర్థ్యం ఉండడం వలన పెట్టుబడులు పెట్టగల అవకాశాలు తగ్గుతుంటాయి – వారి వద్ద ద్రవ్య పెట్టుబడులు పెద్ద ఎత్తున నిల్వ ఉంటాయి. ఇందులో కొంతభాగాన్ని వాటాదారులకు పంచడం లేదా వాటాలు తిరిగి కొనుక్కోడానికి ఉపయోగిస్తారు. వాటాలు కొనడం, పరిశ్రమలను కలుపుకోవడం వగైరాలతో పాటు ద్రవ్య పెట్టుబడులను వినియోగించి, కార్పొరేట్ ద్రవ్య నిర్వహణా విధానాల ద్వారా అధిక లాభాలు పొందడానికి' కొత్త యాజమాన్య పద్దతులను ఉపయోగిస్తుంటారు. దీనివలన అనేక రకాల కొత్త ద్రవ్య సాధనాలు అమలులోకి వస్తాయి. కార్పొరేట్లు వారి వద్ద ఉన్న నగదులో కొంత భాగాన్ని వారు తీసుకున్న రుణాలకు హామీగా ఉపయోగిస్తారు.

> “ గతంలో ఒకదేశ స్థిర పెట్టుబడికి, దాని ఆర్థిక ప్రగతికి సంబంధం ఉండేది. దీనినే పెట్టుబడి సంచయనం అన్నారు. రెండూ కలిసే పెరిగేవి లేదా తరిగేవి. క్రమంగా పెట్టుబడి 'నకిలీ'రూపం సంతరించుకుని "ఊహాత్మక పెట్టు బడి"గా రూపాంతరం చెందుతుందని పెట్టుబడి ఏర్పడుతున్న తొలి దశలోనే మార్క్స్ చెప్పారు. అంటే ఇటువంటి సంపద వైపుకు ఆర్థిక కార్యకలాపాలు మళ్ళిఅవి ఉత్పత్తి సంచయనానికి సమాంతరంగా, సాపేక్షంగా స్వతంత్రంగా తయారైనప్పుడు అది సట్టా పెట్టుబడిగా రూపాంతరం చెందుతుంది. ”

జాతీయ ఆదాయంలో విత్తేతర కార్పొరేట్ల రుణాలు పెరగడంతో సట్టా వ్యాపారం కూడా పెరుగుతుంది. తెచ్చుకున్న అప్పులపైనే సట్టా వ్యాపారం ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇది కొంతవేరకే నగదు మీద ఆధారపడుతుంది. ఇందులో అప్పులు ఎగగొట్టిన వారి వలన ఏర్పడ్డ నష్టాల నుండి కాపాడడం కోసం కూడా నగదు నిల్వలను సిద్ధంగా ఉంచుకోవలసి వస్తుంది. అందువలన మొత్తం వ్యవస్థ అంతా పేకమేడలా తయారవుతుంది.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ క్రమంగా ద్రవ్య ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. అందువలన ద్రవ్య ఉపరితలం పెరిగి, దాని కింద నున్న ఉత్పత్తి ఆర్థికవ్యవస్థ కృశించి పోతుంటుంది. దానితో ఆస్తుల విలువలు పెరుగుతూ బుడగలు ఏర్పడతాయి. అదే సమయంలో ప్రపంచ ఆర్థికవ్యవస్థ కూలిపోయే ముప్పు పెరుగుతుంటుంది. 2000, 2008 లలో ఏర్పడిన ద్రవ్య సంక్షోభాల వలన ఆర్థికవ్యవస్థలు కుప్పకూలకుండా కేంద్ర బ్యాంకులు అడ్డుకున్నాయి. ఆర్థికవ్యవస్థలు అతలాకుతలమయినప్పుడల్లా ద్రవ్యవ్యవస్థను నిర్వహించే అధికారులు రంగంలోకి దిగి ఉపరితల వ్యవస్థలోకి పెద్ద ఎత్తున నగదును జొప్పిస్తున్నారు. ఇది భవిష్యత్తులో సరికొత్త బుడగలు ఏర్పడడానికి కారణమవుతుంది.

ఒక పరిశ్రమ తయారు చేసిన ఉత్పత్తిని అమ్మడం వలన భవిష్యత్తులో సంపాదించే లాభాల మీద సైద్ధాంతికంగా స్టాక్ విలువలు ఆధారపడి ఉండాలి. కాని ఈ రోజు ఉత్పత్తి నుండి డబ్బు వేరు పడి స్వంతంత్రమైనదిగా మారిపోయింది. సట్టా వ్యాపారంతోనే బుడగలు ఏర్పడడానికి కారణం అవుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థలో మాంద్యం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి పాకుతూ అంటువ్యాధిలాగా వ్యాపిసున్నది. ఆర్థికవ్యవస్థలు పేకమేడల్లా కుప్పకూలకుండా ద్రవ్య అధికారులు జోక్యం చేసుకుని నిలుపుతున్నాను. అందువలన సట్టా వ్యాపారంలో నష్టాలూ తగ్గుతున్నాయి. మిగిలిన సంపదలు, ఆదాయాలలాగే వాటాలు, ఇతర ఆస్తుల ధరలు కూడా దీర్ఘకాలంలో పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులలో సంపదలు పెంచుకోడానికి ఉత్పాదక ఆర్థికవ్యవస్థ స్థానాన్ని సట్టా వ్యాపారం తీసుకుంది. "ఉత్పత్తి చేయకుండా లాభాలు" పొందే పరిస్థితులు ఏర్పడ్డాయి.

గతంలో ఒకదేశ స్థిర పెట్టుబడికి, ఆ దేశ ఆర్థిక ప్రగతికి సంబంధం ఉండేది. దీనినే ఆడం స్మిత్, కార్ల్ మార్క్స్ నుండి కీన్స్ వరకు పెట్టుబడి సంచయనం అన్నారు. రెండూ కలిసే పెరిగేవి లేదా తరిగేవి. క్రమంగా పెట్టుబడి 'నకిలీ'రూపం సంతరించుకుని "ఊహాత్మక పెట్టుబడి"గా రూపాంతరం చెందుతుందని పెట్టుబడి ఏర్పడుతున్న తొలిదశలోనే మార్క్స్ చెప్పారు. అంటే ఇటువంటి సంపద వైపుకు ఆర్థిక కార్యకలాపాలు మళ్ళి వాటి విలువలు పెరిగితే, అవి ఉత్పత్తి సంచయనానికి సమాంతరంగా, సాపేక్షంగా స్వతంత్రంగా తయారయినప్పుడు అది సట్టా పెట్టుబడిగా రూపాంతరం చెందుతుంది.

1980ల మధ్య నుండి జాతీయ ఆదాయంలో వాటాల విలువలు 300 శాతం పెరిగాయి. దీనికి సట్టా వ్యాపారం తోడై సంపద విపరీతంగా పెరిగింది. సంపద పెరుగుదలలో ఉత్పాదక పెట్టుబడి ప్రాముఖ్యత తగ్గింది. ఇది సమాజంలోపై స్థాయిలో ఉన్నవారి వద్ద సంపద పోగుపడదానికి దోహదపడింది. అమెరికాలో ఆర్థికంగా పైస్థాయిలో ఉన్న 10 శాతం మంది స్టాక్ మార్కెట్‌లో 88 శాతం వాటాలను, పైనున్న 1 శాతం ప్రజలు 56 శాతం వాటాలను కలిగి ఉన్నారు. మిగిలిన అన్ని పరిస్థితులు స్థిరంగా ఉన్నప్పుడు జాతీయ ఆదాయంలో సాపేక్షంగా వాటాల విలువలు పెరిగితే అసమానతలు విపరీతంగా పెరుగుతాయి.

పైన మనం చూసిన పెట్టుబడి గురించి (పెట్టుబడి, ఆదాయ నిష్పత్తి) ఉన్న రెండు అభిప్రాయాలను ఇక్కడ ఇవ్వడం జరిగింది, ఒకటి– చారిత్రకంగా ఉన్న పెట్టుబడి విలువ నుండి తరుగు తీసివేయడం, పెట్టుబడి వాటాల సంచయనం అన్న భావనకు కట్టుబడి ఉండడం. రెండోది స్టాక్ ఈక్విటీస్ విలువలు పెరగడం (సాంప్రదాయ ఆర్థికశాస్త్రం వీటిని సంపదగానే పరిగణించింది గాని పెట్టుబడిగా పరిగణించ లేదు). పేరున్న ఆర్థికవేత్తలు దీర్ఘకాలంలో జాతీయ ఆదాయంతో పాటుగా ఈ రెండు ఒకే తీరుగా ఉంటాయన్న భావనలో ఉన్నారు. "స్టాక్ మార్కెట్ వాటాలు కార్పొరేట్ పెట్టుబడికి ప్రతిరూపాలు. అవి జాతీయ ఆదాయం కన్నా తీవ్రంగా ఒడిదుడుకులకు గురవుతాయి. మాంద్యం కాలంలో సంపద–ఆదాయాల నిష్పత్తి గమనించదగినంతగా తగ్గవచ్చు, కానీ అదే సమయంలో ఉత్పత్తి పెట్టుబడి వాటాల విలువలు గాని, భవిష్యత్తులో వాటి నుండి ఆశించగల ఆదాయ శక్తి గాని ఏ మాత్రం మారకపోవచ్చు లేదా అతి తక్కువ స్థాయిలో మారవచ్చు. కానీ దీర్ఘకాల ధోరణులను మనం పరిగణించినట్టయితే, ఈ సమస్యను పెద్దగా పట్టించుకోనక్కరలేదు" అని ఆర్థికవేత్త రాబర్ట్ సోలో చెప్పాడు.

కానీ ఆదాయాలకన్నా (స్థిర పెట్టుబడి కన్నా) వాటాల విలువలు భిన్నంగా ఉండడాన్ని విస్మరించగలమా? గడచిన వందేళ్లలో మూడో వంతుకాలం నుండి జాతీయ ఆదాయాల కన్నా వాటాల విలువలు అతి వేగంగా పెరుగుతున్నాయి. మాంద్యంలో జాతీయ ఆదాయాలతో పాటుగా వాటాల విలువలు కూడా పడిపోతాయి కానీ పెరుగుదల మొదలవగానే రెట్టింపు వేగంతో పుంజుకుంటాయి. మొత్తంగా చూసినప్పుడు ఇది సమ్మిశ్రిత ఆర్థిక విస్తరణ అని గమనించవచ్చు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో సాధారణంగా జరిగే ద్రవ్యీకరణ తీరుతో ఇది సరిపోతుంది. దీనితో పాటు ఆర్థిక వ్యవస్థలో బుడగలు కూడా పెరిగాయి. 1987, 1991, 2001, 2008 లలో బుడగలు బద్దలయ్యాయి. కానీ చివరికి ఫెడరల్ బ్యాంకు, ఇతర కేంద్ర బ్యాంకుల సహకారంతో బయటపడ్డాయి.

ఈ రోజు విలీనాలకు, వాటాల కొను గోళ్లకు ద్రవ్య పెట్టుబడులు ఏరులై పారుతూ, ఆర్థికవ్యవస్థ అంతా మహా గుత్తపెట్టుబడి(మెగా మోనోపలి) వైపుకు దారితీస్తున్నది. ఇందులో సింహభాగం సాంకేతిక రంగానిది. విశ్వమంతటినీ పెట్టుబడిదారీ వ్యవస్థ నిఘా

నీడలోకి తీసుకొచ్చి, సమాజంలోని సమాచారాన్నంతా సరుకుగా మార్చింది. ప్రతిసారి ఆర్థిక బుడగ ఏర్పడడానికి వారు చెప్పే కారణం ఒకటే. కానీ ప్రతిసారి, 'ఈసారి పరిస్థితి భిన్నంగా ఉన్నదని' అంటారు. బుడగ ఏర్పడడానికి గల వాస్తవ కారణాలకు ప్రాధాన్యత నివ్వరు. – ఎఫ్.ఏ.ఏ.ఎన్.జి.– ఫాంగ్–(ఫేస్‌బుక్, ఆపిల్, అమెజాన్. నెట్‌ఫ్లిక్స్, గూగుల్). వీటి మొత్తం పెట్టుబడి స్టాండర్డ్ అండ్ పూర్ లోని 500 సంస్థల పెట్టుబడిలో 25 శాతం ఉంది. ఇంకా పెరుగుతూనే ఉంది. సాంకేతిక రంగ ఆధిపత్యాన్ని ఇది తెలియజేస్తున్నదని ఈ సారి వారు సాకు చూపిస్తున్నారు. ఒక్క ఆపిల్ సంస్థ మార్కెట్ విలువ 2 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఆదాయాలకన్నా ద్రవ్య పెట్టుబడులపై వచ్చే లాభాలు ఎక్కువగా పెరుగుతున్నాయి కాబట్టి అమెరికాలో అసమానతలు తీవ్రమౌతున్నాయి. కానీ ఇంతకుముందు బుడగలు పేలినట్టే ఈ బుడగ కూడా పేలక మానదు.

ఫెడరల్ లోటు వలెనే అమెరికా ఎగుమతులలో మిగులు పెరగడంతోటే వారి కరెంటు ఖాతాలో ద్రవ్య పెట్టుబడుల నిల్వలు పెరిగాయని కలెక్కి చెప్పాడు. ఇటీవలి సామ్రాజ్యవాద యుగంలో మారిన అంతర్జాతీయ కార్పొరేట్ల పాత్ర వలన, నేడున్న సమగ్ర నిర్మాణ నేపథ్యంలో, కరెంటు ఖాతాలో లోటు కేవలం ద్రవ్య పెట్టుబడులను తగ్గించడంగా చూడలేము. ఇది ఇతర సమీకరణాలను మార్చవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో అమెరికన్ అంతర్జాతీయ కార్పొరేట్లు వారి అనుబంధ సంస్థల చేత, అమెరికాలోని సంస్థల తరపున, ఇతర దేశాలలో ఉత్పత్తులు చేయించి ఎగుమతులు చేస్తున్నారు. అందువలన అమెరికాలో వారి స్థిర పెట్టుబడి తగ్గుతున్నది. 2018 లో మెజారిటీ యాజమాన్యం గల అనుబంధ సంస్థల ఎగుమతుల కంటే విదేశాలలో అధికవాటాలు కలిగి ఉన్న అమెరికా అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల అమ్మకాలు 14.5 రెట్లు పెరిగాయి. అమెరికా దేశీయ కార్పొరేట్ల లాభాలలో విదేశీ కార్పొరేషన్ల లాభాలు 1950లో 4 శాతం ఉండగా 1970కి 9 శాతం , 2019లో 29 శాతంకు చేరాయి. ప్రపంచ దక్షిణ ప్రాంతాలలోకి ఉత్పత్తి తరలడానికి అక్కడ యూనిట్ శ్రమ విలువ తక్కువగా ఉండటమే కారణం. ప్రపంచ కార్మికుల వేతనాలలో ఉన్న వ్యత్యాసాన్ని వినియోగించుకొని ప్రపంచ దక్షిణప్రాంతం నుండి అదనపు విలువను దోపిడి చేయటాన్ని

“ ఫెడరల్ ప్రింటింగ్ ప్రెస్ ద్వారా అధిక మొత్తాలలో డాలర్లను ముద్రించి తాను ఎదుర్కొంటున్న కరెంట్ ఖాతా లోటును అమెరికా పూడ్చుకుంటున్నది. విదేశీ ప్రభుత్వాలు డాలర్లకు బదులుగా వస్తువులను “బ్రహ్మాండమైన బహుమతి” గా సమర్పించుకుంటూ పెద్ద మొత్తాలలో డాలర్ నిల్వలను పొందుతున్నాయి. అయితే ఏదో ఒక సమయంలో ఈ వైరుధ్యాలు బయటపడి, ప్రపంచ రిజర్వు కరెన్సీగా ఉన్న డాలర్ ఆధిపత్యానికి గండి పడక తప్పదు. ఇది అమెరికాపై ఆధారపడిన ప్రపంచంలో తీవ్రమైన ప్రకంపనలు సృష్టిస్తుంది. ”




“సామ్రాజ్యవాద అద్దె” (సామ్రాజ్యవాదులకు చెల్లిస్తున్న అద్దె) అని సమీర్ అమీన్ అన్నారు.

నాన్ ఈక్విటీ ఉత్పత్తి విధానం లేదా రెండు విడి కంపెనీలు పరస్పరం సహకరించుకొంటూ చేసే ఉత్పత్తి విధానం, పెట్టుబడి భాగస్వామ్యం (నాన్ ఈక్విటి) లేని ఉత్పత్తి పెరిగేందుకు దోహదపడింది. ఆపిల్, నైక్‌లాంటి కంపెనీలు విదేశాలలో ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టడం కంటే అతి తక్కువ ధరకు తమకు అవసరమైన వస్తువులను సబ్ కాంట్రాక్టర్ల ద్వారా తయారు చేయించుకోడానికి మొగ్గు చూపుతున్నాయి. ఇది కేవలం యూనిట్ శ్రమకి అతి తక్కువగా ధరను చెల్లించడం వలననే సాధ్యమవుతున్నది. రవాణా ఖర్చులు పోగా కూడా కంపెనీలకు 50–60 శాతం అధిక లాభాలు సమకూరుతున్నాయి. అమెరికాలో పెట్టుబడులు తగ్గినందువలన కలిగిన నష్టాన్ని విదేశాలలో ఉత్పత్తులు చేయడం వలన వచ్చిన లాభాలు పూడుస్తున్నాయి. కరెంటు ఖాతా లోటు పెరుగుతున్నా ఇది కార్పొరేట్‌ల వద్ద ఉన్న ద్రవ్య పెట్టుబడులను మరింత పెంచుతున్నది. ఫలితంగా అమెరికా ఆర్థికవ్యవస్థలో అతి సంచయన వైరుధ్యం, స్థబ్దత, ద్రవ్యీకరణ పెరిగాయి. అమెరికాలో పన్నుల భారాన్ని తప్పించుకోవటానికి అధిక శాతం ద్రవ్య పెట్టుబడులను పన్నుల బెడదలేని ప్రాంతాలకు (పన్నుల స్వర్గాలు) తరలిస్తున్నారు.

ఫెడరల్ ప్రింటింగ్ ప్రెస్ ద్వారా అధిక మొత్తాలలో డాలర్లను ముద్రించి తాను ఎదుర్కొంటున్న కరెంట్ ఖాతా లోటును అమెరికా పూడ్చుకుంటున్నది. విదేశీ ప్రభుత్వాలు డాలర్లకు బదులుగా వస్తువులను “బ్రహ్మాండమైన బహుమతి” గా సమర్పించుకుంటూ పెద్ద మొత్తాలలో డాలర్ నిల్వలను పొందుతున్నాయి. అయితే ఏదో ఒక సమయంలో ఈ వైరుధ్యాలు బయటపడి, ప్రపంచ రిజర్వు కరెన్సీగా ఉన్న డాలర్ ఆధిపత్యానికి గండి పడక తప్పదు. ఇది అమెరికాపై ఆధారపడిన ప్రపంచంలో తీవ్రమైన ప్రకంపనలు సృష్టిస్తుంది.

### కోవిడ్ మహమ్మారి సంక్షోభం – మహా విభజన

ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్థిక సిద్ధాంతాలు కోవిడ్–19 మహమ్మారి పట్ల పాక్షిక దృక్పథంతో ఉన్నాయి. ఇది కేవలం పర్యావరణం ద్వారా ఆర్థిక వ్యవస్థకు బయటి నుండి వచ్చిన విఘాతమని, దీనికి పెట్టుబడి దారీ వ్యవస్థకి ఏ సంబంధం లేదని ప్రచారం చేస్తున్నాయి. కాని కోవిడ్ మహమ్మారి వ్యాప్తికి, ప్రపంచవ్యాపితంగా పెట్టుబడి సంచరించ

> **"సామాజిక దూరాలు, లాక్‌డౌన్లు అమలవుతున్నా, నిరుద్యోగం దాదాపు 1.7 కోట్లకు చేరుకున్నా - అమెరికా స్టాక్‌మార్కెట్ మాత్రం ఏప్రిల్ 6-10 తేదీల మధ్య 1974 నుండి ఎన్నడూ ఎరగనంత ఉచ్ఛస్థాయికి చేరుకుంది. 2020 మొదటి సగభాగంలో వాల్‌స్ట్రీట్ లాభాలు అంతకు ముందటి ఏడాది కంటే 82 శాతం పెరి గాయి. 2020 మార్చి, జులై మధ్య అమెరికాలో శతకోటీశ్వరులు 70,000 కోట్ల డాలర్ల సంపదను పోగు చేసుకున్నారు. మరోవైపు కోవిడ్ వలన చనిపోతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది."**

డానికి, ప్రపంచ కార్మికుల మధ్య ఉన్న వేతన వ్యత్యాసాలకు, భూమి మీదున్న వనరులన్నిటిని త్వరితగతిన దోచుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలకు సంబంధం ఉన్నదని రోబ్ వాల్లస్, అతని సహచరులు నిరూపించారు. ఇది ప్రపంచ వ్యవసాయ వాణిజ్యంతో ముడిపడి ఉంది. రైతులను తమ జీవనాధారం నుండి దూరం చేసి, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నది. వన్యమృగాల జీవనానికి భంగం కలిగిస్తున్నది. అందువలన "జూనోసిస్" ( జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులు) వ్యాపిస్తున్నాయి. పర్యావరణ సంక్షోభం, 21వ శతాబ్దపు పెట్టుబడిదారీ విధానం చేసిన జీవ విధ్వంసమే కోవిడ్ -19 మహమ్మారికి కారణం అని సాంప్రదాయ అంటువ్యాధుల నివారణ సంస్థ స్ట్రక్చరల్ ఒన్ హెల్త్ అంటున్నది.

2020 మార్చిలో కోవిడ్-19 అమెరికా అంతటా వ్యాపిస్తుండగా స్టాక్ మార్కెట్ పతనమైంది. ఫెడరల్ రిజర్వు బ్యాంకు వెంటనే రంగంలోకి దిగి మార్చి నుండి జూన్ వరకు మార్కెట్‌లోకి 1.6 లక్షల డాలర్లను విడుదల చేసి కొనుగోలుకు అవకాశాలు కల్పించింది. తాకట్టుపై ఆధారపడిన సెక్యూరిటీల ద్వారా 700 బిలియన్ డాలర్లను విడుదల చేసింది. తాము ఎన్ని లక్షల డాలర్లనయినా గుమ్మరించడానికి సిద్ధంగా ఉన్నట్టు మార్కెట్లకు హామీనిచ్చింది. ఫలితంగా - సామాజిక దూరాలు, లాక్‌డౌన్లు అమలవుతున్నా, నిరుద్యోగం మహామాంద్యం తరువాతి కాలంలో ఎన్నడూలేని స్థాయికి, దాదాపు 1.7 కోట్లకు చేరుకున్నా – అమెరికా స్టాక్‌మార్కెట్ మాత్రం ఏప్రిల్ 6–10 తేదీల మధ్య 1974 నుండి ఎన్నడూ ఎరగనంత ఉచ్ఛస్థాయికి చేరుకుంది. 2020 మొదటి సగభాగంలో వాల్‌స్ట్రీట్ లాభాలు అంతకు ముందటి ఏడాది కంటే 82 శాతం పెరిగాయి. 2020 మార్చి, జులై మధ్య అమెరికాలో ఉన్న శతకోటీశ్వరులు 70,000 కోట్ల డాలర్ల సంపదను పోగు చేసుకున్నారు. అమెరికాలో ఒకవైపు కోవిడ్ -19 వలన చనిపోతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. సంక్షోభం వలన అమెరికాలోని కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. అదే సమయంలో అమెజాన్ శత కోటీశ్వరుడు జెఫ్ బెజోస్ సంపద 7,400 కోట డాలర్లు పెరిగింది. టెస్లా మెగా పెట్టుబడిదారులు ఎలాన్ మస్క్ సంపద 2020లో 7,600 కోట్ల డాలర్లు పెరిగింది. దానితో ఆయన కూడా శతకోటీశ్వరుల జాబితాలో చేరిపోయాడు. (పోల్చిచూసుకోడానికి– 2019 ఆర్థిక సంవత్సరంలో ఫెడరల్ ప్రభుత్వం అదనపు ఆహారం కార్యక్రమం ద్వారా లక్షలాది తక్కువ ఆదాయాల కుటుంబాలకు, స్థిరాదాయాలు గల వయోవృద్ధులకు, అంగవైకల్యం కలవారికి అందించిన సహాయం 6,230 కోట్ల డాలర్లు) ఇదంతా గమనిస్తే పెట్టుబడి పోగుప డేక్రమం సంపదను ఒకవైపున, దరిద్రాన్ని మరోవైపున కేంద్రీకరణ చేస్తుందన్న మార్క్స్ '. "ధనికులు మరింత ధనికులుగా మారే గతిశాస్త్రం" అని పికెట్టి రచనలను గురించి సోలౌ వ్యాఖ్యానించినది వాస్తవమని స్పష్టమౌతున్నది.

అమెరికన్ ప్రజల జీవితాలు సర్వ నాశనం అయ్యాయి. 2020 అక్టోబర్ నాటికి 2.5 కోట్లకు పైగా కార్మికులు మహమ్మారి వలన ప్రభావితమైనారు. అధికారిక గణాం కాల ప్రకారం అమెరికాలో 1.11 కోట్లమంది ప్రజలు అధికారికంగా నిరుద్యోగులుగా ఉన్నారు. మరో 31 లక్షల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయినప్పటికీ లాక్‌డౌన్ కారణంగా వారిని సక్రమంగా నమోదు చేయలేదు. మహమ్మారి కారణంగా 45 లక్షల మంది కార్మికుల జాబితా నుండి తొలగించబడ్డారు. 70 లక్షల మంది ఇప్పటికి ఉద్యోగులుగా ఉన్నా జీతాల కోతలు, తక్కువ గంటలు మాత్రమే పని చేస్తున్నారు. అక్టోబర్‌లో నిరుద్యోగ భృతి కోరుతూ 2.15 కోట్లమంది వినతి పత్రాలు సమర్పించారు. అద్దెలు కట్టడం, ఇంటికోసం, విద్యకోసం చేసిన అప్పులు చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారు. ఆహారభద్రత కరువైంది. మహమ్మారి కాలంలో ప్రభుత్వం తగిన సహాయం చేయకపోవటంతో ఆహార అభద్రతతో ఉన్న ప్రజల సంఖ్య 3.5 కోట్ల నుండి 5 కోట్లకు చేరుకుంది.

యు.ఎస్. ఫైనాన్సియల్ నెట్‌వర్క్ ప్రచురించిన యు.ఎస్. ఫైనాన్సియల్ హెల్త్ పల్స్ రిపోర్ట్, 2020లో అమెరికాలో మూడింట రెండు వంతుల ప్రజలు ద్రవ్యపరంగా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నాను. అందులో 20 శాతంకు సరిపడా తిండి దొరకడం లేదని, 25 శాతం తాము రాబోయే నెల కట్టాల్సిన అద్దె గురించి, అప్పుల కిస్తీల గురించి ఆందోళన పడుతున్నారని వెల్లడించారు. అయితే మహమ్మారి కారణంగా ఫెడరల్ ప్రభుత్వం నుంచి సహాయం అందుతుండటంతో ఆగస్టులో సర్వే పూర్తయే నాటికి వీరు 2019 నాటి కంటే మెరుగైన స్థితిలోనే ఉన్నారు. 2019 నాలుగో త్రైమాసికం కన్నా 2020 మూడో త్రైమాసికంలో అమెరికా ఆర్థికవ్యవస్థ 3.5 శాతం వెనకపడే ఉంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితులను అవకాశంగా తీసుకుని పై 1 శాతం మంది తమ ఆస్తులను శరవేగంతో పెంచుకున్నారు. 2020 అక్టోబర్ నాటికి పేస్‌బుక్, ఆపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్‌ల సంపద వరుసగా 20, 61, 77, 64, 61 శాతం పెరిగాయి.

ఇటువంటి వెర్రి సట్టా వ్యాపారం ఎప్పటికయినా పతనం కాక తప్పదు. ప్రస్తుతం అమెరికా ఇటువంటి బుడగనే మోస్తున్నది. ఈ బుడగ బద్దలవుతుందని చెప్పడానికి మరో రెండు కారణాలు కూడా ఉన్నాయి. వాటాల ధరలకు కంపెనీల సంపాదనకు ఉన్న నిష్పత్తి 2. వారెన్ బఫెట్ ఎక్స్‌పెన్సివ్ మార్కెట్ సూత్రాలు. చారిత్రకంగా చూస్తే షేర్ల ధరలు, కంపెనీల ఆదాయాల నిష్పత్తి సిల్లార్ సూచిక ప్రకారం 16గా ఉండాలి. కానీ ఆగష్టు 2020 లో అమెరికా స్టాక్ మార్కెట్ దీనికి రెట్టింపుకు 35కు పెరిగింది. 1929 స్టాక్ మార్కెట్ కుప్పకూలి మహా మాంద్యంలోనికి అడుగు పెట్టిన బ్లాక్ ట్యూజ్‌డే రోజు ఈ నిష్పత్తి 30గా ఉంది. 2000లో స్టాక్‌మార్కెట్ పతనమైన రోజు ఈ సూచిక 43కి చేరింది.

ఇక బఫెట్ మార్కెట్ సూత్రం ప్రకారం (విల్సహారే మార్కెట్ వేల్యూ క్యాపిటలైజేషన్

ఇండెక్స్ 5000ల ప్రకారం) స్థూల జాతీయోత్పత్తిలో స్టాక్ విలువల సరాసరి 80 శాతం ఉండాలి. 2000లలో మార్కెట్ పతనమైనప్పుడు ఈ నిష్పత్తి 130 శాతం ఉండగా, 2007లో సంక్షోభం ఏర్పడిన నాడు 110 శాతం ఉంది. 2020 ఆగస్టులో ఈ నిష్పత్తి 180కి చేరింది.

స్థూల జాతీయోత్పత్తిలో ఆర్థికేతర కార్పొరేట్ల అప్పులు ఎంత ఉన్నాయనేది ఆర్థిక వ్యవస్థ పతనాన్ని సూచించే మరో సూచిక. తక్కువ వడ్డీకి దొరికే అప్పులను తీసుకుని ఉత్పత్తితో పనిలేని వెంచర్లను, ఉదాహరణకి ఉత్పత్తులు చేస్తున్న పరిశ్రమలను కొనుగోలు చేయడం, ఇతర పరిశ్రమలను విలీనం చేసుకోవడం, ఇటువంటివే ఇతర అనేక సట్టా వ్యాపారాలను కార్పొరేట్లు చేస్తుంటారు. ఇంతకు మునుపు సంభవించిన 1991, 2000, 2008 సంక్షోభాల కాలంలో జాతీయ ఆదాయంలో కార్పొరేట్ల అప్పులు 43 నుండి 45 శాతం ఉండేవి. 2020లో ఇది 56 శాతానికి చేరింది. అంటే ఆర్థిక బుడగ పేలిపోయే దశకు చేరుకున్నదన్నమాటే.

> “ చైనా తప్ప మిగిలిన ప్రపంచమంతా ఇప్పుడు సంక్షోభంలో మునిగి ఉంది. 15 లక్షలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది సాధారణ ఉత్పత్తి కార్యకలాపాలను ధ్వంసం చేసింది., అభివృద్ధి చెందిన దేశాలలో మైనస్ 5.8 శాతంగాను, మిగిలిన దేశాలలో మైనస్ 4.4 శాతంగాను అభివృద్ధి ఉండవచ్చని అంతర్జాతీయ ద్రవ్యనిది సంస్థ అంచనా వేసింది. అంటే ఇప్పుడప్పుడే పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం నుండి బయటపడే అవకాశాలు లేనట్టే. తుఫాను గాలులు ఇంకా కొనసాగుతున్నాయి. ”

చైనా తప్ప మిగిలిన ప్రపంచమంతా ఇప్పుడు సంక్షోభంలో మునిగి ఉంది. 15 లక్షలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది సాధారణ ఉత్పత్తి కార్యకలాపాలను ధ్వంసం చేసింది., అభివృద్ధి చెందిన దేశాలలో మైనస్ 5.8 శాతంగాను, మిగిలిన దేశాలలో మైనస్ 4.4 శాతంగాను అభివృద్ధి ఉండవచ్చని అంతర్జాతీయ ద్రవ్యనిది సంస్థ అంచనా వేసింది. అంటే ఇప్పుడప్పుడే పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం నుండి బయటపడే అవకాశాలు లేనట్టే. తుఫాను గాలులు ఇంకా కొనసాగుతున్నాయి. అమెరికా తనకు అవసరమైన డాలర్లను ముద్రించుకోగలగడం, ఎగుమతులను పెంచుకోవటం కోసం తన డాలర్ విలువను తగ్గించుకొంటే (డాలర్ విలువ తగ్గించుకోడం వలన ఇతర దేశాల వద్ద నున్న డాలర్ కరెన్సీ విలువ తగ్గుతుంది) ఇతర దేశాల నుండి ప్రతిఘటన ఎదురవవచ్చు. ఇది అమెరికా ఆధిపత్యం దెబ్బతినటాన్ని వేగిరం చేస్తుంది. మిగిలిన అన్ని రంగాలలోలాగే, పెట్టుబడికి పట్టిన వైరస్ కూడా ఇతర వైరస్‌లలాగే వ్యాపిస్తుంది. చివరికి తన పునాదినే ధ్వంసం చేసుకొంటుంది. వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం ద్వారా ప్రపంచ సరుకుల మార్కెట్‌గా తన ఆధిపత్యం కొనసాగించుకోవాలని అమెరికా భావిస్తుండగా దీనికి చైనా నుండి గట్టి పోటీ ఎదురౌతున్నది. 2020లోని ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య– ఆర్‌సిఇపి–ఒప్పందానికి చైనా కేంద్రంగా ఉన్నది. ప్రపంచ వాణిజ్యంలో దీని వాటా 30 శాతం ఉన్నది.

ఆర్థిక స్తబ్దత, క్రమం తప్పకుండా ఏర్పడే ఆర్థిక సంక్షోభాలు, తరుగుతున్న ప్రపంచ ఆధిపత్యం, వీటికి తోడుగా చైనాతో పోటీ పడవలసి రావడం వలన అమెరికా చైనాతో ప్రచ్ఛన్నయుద్ధం చేస్తున్నది. చైనా నియంతృత్వ ఆకాంక్షలు,ఆధిపత్య లక్ష్యాలతో ఉందని 2020 నవంబర్‌లో యు.ఎస్. స్టేట్ డిపార్ట్‌మెంట్ నివేదికలో స్పష్టంగా పేర్కొంది. చైనా కమ్యూనిస్టుపార్టీని లక్ష్యంగా పెట్టుకొని, దాని ఆర్థిక, ఇతర బలహీనతలను వినియోగించుకొని చైనాను దెబ్బతీయాలని వ్యూహపత్రంలో పేర్కొన్నారు. అమెరికా చేతిలో ఉన్న అతి శక్తివంతమైన ఆయుధం ద్రవ్యరంగంలో అంతర్జాతీయ ఆధిపత్యం. చైనా మీద అమెరికా ద్రవ్యయుద్ధం ప్రకటించిందని చైనా మాజీ ఆర్థికమంత్రి లౌ జీవెల్ పేర్కొన్నారు. చైనాను ఆర్థికంగా అణగదొక్కి ఉంచటం జో బైడెన్ నాయకత్వంలోని అమెరికాకు అవసరమని ఆయన పేర్కొన్నాడు. అందువలన చైనా కరెన్సీని అంతర్జాతీయం చేయాలనీ, పెట్టుబడి ఖాతాను సంపూర్ణంగా మార్చుకునే వీలు కల్పించాలనీ ఇదివరకు పెట్టుకున్న లక్ష్యాలు ఇంకెంత మాత్రం అభిలషణీయమైనవి కావని లౌ నొక్కి చెపుతున్నారు. వీటివలన ఆర్థిక వ్యవహారాలపై ప్రభుత్వ నియంత్రణ తగ్గుతుందన్నారు. అందువలన చైనా అభివృద్ధికి నష్టం కలిగించే నిర్ణయాలను వాషింగ్టన్ తీసుకుంటే బీజింగ్ కూడా అమెరికాకి ఇచ్చిన 1.2 లక్షల డాలర్ల అప్పులను అందుకు బదులుగా ఉపయోగించక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని చైనా కేంద్రబ్యాంకు మాజి డిప్యూటీ గవర్నర్ చెన్ యువాన్ హెచ్చరించారు. ఆర్థికరంగంలో ఇది అణుయుద్ధంగా పరిణమిస్తుంది. దిగజారుతున్న తన ఆర్థికవ్యవస్థను కాపాడుకోడానికి, ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి తన ప్రత్యర్థి అయిన ఒక అభివృద్ధి చెందుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తీయడానికి అమెరికా పూనుకోవడం ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థకే కాదు, మొత్తం మనవాళికే అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తుంది.

### సరిహద్దు రేఖ, పెట్టుబడి అంటువ్యాధి

ప్రస్తుతం అమెరికా, పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభానికి కారణం అధిక సంచయనం. పక్వమైన గుత్తాధిపత్య వ్యవస్థలో కూడా లాభకరంగా వినియోగించుకోలేనంత అదనపు విలువను సృష్టించింది. దీనికి తోడుగా నిరుపయోగంగా ఉన్న యంత్ర వినియోగం, క్షీణిస్తున్న పెట్టుబడి, నిరంతరంగా తగ్గుతున్న అభివృద్ధి, పెరుగుతున్న సైనిక వ్యయం, ద్రవ్యరంగ తీవ్ర విస్తృతీకరణ(ఫైనాన్సియల్ హైపర్ ఎక్స్‌టెన్షన్ )లు దీనికి తోడవుతున్నాయి. వాస్తవంగా ఉన్న మిగులునంతా పెట్టుబడులు పెట్టలేని అశక్త పరిస్థితులలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నది. దీనితోపాటు ప్రభుత్వ లోటు పెట్టుబడిదారుల వద్ద ద్రవ్య పెట్టుబడులు పోగు పడడానికి దారి తీస్తున్నది. అందువలనే సట్టా సంపదల విలువలు పెరుగుతున్నాయి. ఈ పెరుగుదల కొంత మేరకు ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఉపయోగపడినా, మాంద్యానికి దారితీసే ధోరణి నుండి కాపాడ లేకపోతున్నాయి.

అందువలననే ఈనాటి గుత్తపెట్టుబడిదారీ ద్రవ్య ఆర్థిక వ్యవస్థ పూర్తిగా తర్కవిరుద్ధమైనది. యాజమాన్య పద్ధతుల ద్వారా డబ్బు ఏ విధమైన ఉత్పత్తి చేయకుండా మార్క్స్ చెప్పినట్లుగా డబ్బు–డబ్బు+ మరింత డబ్బు లేదా అదనపు విలువను సంపాదించి పెడుతున్నది. ద్రవ్య పెట్టుబడులను నిర్వహించే పెట్టుబడిదారీ విధానంలో ప్రభుత్వాల మద్దతు ఉంటేనే వ్యవస్థ నిర్మాణం కొనసాగుతుంది.

ఈ సంక్షోభ బోను నుండి తప్పించు

**" నలభై సంవత్సరాల తరువాత కూడా 2021లో పరిస్థితులు అంతకంటే భయంకరంగా కూడా ఉన్నాయి. 'పీపుల్స్ గ్రీన్ న్యూడీల్' పేరుతో జరుగుతున్న ఈనాటి పోరాటం న్యాయ మైన మార్పుకోసం, అంటే మానవాళినంతటిని రక్షించడానికి, నష్టపోతున్న వర్గాలతో పాటు పాలకవర్గాలలోని దూరదృష్టి కలవారిని కూడా కలిసిరమ్మని పిలుపిస్తున్నది. పెట్టుబడి ప్రయోజనాలకు వ్యతిరేకంగా చారిత్రకంగా సమానత్వం కోసం జరుగుతున్న పోరాటంతో కలిసి, నూతన సమాజాన్ని నిర్మించే విధంగా ఇది ఉండాలి. "**

కోవడానికి ఒక విచక్షణ గల వ్యూహం అనుసరించాలనుకుంటే-పాక్షికంగా అయినా- అమెరికా ప్రభుత్వం ప్రత్యక్షంగా పెట్టుబడులను, ప్రభుత్వ ఖర్చులను పెంచటానికి చర్యలు తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు అత్యవసర చర్యలు తీసుకోవటానికి, ప్రజారోగ్య సంక్షోభాన్ని పరిష్కరించటానికి, అత్యధిక ప్రజల గృహ వసతి అవసరాలను తీర్చటానికి, నయా ఉదారవాద హయాంలో దిగజారుతున్న ప్రభుత్వ విద్యా విధానాన్ని సక్రమమైన మార్గంలో పెట్టటానికి. జాతీయస్థాయిలో ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవటం వలన ఏర్పడుతున్న ఇబ్బందులు, ఇతర సమస్యలను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పూర్తిగా ప్రైవేటు వారి ఆధీనంలో ఉన్న ఈ రంగాల్లోకి ప్రభుత్వం అడుగు పెట్టాలంటే ప్రభుత్వం ప్రైవేటీకరణ సరిహద్దు రేఖ దాటాలి. మార్క్సిస్టు ఆర్థికవేత్త పాల్ ఏ బారన్, పాల్ ఎం.స్వీజి 1966లో తమ 'గుత్తపెట్టుబడి' గ్రంథంలో ఈ అంశాన్ని మొదట వెల్లడించారు. మెల్డెన్ అన్నట్టు, "లాభాలను ఆర్జించిపెట్టే సంస్థలన్నీ పెట్టుబడి పెట్టేందుకు సరిహద్దులుగా, దాటవీలులేని గీతలుగా చలామణి అవుతున్నాయి".

అమెరికా ఆర్థికవ్యవస్థలో ఈ సరిహద్దులు ఎంత బలమైనవంటే, టెన్నిసి వ్యాలీ అథారిటీకి బయట ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఉత్పత్తి సంస్థలు తమ స్వంత ఆంతరంగిక ఖర్చులకు, మునిసిపాలిటీల సేవలకు వసూలు చేసే మొత్తం, ప్రభుత్వ భూమి కౌలు ద్వారా వారి అవసరాలకు తగిన వనరులను సమీకరించుకోవటం సాధ్యం కాదు. కొంతభూమి, ప్రభుత్వ విద్యా విధానం, అమెరికా పోస్టల్ సేవలు, టోల్ ఫ్రీ రోడ్లు తదితరాలు మాత్రమే ' ప్రధానంగా వాటి ఆధీనంలో ఉంటాయి. తన విచక్షణను ఉపయోగించి ప్రభుత్వం చేసే ఖర్చు సైనికీకరణపైనే. అందులో పెద్ద మొత్తం సబ్సిడీల రూపంలో ప్రైవేటు పెట్టుబడి దారులకు చేరుతుంది. అప్పుడు కూడా ప్రైవేటు సంస్థలలో జొరబడకూడదు. అంతేకాదు ప్రభుత్వ విద్యలోకి, ఆరోగ్య సేవలలోకి ప్రైవేటు సంస్థలు జొరబడుతూ సరిహద్దులను చెరిపేస్తూ ప్రభుత్వాన్ని మరింత ఆవలకి నెట్టేస్తున్నాయి. పెట్టుబడి మరింత విస్తృతంగా చొచ్చుకుపోయి, మరింత ఎక్కువ లాభాలు సంపాదించటానికి ప్రయత్నిస్తున్నది.

"అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థ ఎక్కడ? అని దాదాపు నలభై ఏళ్ల కిందట మంత్లీ రివ్యూలో రాసిన ఒక వ్యాసంలో స్వీజి ప్రశ్నించారు. అప్పుడు అమెరికా ఆర్థికమాంద్యంలో కూరుకుపోయిందని, కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడటం కోసం అంతర్గతంగా ఆధిపత్యం, అణచివేత, అంతర్జాతీయంగా సైనికీకరణ, విదేశాలపై దాడులు చేయటం అనివార్యం అవుతుందని అందులో పేర్కొన్నాడు. అతని వాదనలు ఈనాడు మననం చేసుకోవడం సబబుగా ఉంటుంది. అమెరికా సామ్రాజ్యవాద సంక్షోభాన్ని పరిష్కరించటంలో రెండు సమస్యలు ఉన్నాయి. కార్మికవర్గం ఇప్పటివరకు సంఘటితంగా స్వతంత్ర రాజకీయ కార్యాచరణకు పూనుకోలేదు కాబట్టి ఇకముందు కూడా పూనుకోదనుకోవడం మొదటిది. అమెరికాలో జరిగిన వర్గ పోరాటాల చరిత్రను పరిగణనలోనికి తీసుకోకపోవడం, కొత్త పోరాట రూపాలు, విధానాలు రావనుకొంటున్న అమాయకమైన భావన నుండి ఈ ఆలోచన వస్తున్నది. తమ ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం పెట్టుబడిదారులు ఫాసిస్టుల వెనుక సంఘటితమౌతారన్న రెండవ ఆలోచన కూడా సందేహాస్పదంగానే ఉన్నది. ఈ వ్యూహం అమెరికాలోని మధ్యతరగతి, పైస్థాయిలోని మధ్య తరగతులకు చాలా నష్టదాయకమేకాక, ఇది అమెరికా పెట్టుబడి దారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కూడా కాదు. నానాటికి మరింత ఎక్కువగా సంపదను పోగుచేసుకోవటం గుత్త పెట్టుబడిదారీ విధాన మౌలిక లక్షణం. నిరుద్యోగం మాట అటుంచి, సంపన్నుల వద్ద పోగుపడే అదనపు విలువ వారు లాభదాయకంగా పెట్టగల పెట్టుబడుల కన్నా చాలా ఎక్కువ ఉంటుంది. కాని తక్కువ ఆదాయం గలవారి జీవన ప్రమాణాలను తగ్గించే ప్రయత్నం చేయడం వలన సమస్య మరింత జఠిలమవుతుంది. నిజానికి సమస్యను ఇందుకు పూర్తి భిన్నంగా పరిష్కారం చేయాలి. తక్కువ ఆదాయం గలవారి వినిమయం భారీ ఎత్తున పెంచగలగాలి. ఇది కేవలం వ్యక్తిగత వినిమయ వస్తువుల ద్వారా మాత్రమే కాకుండా పెట్టుబడిదారి వ్యవస్థలో సామూహిక వినిమయం, ప్రజలు జీవన నాణ్యతను మెరుగుపరచడం చేయాలి.

గుత్త పెట్టుబడిదారుల వలన గుత్త పెట్టుబడిదారీ విధానం వలన తీవ్రంగా నష్టపోతున్నవారు, పాలకవర్గాలలోని దూరదృష్టి గల వారితో ఒక సంఘనటను నిర్మిస్తే ఉపయోగంగా ఉంటుందని, దీనిని కార్మికవర్గం నిర్మించటం, నాయకత్వం వహించటం చేయాలని స్వీజీ ప్రతిపాదించాడు. ఇది తక్షణం ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి ప్రాధాన్యతనిస్తూ, దీర్ఘకాలంలో సమాజాన్ని విప్లవకరంగా పునర్నిర్మించడానికి దారితీస్తుందని చెప్పాడు.

నలభై సంవత్సరాల తరువాత కూడా 2021లో పరిస్థితులు అలాగే, అంతకంటే భయంకరంగా కూడా ఉన్నాయి. 'పీపుల్స్ గ్రీన్ న్యూడీల్' పేరుతో జరుగుతున్న ఈనాటి పోరాటం న్యాయమైన మార్పుకోసం, అంటే మానవాళినంతటిని రక్షించడానికి, నష్టపోతున్న వర్గాలతో పాటు పాలకవర్గాలలోని దూరదృష్టి కలవారిని కూడా కలిసిరమ్మని పిలుపిస్తున్నది. పెట్టుబడి ప్రయోజనాలకు వ్యతిరేకంగా పర్యావరణ పరిరక్షణ, చారిత్రకంగా సమానత్వం కోసం జరుగుతున్న పోరాటంతో కలిసి, నూతన సమాజాన్ని నిర్మించే విధంగా ఇది ఉండాలి. 'విస్తరిస్తున్న ద్రవ్య పెట్టుబడితో 'ఫాసిస్టు తరహా అణచివేత విధానం' 21వ శతాబ్దంలో తిరిగి తలెత్తిన పరిస్థితులలో స్వీజి సూచించినట్టు మానవ అభివృద్ధికి హామీనిచ్చే కొత్త సోషలిస్టు ఉద్యమం ప్రపంచవ్యాపితంగా కిందిస్థాయి నుండి పెరుగుతున్నది. ఇపుడు భవిష్యత్తును గురించి జోస్యం చెప్పడంలో అర్థంలేదు. పోరాటమే మార్గం.

**(అనువాదం: కె ఉషారాణి)**

# పేదరికం నిర్మూలనలో చరిత్ర సృష్టించిన చైనా

**(11వ పేజీ తరువాయి)**

నియోగం, అవినీతి మొదలైన అంశాలు దీని కిందకు వస్తాయి.

పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో అవినీతిని నిర్మూలించడానికి 2018లో క్రమశిక్షణా తనిఖీకి సంబంధించి కేంద్ర కమిషన్ (సిసిడిఐ)ని ఏర్పాటు చేశారు. సి జిన్‌పింగ్ 2013లో అధికారంలోకి వచ్చింది మొదలు అవినీతి నిర్మూలపై తీవ్రంగా దృష్టి పెట్టారు. 'ఈగల' మీద కాదు 'పులుల' మీద కేంద్రీకరించాలని ఆయన అభిప్రాయం. 2012 నుండి 2020 మధ్య కాలంలో చైనాలో 32 లక్షల మంది అధికారులను అవినీతి కేసుల్లో శిక్షించారు. పేదరిక నిర్మూలనా పథకాల్లో లక్షా 61 వేల మంది అధికారులు అవినీతికి పాల్పడినట్లు ప్రభుత్వం గుర్తించింది. సోషలిజం నిర్మాణంలో అవినీతిపై పోరాటం వర్గ పోరాటంలో ఒక భాగం. చైనాలో చేపట్టిన అవినీతి వ్యతిరేక పోరాటానికి ప్రజల నుండి గట్టి మద్దతు లభించింది. ఇది పార్టీలో కూడా గట్టి విశ్వాసం పెంపొందించింది.

**సవాళ్లు, అవకాశాలు**

చైనాలో పేదరిక నిర్మూలనా కార్యక్రమం చరిత్రలోనే ఎన్నడూ చూడని అతి పెద్ద విజయం. సోషలిజం సాధనలో ఇది ఒక దశ మాత్రమే. దీన్ని మరింత లోతుగా, విస్తృతంగా అమలు చేయాలి. గ్రామీణ ప్రాంత ప్రజలను సంపన్నులుగా మార్చేందుకు చైనా ప్రభుత్వం గ్రామీణ పునురుత్తేజ కార్యక్రమం ప్రారంభించింది. పేదరిక నిర్మూలనా కార్యక్రమం పునాదిపై ఆధారపడి ఈ కార్యక్రమం అమలవుతుంది. వ్యవసాయ ఉత్పత్తిని ఆధునీకరించడం, జాతీయ ఆహార భద్రతను కాపాడ్డం, ఉన్నతమైన వ్యవసాయ భూమిని అభివృద్ధి చేయడం, పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య అగాధాన్ని పూడ్చడం ఈ 'గ్రామీణ పునరుత్తేజ' కార్యక్రమంలోని ముఖ్యాంశాలు.

చైనా 14వ పంచవర్ష ప్రణాళిక 2025తో ముగుస్తుంది. అప్పటికల్లా చైనాను అధిక ఆదాయ దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అధికాదాయ దేశం అంటే ఏడాదికి సగటు తలసరి ఆదాయం 2020 ధరల ప్రకారం 12,696 డాలర్లు (సుమారు రూ. 9.5 లక్షలు) దాటి ఉండాలని ప్రపంచ బ్యాంకు చెప్పింది. చైనా తలసరి జిడిపి 2019లో తొలిసారిగా 10,000 డాలర్లు (సుమారు రూ. 7.5 లక్షలు) దాటింది. కరోనా సంక్షోభం వచ్చినప్పటికీ 2020లో కూడా ఇది కొనసాగుతోంది. రెండు దశాబ్దాల క్రింతం తలసరి ఆదాయం 1,000 డాలర్లు (సుమారు రూ. 75,000) నుండి 20 ఏళ్లలో పదిరెట్లు పెరిగింది. అధికాదాయ స్థాయిని అందుకోవడం, చైనా సమాజం ఒక మోస్తరు ధనిక సమాజం (సియాఓకాంగ్) మారడంతో దానికి కొన్ని కొత్త సవాళ్లు ఎదురయ్యాయి. ఒకవైపు పేదరికం నుండి విముక్తి చెందిన వారిని ఆ స్థితిలో కొనసాగించాలి, మరోవైపు ప్రజలు కనీస జీవనావసరాలను పరిపూర్తి చేయడమే కాకుండా అందరికీ మంచి జీవన ప్రమాణాలు చేకూర్చాలి.

చైనా ఇప్పుడు నిరుపేదరికం నుండి సాపేక్ష పేదరికంపై దృష్టి పెడుతున్నది. అంటే ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో ప్రజలందరూ పాల్గొని, వాటి ఫలాలను వారందరూ పొందే దానిపై కేంద్రీకరిస్తున్నది. 2919లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్లీనరీలో ఈ అంశం మీదనే చర్చలు కేంద్రీకరించబడ్డాయి. శిశు సంరక్షణ, వృద్ధుల సంరక్షణ, విద్య, ఉపాధి, వైద్య సదుపాయాలు, గృహ నిర్మాణ రంగాల్లో సామాజిక, ప్రభుత్వ సహాయాన్ని పెంపొందించడం అనేది ఈ దశలో ప్రజలందరినీ పేదరికం నుండి పూర్తిగా విముక్తి చేసి సంపద్వంతులుగా చేయడంలో కీలకం.

చైనా సమాజం పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించి సంపద్వంతమైతే ప్రపంచానికేమిటి? చైనాలో నిరుపేదరికాన్నీ, కరోనా మహమ్మారినీ ఓడించడానికి చేపట్టిన చర్యలను ఇతర దేశాలు మక్కీకి మక్కీ కాపీ కొట్టనక్కరలేదు. ప్రతి దేశానికీ నిర్దిష్టమైన చరిత్ర ఉంటుంది. నిర్దిష్టమైన అభివృద్ధి మార్గం ఉంటుంది. అయితే చైనా ప్రయోగం ప్రపంచానికి, ముఖ్యంగా వర్ధమాన దేశాలకు స్ఫూర్తినివ్వడమే కాకుండా అనేక పాఠాలు నేర్పుతుంది. 'మానవాళి భాగస్వామ్య భవిష్యత్తు' (అని చైనా చెబుతున్న నినాదంలో ప్రపంచ పేదలను అభివృద్ధి చేయడం అనేది కీలకమైన విషయం. జిన్‌పింగ్ లక్షించిన ఈ దూరదృష్టిలో పశ్చిమ దేశాల ఆధిపత్య ధోరణలను అదిగమించి బహుళపక్షంగా, అందరి భాగసామ్యంతో కూడిన అభివృద్ధి సాధించడం అనేది కీలకం.


అంతర్జాతీయ సంబంధాల్లో సైనిక జోక్యాలకు బదులు ప్రజల మధ్య వారధులు నిర్మించడం, ప్రయివేటీకరణ స్థానంలో అంతర్జాతీయ వైద్య సహకారం నిర్మించాలనుకుంటోంది. దేశాలకు షరతులు లేని ఆర్థిక సహకారం, మౌలిక వసతుల ఏర్పాటుకు నిధులు సమకూర్చాలనుకుంటోంది. అయిదు వందల సంవత్సరాలుగా పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం అందించని అభివృద్ధి మార్గాన్ని చైనా వర్ధమాన దేశాలకు అందిస్తోంది. చైనా చొరవతో ప్రారంభమైన బెల్ట్ అండ్ రోడ్ (బిఆర్) ప్రాజెక్టు, అందులో పాల్గనే దేశాల్లో 76 లక్షల మంది ప్రజలు నేరుగా, మరో 3.2 కోట్ల మంది ప్రజలు పరోక్షంగా పేదరికం నుండి విముక్తి పొందడానికి తోడ్పడుతుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ఇవే కాకుండా బహుళ పక్ష వాణిజ్యం ఒప్పందాలు, మౌలిక సదుపాయాలు, పర్యావరణహిత పరిశ్రమలు, విద్య, వ్యవసాయం, వైద్యం, ప్రజల మధ్య సంబంధాలు మొదలైన రంగాల్లో వర్ధమాన దేశాల అభివృద్ధికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలను చైనా చేపట్టింది.

చైనా వ్యవహారాల్లో నిపుణుడైన రోబర్ట్ లారెన్స్ కున్ "పేదరికంపై చైనా యుద్ధం : ఫ్రంట్‌లైన్ అభిప్రాయాలు" అనే డాక్యుమెంటరీ తీశాడు. "ప్రపంచానికి చైనా నేడు చెప్పే గొప్ప కథ పేదరికం నిర్మూలన. ఎందుకంటే ఈ నేటి ప్రపంచానికి ఇది చాలా ముఖ్యావసరమైన కథ" అని యాన ట్రైకాంటినెంటల్ బృందంతో మాట్లాడుతూ చెప్పారు. అయితే పశ్చిమ దేశాల నియంత్రణలో ఉన్న మీడియా ఈ వార్తా కథనాలు బయటకు రాకుండా, ప్రజలకు చేరకుండా అడ్డుకుంటోంది. ఈ కథనాలు బయటకు వస్తే 140 కోట్ల దేశంలో పేదరికం నిర్మూలన అన్న అంశమీద మరింత వెలుగు ప్రసరించబడుతుంది. ఈ కార్యక్రమంలోని సంక్లిష్టతలు, అందులోని సైద్ధాంతిక అవాంతరాలు, కార్యాచరణలపై మరింత విమర్శనాత్మక చర్చ జరుగుతుంది. పేదరికం లేని సమాజాన్ని నిర్మించడవే సోషలిజం నిర్మాణంలో ప్రధానాంశం. అధ్యయనం చేయగలగడం, మంచి ఇల్లు, మంచి ఆహారం, సాంస్కృతిని ఆస్వాదించడం అనేవి ప్రపంచ కార్మికవర్గం, పేద ప్రజలు కంటున్న కలలు. ఆ కలలను నిజం చేయడం ద్వారా చైనా సోషలిజం విశిష్టతను ప్రపంచానికి చాటి చెబుతోంది.

**(అనువాదం: ఎన్. వెంకట్రావు)**

ఇంటర్వ్యూ

# హిందూత్వ, హిందూమతం ఒకటి కాదు



## ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ తో ఇంటర్వ్యూ

**(ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్‌తో జిప్సన్ జాన్, జితేశ్ పి ఎం జరిపిన ఇంటర్వ్యూలో భారత చరిత్రలో ప్రభుత్వాలతో విబేధించటం, హిందూయిజం-మతపరమైన వైవిధ్యాలు, చరిత్రలో హిందూయిజం, మత సహనం-లౌకికతత్వాల మధ్య వ్యత్యాసం, అర్యుల వలసలు తదితర అనేక అంశాలను గురించి చర్చించారు. ఆ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలను మార్చిస్టు పాఠకులకు అందిస్తున్నాం -సంపాదకుడు)**

**మీరు ఈ మధ్య రాసిన 'భిన్న స్వరాలు : ఒక వ్యాసం' తో మొదలు పెడదాం. ఈ వ్యాసం రాయడంలో మీ ఉద్దేశం ఏమిటి? ఈనాటి భారత రాజకీయ - మేధావివర్గ పరిస్థితిపై మీ సైద్ధాంతిక అవగాహనకు ఈ పుస్తకంలోని అంశాలు అద్ధం పడుతున్నయా?**

ప్రస్తుత పరిస్థితులతో ఈ అంశానికి సంబంధం ఉన్నమాట నిజమే కానీ ఈ అంశం కొత్తదేం కాదు. భిన్నాభిప్రాయం ఎప్పుడూ ఉండేదే. మనం మాట్లాడుకోవలసింది ఏదో ఒక భిన్నాభిప్రాయం గురించి కాదు. మనం పరిశోధన చేస్తున్న సామాజిక, సాంస్కృతిక రంగంలో వ్యక్తమయ్యే అర్ధవంతమైన భిన్నాభిప్రాయాల గురించి. ప్రాచీన భారతదేశ చరిత్రలో ఉన్న రకరకాల భిన్నాభిప్రాయాలు గురించి గత నాలుగు దశాబ్దాలుగా నేను రాస్తూనే ఉన్నాను. ఇప్పుడు నేను రాసిన అంశం వైదిక బ్రాహ్మణ్యం స్థిరపడిన కాలంలో బౌద్ధమతంలోని 'పరిత్యజించడం' అనే ఆలోచనను అంచనా వేస్తూ, ఆ నాటి సామాజిక పరిస్థితులకు, దానికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించడంతో మొదలైంది. సామాజిక దొంతరలున్న ఆ నాటి పరిస్థితులలో, వైదిక బ్రాహ్మణ్యం, పూర్తిగా ఉన్నత కులస్తులకు చెందినది. దానిని వ్యతిరేకించిన వారు - బౌద్ధులు, జైనులు, ఆజీవకులు, చార్వాకులు కూడా ఉన్నత కులాలకి చెందిన వారే; కానీ వారు తమ మతాన్ని సమాజంలోని అన్ని తరగతుల ప్రజలలో ప్రచారం చేయాలనుకున్నారు. పరిత్యజించడం అనే సామాజిక సందేశం ఆ నాటికి - క్రీస్తు పూర్వం మొదటి 1000 సంవత్సరాల మధ్య కాలం - ఒక విధమైన వ్యతిరేక సంస్కృతిగానే నేను భావిస్తాను. సన్యసించడానికి, పరిత్యజించడానికి బేధం ఉంది. సన్యసించడం అంటే సమాజం నుండి దూరమవడం. కానీ, పరిత్యజించడం అలా కాదు; సమాజంలో ఉంటూనే సామాజిక నైతికతను ప్రచారం చేస్తూ, సమాజంలో ధార్మిక చింతనను పెంచడం.

ఈ మధ్య నేను ఆధునిక చరిత్రను అధ్యయనం చేస్తున్న సందర్భంలో, జాతీయోద్యమం జరిగిన కాలంలోని ముఖ్యమైన భిన్నాభిప్రాయాలను, జాతీయోద్యమానికి ముందున్న కాలంలో జరిగిన ఉద్యమాలలోని భిన్నాభిప్రాయాలను పరిశీలించాను. ఉదాహరణకు ఈ పుస్తకంలో గాంధీగారి సత్యాగ్రహ పిలుపుకు ప్రజలు ఎందుకంత ఎక్కువగా స్పందించారో చర్చించే ప్రయత్నం చేశాను. అది కేవలం ఆనాటి పరిస్థితుల అవసరమా, లేక అంతకు ముందటి వేర్వేరు చారిత్రిక భిన్నాభిప్రాయ వ్యక్తీకరణల కొనసాగింపని కూడా అనుకోవచ్చా అని కూడా చర్చించాను. ఈ చర్చ నేపథ్యంలో భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ చారిత్రిక, సాంస్కృతిక వికాసంలో ప్రముఖమైన పాత్ర పోషిస్తుందని వాదించాను. ఏ రకమైన అభివృద్ధి జరగాలన్నా భిన్నాభిప్రాయ వ్యక్తీకరణ అత్యవసరం. మన చుట్టూ ఉన్నవాటిని ప్రశ్నించకపోతే ఆలోచనలలో మాత్రమే కాక సాంకేతిక పరిజ్ఞానంలో కూడా అభివృద్ధి సాధ్యం కాదు.

సమకాలీన సమాజంలో 2019 నుండి 2020 మొదటి వరకు జరిగిన పౌరసత్వ (సవరణ) చట్ట వ్యతిరేక ఉద్యమాన్ని పరిశీలిద్దాం. ఇది గాంధీ తదనంతర కాలంలో జరిగిన సత్యాగ్రహ ఉద్యమం. ఈ ఉద్యమం ప్రతిఘటనే అయినా, పూర్తిగా అహింసా యుతంగా సాగింది. ప్రభుత్వం చేసిన ఒక చట్టాన్ని వ్యతిరేకించే ఏకైక లక్ష్యంతో ఇది జరిగింది; ఉద్యమకారులు చర్చలకు ఆహ్వానించారు; ఉద్యమం ప్రజల నుండి పరిపూర్ణ మద్దతు పొందింది. గాంధీ గారి ఉప్పు సత్యాగ్రహం ఒక చట్టాన్ని ఉల్లంఘించిన ఉద్యమం. కానీ పౌరసత్వ వ్యతిరేక ఉద్యమం ఏ చట్టాన్ని అతిక్రమించలేదు. ఈ ఉద్యమం కేవలం ఒక చర్చ జరపాలని కోరింది. ఈ ఉద్యమం అనంతరం మరో ఉద్యమం, రైతుల ఉద్యమం 2021లో మరింత విస్తృతంగా జరిగింది; అయితే దాన్ని విచ్ఛిన్నం చేసేందుకు హింసాయుతంగా ప్రయత్నం చేయటం ఆసక్తికరమైన అంశం.

ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయ వ్యక్తీకరణ అహింసాయుతంగా జరగటం సరైన మార్గం అనుకుంటే, లేదా ప్రజాస్వామ్యంలో తప్పనిసరిగా అనుసరించవలసిన ఒక మార్గం అనుకుంటే దానిని మనం గుర్తించాలి; అర్థం చేసుకోవాలి; సరిగ్గా అమలుచేయాలి.

**సమాజంలో ఎప్పుడూ భిన్నాభిప్రాయాలు**

ఉన్నాయని మీరంటున్నారు. కానీ **అధికారంలో ఉన్నవారు, యథాతథ పరిస్థితులు కొనసాగాలని కోరుకొనేవారు వాటిని ఎన్నడూ సహించలేదని మనకు తెలుసు. భారతదేశ చరిత్ర, ప్రస్తుత పరిస్థితులకు అన్వయిస్తూ ఈ అంశాన్ని వివరిస్తారా?**

> **❝ భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ మీదే తాత్వికాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ప్రపంచంలోని అనేక రకాల తాత్విక చింతనల ప్రాముఖ్యతకు కారణం అదే. మొత్తంగా దీనిని గతితార్కిక ఆలోచన అనవచ్చు. మన అభిప్రాయాలను చెప్పే ముందు ప్రత్యర్థుల అభిప్రాయాలు వీలైనంత కచ్చితంగా చెప్పగలగాలని వివిధ విభాగాలకు చెందిన భారత తత్వవేత్తలు అనేకమంది చెబుతారు. ఆ తర్వాతే వాటిని వ్యతిరేకించాలి. ఆ తర్వాత ముందుకు వెళ్లే మార్గం అన్వేషించాలి. లేదా విషయం అక్కడితో ఆగిపోతుంది. ❞**

భిన్నాభిప్రాయం ప్రస్ఫుటంగా వ్యక్తం కాకపోతే చారిత్రికంగా సమాజంలో మార్పు జరగదు. భారత సమాజం అనేక మార్పులకు గురైందన్న విషయం మనకు తెలుసు. సమాజాన్ని ముందుకు నడిపించే కొత్త పద్ధతులను పరిశోధించడం, ఉన్న వ్యవస్థను, ఆచరణను ప్రశ్నించడమే చారిత్రిక మార్పులు జరగడానికి కారణం.

సమాజంలోని ఒక సమూహం, సమాజాన్ని మొత్తంగా తన అధీనంలో ఉంచుకోవాలని ఆశపడడానికి సంబంధం ఉండవచు లేదా ఉండకపోవచ్చు. కాని ప్రస్తుతం ఉన్న విజ్ఞానాన్ని ప్రశ్నిస్తేనే జ్ఞానం అభివృద్ధి చెందుతుంది. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ మీదే తాత్వికాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ప్రపంచంలోని అనేక రకాల తాత్విక చింతనల ప్రాముఖ్యతకు కారణం అదే. మొత్తంగా దీనిని గతితార్కిక ఆలోచన అనవచ్చు. మన అభిప్రాయాలను చెప్పే ముందు ప్రత్యర్థుల అభిప్రాయాలు వీలైనంత కచ్చితంగా చెప్పగలగాలని వివిధ విభాగాలకు చెందిన భారత తత్వవేత్తలు అనేకమంది చెబుతారు. ఆ తర్వాతే వాటిని వ్యతిరేకించాలి. ఆ తర్వాత ముందుకు వెళ్లే మార్గం అన్వేషించాలి. లేదా విషయం అక్కడితో ఆగిపోతుంది.

భిన్నాభిప్రాయంలోనే భిన్నాభిప్రాయ వ్యక్తీకరణ విధానం ఇమిడి ఉంది. గతంలో అనుసరించిన ఏ విధానాన్ని అయినా వర్తమానంలో యథాతథంగా అనుసరించలేం. ఉప్పు సత్యాగ్రహంలో అనుసరించిన సత్యాగ్రహ విధానం ఈనాటి సమస్యల పరిష్కారానికి ఉపయోగపడకపోవచ్చు.; కానీ అటువంటి విధానాలను అనుసరించేందుకు గల సాధ్యాసాధ్యాలు పరిశీలించేందుకు అవి ఉపయోగపడతాయి.

**ఉపనిషత్తులలో పేర్కొన్న విధంగా భారతదేశ చరిత్రలో భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ కేవలం మేధావులకే పరిమితమైందా లేక ఆచరణలో సామాన్య ప్రజలు కూడా భాగస్వాములయారా?**

భిన్నాభిప్రాయాల అభివ్యక్తీకరణ అనేక రకాలుగా ఉంటుంది. తాత్విక చర్చలు ఎక్కువగా మేధావివర్గం స్థాయిలో ఉంటాయి; అందులో తాత్విక సిద్ధాంతాలు, వాటి వివరణలు, అనుకూల, వ్యతిరేక వాదనలు ఉంటాయి. అయితే ఇవన్నీ కేవలం మేధోపర చర్చలకు మాత్రమే పరిమితమై ఉండవు. ఆ చర్చలలో నుండి వచ్చిన ఆలోచనలను, ఊహలను సామాజిక సమస్యలకు అన్వయించడం జరుగుతుంది. ఉదాహరణకు బ్రాహ్మణుల దైవ పూజను, బలులను బౌద్ధులు వ్యతిరేకించారు; బ్రాహ్మణులు వాళ్ళని నాస్తికులన్నారు; దైవాన్ని నమ్మనివారన్నారు. ఇవి మేధోపరమైన చర్చలు. కానీ ఈ ఆలోచనలు ఆచరణలోనికి వచ్చే సరికి సామాన్య ప్రజలు వారి బోధనలను అనుసరించడం మొదలు పెట్టారు. వారి సంస్థలకు అండగా నిలిచారు; ఆనాడు ఆచరణలో ఉన్న కొన్ని సామాజిక విధానాలను ప్రశ్నించారు. అందువలన ఆరామాలకు, రాచ కుటుంబీకుల నుండి మాత్రమే కాక వృత్తిదారుల నుండి కూడా నిధులు సమకూరాయి.

ఆ తర్వాత కొన్ని రోజులకు బౌద్ధంలోనే భిన్నభిప్రాయాలు వ్యక్తీకరించబడ్డాయి. అవి కేవలం నమ్మకాలకు పరిమితం కాలేదు. ఆచరణలో కూడా విబేధాలు వ్యక్తమయ్యాయి. ఉదాహరణకు బౌద్ధ సన్యాసులు ధన రూపేణా దానాలు తీసుకోవచ్చా లేదా అన్నది చర్చనీయాంశమైంది. ఈ అంశం మీదే బౌద్ధ సంఘాలు విడిపోయాయి. కులపరమైన, వాటిపై ఆధారపడిన ఇతర అసమానత్వాలను మధ్య యుగాలలో సంత్ రవిదాస్ తన బోధనలలో వ్యతిరేకించాడు. సామాజిక అసమానతలను అంతం చేయాలని సమర్ధవంతంగా ప్రచారం చేశాడు. అందువలన మేధోపర చర్చలు, వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు అక్కడితోనే ఆగిపోతాయని అనుకోనక్కర లేదు. అనేక సూక్ష్మ రూపాలు తీసుకోవచ్చు. అందుకనే వాటి అధ్యయనం అవసరం.

### హిందూయిజం స్థాపన, చారిత్రిక మార్పులు

తాము చెప్పేదే హిందూయిజంలోని అసలైన సారాంశం అని హిందుత్వ శక్తులు ప్రచారం చేస్తున్న ఈ తరుణంలో భారతదేశంలో మతపరమైన భిన్నాభిప్రాయాను గురించి, ముఖ్యంగా హిందూయిజంలోని భిన్నాభిప్రాయాలు గురించి తెలుసుకోవటం అవసరం.

భిన్నస్వరాలు (వాయిస్ అఫ్ డీసెంట్) అనే నా పుస్తకంలో నేను చెప్పదలుచుకున్నదిదే. అన్నిటికన్నా మతాలలోనే భిన్నాభిప్రాయాలున్న సమూహాలు ఎక్కువగా ఉన్నాయి. గ్రాహ్యతలోను, బోధనలోను ఏకశిలా సదృశ్యంగా ఉన్న కొద్దీ అందులోని వివిధ సమూహాల సంఖ్య పెరుగుతూ ఉంటుంది. ఒక మతం యొక్క చరిత్రను అధ్యయనం చేసినప్పుడు, మతంలో ఇన్ని రకాలు ఎందుకున్నాయి, వీటికి మద్దత్తు ఇస్తున్నవారెవరు అని పరిశీలించినపుడు, ఈ విషయం మనకు స్పష్టం అవుతుంది.

హిందూయిజం చరిత్ర విభిన్న రకాల సూత్రీకరణలతో కూడుకున్నది. అందులో కొన్ని బాగా మారాల్సి ఉంది. హరప్పా నాగరికత గురించి మనకు తెలియదు కాబట్టి హిందూయిజం పునాదులను, అంటే వైదిక బ్రాహ్మణుల గురించి, మనం క్రీస్తు పూర్వం రెండో సహస్రాబ్ది నుండి మాత్రమే తెలుసుకోగలం. వారు మిత్ర, వరుణుడు అనే దేవుళ్ళను కేంద్రంగా చేసుకోడం మొదలు పెట్టి, ఆ తరువాత ఇంద్రుడిని, అగ్నిని నైరూప్యంగా ఉంచి, పెద్ద ఎత్తున బలులు ఇచ్చి పూజలు నిర్వహించారు. మౌర్యులు, గుప్తుల కాలానికి మరి కొంతమంది దేవతలు చేరారు. వీరు శ్రమణ మతాలు – ముఖ్యంగా బౌద్ధులు, జైనుల నుండి గట్టి పోటీని ఎదుర్కొన్నారు.

క్రీస్తుశకం మొదటి సహస్రాబ్ది నుండి ఇతర దేవుళ్ళ ప్రాధాన్యత పెరిగింది; శివుడు, విష్ణువు ఇంకా ఇతర దేవుళ్ళు రకరకాల ఇతివృత్తాలతో

**❝15,16 శతాబ్దాల్లో హిందూయిజంపై ఆసక్తి పెరగడం, ఉన్నత తరగతుల నుండి అధమ తరగతుల వరకు భక్తి పెరగడం ఆసక్తికరమైన విషయం. రామాయణ, మహాభారతాలతో సహా ప్రాచీన సంస్కృత గ్రంధాలను పర్షియన్ భాషలోకి అనువాదం చేయడానికి రాజులు నిధులు సమకూర్చారు. వాటిని అప్పటి ప్రాంతీయ భాషల్లోకి కూడా అనువాదాలు చేశారు. రాస్ ఖాన్, అబ్దుల్ రహీమ్ ఖాన్, మీరాబాయి లాంటి భక్తులు రాధాకృష్ణులపై స్తోత్రాలు రాశారు. వీటిని అందరూ గానం చేసేవారు.❞**

వచ్చి చేరారు. శక్త-శక్తి కొలుపుల ప్రాముఖ్యత పెరిగింది. వైదిక బ్రాహ్మణ్యంలో వీరికి అంత ప్రాధాన్యత లేదు. పూజా విధానంలో కూడా మార్పు వచ్చింది. దైవ విగ్రహాలను తయారు చేయడం, వాటికి నిర్మాణాలను ఏర్పరచి ప్రతిష్టించడం మొదలైంది; ఇవే మొట్టమొదటి సారిగా గుడులకు కేంద్రాలుగా మారాయి. పురాణాలలోని ముఖ్యాంశాలు వీటిలో ఉన్నాయి. కొందరు దీనిని కొంతమంది పురాణ హిందూయిజం అంటున్నారు. అవే నమ్మకాలకు, పూజలకు ముఖ్యమైన గ్రంధాలయ్యాయని అంటారు; ఒక్కొక్క దైవానికి ఒక్కొక్క పూజా విధానం అవతరించింది. భక్తి, విధేయతలు ప్రత్యక్షంగా ప్రదర్శించడం ద్వారా శివుడిని, విష్ణువును కొలవడం ప్రోత్సహించబడింది. ఇది దక్షిణ భారతదేశంలో ప్రారంభమై క్రమంగా ఉత్తరానికి పాకింది. రెండో శతాబ్దంలో ఉపఖండం అంతా భక్తి ప్రధానంగా ఉండేది. బౌద్ధమతానికి ఆదరణ తగ్గింది. పురాణ దేవతలకు ప్రాపకం పెరిగింది. వీటికి రకరకాల జాతులతో అనుసంధానం జరిగింది; ప్రాంతీయ మతాలతో, అనేక రకాల రైతాంగ, గిరిజన సంస్కృతులతో మేళవింపులు జరిగాయి; వాణిజ్యం, దాడులు తదితర విధానాల ద్వారా క్రైస్తవ, ఇస్లాం మతాల వంటివి కూడా సమాజంలో భాగమయాయి.

ఇప్పటి పాలకులు ప్రచారం చేస్తున్నట్లుగా క్రీస్తు శకం రెండో సహస్రాబ్ది హిందువులు ఇతరుల దాడులకు బలైన కాలం కాదు. అది అనేక రకాల ప్రజలు, మత నమ్మకాలు, విభిన్నమైన విధానాలు కలగలిసిన కాలం. ఇది ఎన్నో భక్తి తెగలకు, పౌరాణిక హిందూఇజానికి దారితీసింది. ఒరిస్సాలో జగన్నాధుడు, మహారాష్ట్రలో విఠోబా, సింధ్‌లో హింగ్లజ్ మాత, సుందర్బన్స్‌లో బోన్ బిబి వగైరా అనేక కొత్త ప్రాంతీయ దేవతలు ఈ కాలంలోనే పుట్టుకొచ్చారు. ఈ దేవతలకు విగ్రహాలను చేసి గుళ్ళు కట్టారు. సర్వ సాధారణంగా అప్పటికే అక్కడ పవిత్రంగా భావించబడుతున్న, అప్పటికే మత నమ్మకాలతో ముడిపడి ఉన్న ప్రాంతాలలోనే ఈ గుళ్ళు కట్టారు.

ఇది అనేక రకాల మతాల వారిని గుడులను సందర్శించుకునేటట్టు చేసింది; గుడులకు వెళ్లే యాత్రికుల సంఖ్య బాగా పెరిగింది. యాత్రలకు వెళ్లిన వారిని, కొలుపులు కొలిచిన వారిని గనక పరిశీలిస్తే, ఈ యాత్రలకు వెళ్ళినది కేవలం హిందువులే కాదని, సమాజంలోని అనేక తరగతుల వారు వెళ్లారని తెలుస్తుంది.

15,16 శతాబ్దాలకు హిందూయిజంపై ఆసక్తి బాగా పెరగడం, సమాజంలోని ఉన్నత తరగతుల నుండి అధమ తరగతుల వరకు భక్తి పెరగడం ఆసక్తికరమైన విషయం. ప్రాచీన సంస్కృత గ్రంధాలను-రామాయణ, మహాభారతాలు, అప్పుడు రాచకొలువులో వాడే పర్షియన్ భాషలోకి అనువాదం చేయడానికి రాజులు నిధులు సమకూర్చారు. వాటిని అప్పటి ప్రాంతీయ భాషల లోకి కూడా అనువాదాలు చేశారు. అది దక్షిణ, ఉత్తర భారతదేశమంతటా జరిగింది. రాస్ ఖాన్, అబ్దుల్ రహీమ్ ఖాన్ ఐ కానన్, మీరాబాయి లాంటి మహాభక్తులు హిందీలో రాధాకృష్ణులపై స్తోత్రాలు రాశారు. సూరదాస్ పద్యాలలాగే వీటిని అందరూ గానం చేసేవారు.

సామ్రాజ్యవాద పండితులు హిందూయిజాన్ని అర్థం చేసుకోడానికి, పునర్నిర్మించడానికి అవివేకంతో చేసిన ప్రయత్నంలో హిందూమతం రూపం లోను, అవగాహనలోను మార్పులు ప్రవేశపెట్టారు. వాటిని ఈ రోజు మనం చూస్తున్నాం. వాళు హిందూయిజాన్ని ఏకశిలా సదృశ్యమైనదిగా చూశారు. ఇది హిందూయిజంలో ఉన్న భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని, ఆచరణలో ఉన్న వ్యత్యాసాలను రూపు మాసిపోయేటట్టు చేసింది. ఒక ప్రవక్తతో ప్రారంభమై పారంపర్యంగా కొనసాగుతున్న ఏకరూప బ్రాహ్మణేతర మతాలకు భిన్నంగా హిందూయిజం ఉన్నదని గ్రహించాలి. సామ్రాజ్యవాదుల ఆలోచనలని పుణికి పుచ్చుకున్న హిందుత్వవాదులు హిందూయిజంలో ఉన్న భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని తొలగించి, వారు హిందువులను కుంటున్న వారినందరిని ఏకశిలా సదృశ్యులుగా మలచాలని అనుకుంటున్నారు.

**హిందుత్వ-హిందూయిజం**

హిందూయిజం, హిందుత్వ ఒకటి కావు. హిందూయిజం ఉద్దేశం మతాన్ని రాజకీయాల కోసం, హిందురాష్ట్ర ఏర్పాటు కోసం వినియోగించడం. అందువలనే నేను దీనికి 20వ శతాబ్దంలో అవిర్భవిస్తున్న సిండికేటెడ్ హిందూయిజం అని పేరు పెట్టాను. దీనిని రాజకీయాధికారంలో ఉన్నవారు క్రమబద్ధీకరిస్తున్నారు. వాళ్ళు తమది సాంస్కృతిక సంస్థగా చెప్పుకుంటున్నా, రాజకీయాలలో వారి జోక్యానికి అది ఏ మాత్రం అడ్డుకావడం లేదు. రాజకీయ కార్యక్రమం లక్ష్యంగా ఉన్న రకరకాల సమూహాలను ఏకం చేసుకుంటూ హిందుత్వ పనిచేస్తున్నది. ఈ రకంగా పనిచేస్తున్న ఒక్కొక్క సంస్థకి ఒక్కొక్క పేరు ఉంది. వీటన్నిటిని కలిపి సంఘ్ పరివార్ అంటున్నారు. వీరు హిందువుకి ఒక కొత్త నిర్వచనం ఇచ్చారు: ఆ వ్యక్తిగాని అతని పూర్వీకులు గాని భారతదేశ హద్దులలో జన్మించి ఉండాలి; అటువంటి వారికి ఇది పితృభూమి. ఆ వ్యక్తి మతం కూడా ఈ దేశ సరిహద్దులలోనే పుట్టి ఉండాలి, వారికి ఇది పుణ్యభూమి. ఏ ప్రాచీన గ్రంథం కూడా ఈ నిర్వచనాన్ని ఇవ్వలేదు.

**అరబ్బుల, యూదుల మతాలలాగ (సెమెటిక్) హిందూమతం ఏకశిలా సదృశ్యం కాదు. మతానుయాయులు ఒకే భావజాలానికి చెందినవారు కాదు. మీరు ఆధునిక హిందూయిజాన్ని గురించి వివరించడానికి సిండికేటెడ్ హిందూయిజం అన్నారు. ఒక మతాన్ని గురించి చెప్పడానికి హిందు అన్న పదం ఎప్పటి నుండి వాడబడింది? భారతదేశ చరిత్రలో హిందు అన్న పదానికి అర్థం ఏమిటి?**

హిందూయిజం అనే పదం ఈ మధ్య కాలంలోనే వాడుకలోకి వచ్చింది. కొందరు చరిత్రకారులు ఇది వలసవాదులు వాడిన పదమని అంటారు. అబ్రాహమిక్, లేదా శ్రమణులలాగా హిందూయిజం మూలాలు నిర్దిష్టకాలంలో జీవించిన ఒక వ్యక్తి ప్రబోధాలలో లేవు. హిందూయిజానికి ఇతర

అనేక పెద్ద మతాలకూ ఉన్న ముఖ్యమైన బేధం ఇది. ప్రస్తుతం వాదిస్తున్న విధంగా ఏకశిలా సదృశ్యంగా కాక అనేక చిన్నా, పెద్ద విభేధాలున్న చిన్నా, పెద్దా సమస్యలపై నిరంతరం ఘర్షణలు పడుతున్న తెగలతో కూడి ఉంది.

హిందు అనే పదం క్రీస్తుశకం మొదటి సహస్రాబ్ది అంతంలో ఉనికిలోకి వచ్చింది. పశ్చిమాసియా వారు సింధునది దాటిన తర్వాత ఉన్న ఉత్తర భారతదేశాన్ని అల్–హింద్‌గా పిలవడం ప్రారంభించారు. ఇండస్ నది ని సంస్కృతంలో సింధు అని పిలిచేవారు; ప్రాచీన ఇరానియన్లు దీనిని హెండు అనేవారు. 14, 15 శతాబ్దాల చివరిలో మాత్రమే భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో హిందు అనే పదం వాడుకలోకి వచ్చింది. దీనిని ఒక్కొక్కసారి ప్రాంతీయ మతాలను ఉద్దేశించి కూడా వాడారు; పర్షియన్, అరబిక్, భారతదేశంలోని వివిధ భాషలలోని రచనలలో ఈ పదం వాడడాన్ని చూస్తాం. ఇది భారతదేశంలోని అన్ని మతాలనుద్దేశించి వాడబడింది. బ్రాహ్మణ మతానికి, నాస్తికులకి, దైవాన్ని నమ్మని బౌద్ధులు, జైనులు వంటి వారికి మధ్య తేడా 16వ శతాబ్దంలోని సంస్కృత గ్రంథాలలో రాశారు. అల్ – హింద్ భౌగోళిక ప్రాంతం హిందుస్థాన్‌గా మారింది, అంటే హిందువుల భూమి అని; హిందువుల భూమి అంటే ఇక్కడున్న వారందరిది అని, అన్ని మతాలవారిదని అర్థం. యూరప్ నుండి వచ్చిన వలసవచ్చిన వారు ఈ పేరును మతపరమైన గుర్తింపుకు చెందినదిగా మార్చారు. వాళ్ళు భౌగోళిక సరిహద్దులకు, మెజారిటీ మతానికి మధ్య బేధాన్ని స్పష్టం చేశారు. గ్రీకుల చేత ఇండోస్ అన్న భౌగోళిక ప్రాంతం ఇండియాగా పిలువబడింది; ఇక్కడ అనుసరిస్తున్న మతాన్ని జెండూ అని ఆ తర్వాత హిందు అని పిలవడం మొదలైంది.

### భారతదేశ చరిత్రలో ఇస్లాంకు ఉన్నస్థానం ఏమిటి?

ఇస్లాంకి సంబంధించిన అంశం ఎంత ఉన్నదనే దానిని పరిగణనలోనికి తీసుకోకుండా, కేవలం ఇస్లాంకు సంబంధించిన అంశాలు ఎంత తక్కువ ఉన్నా ముస్లిం అని అనడం మనకు ఆనవాయితీ అయిపోయింది. మనం ఇస్లాం అనే మతం భారతదేశానికి 'ముస్లింల' దాడులతో మాత్రమే వచ్చిందని అనుకుంటాం. కానీ నిజానికి ఇస్లాం అనేక మార్గాల ద్వారా, అనేక ప్రాంతాల నుండి, అనేక జాతుల నుండి వచ్చింది. భిన్నమైన రూపాలలో వచ్చింది. అందువలనే భారతదేశంలో ఇస్లాం మతాచారాలు వేరువేరుగా ఉంటాయి. కొంతమంది మాత్రమే వారికి భోధించబడిన ఇస్లాంను తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. ఎక్కువ మంది ప్రాంతీయ మతాల అలవాట్లను అలవరచుకున్నారు – కొన్ని జాతులు హిందుమత నమ్మకాలను, అలవాట్లను అనుసరిస్తున్నారు కూడా.

❝ అలాగే అల్ - హింద్ సైనికులను కూడా ఆఫ్ఘన్లు, టర్కులు తమ సైన్యంలో చేర్చుకునే వారు. వారిలో ప్రముఖుడు మొహమ్మద్ ఘజిని సేనాధిపతి తిలక్; అతని నాయకత్వంలోనే అల్ హింద్ సైన్యం పోరాడింది. ఆ రోజుల్లో దేశాల సరిహద్దులు మరింత సరళంగా ఉండేవి. వృత్తిదారులు దేశాల హద్దులను దాటి తమకు అనువైన దేశంలో పనులు చేసుకునే వారు. ❞

వలస కాలానికి ముందటికి ఇప్పటికి తేడా ఏమిటంటే, ఆ కాలంలో సంస్కృత, ప్రాంతీయ భాషలలో ముస్లింలను గురించి చెప్పేటప్పుడు చాలా అరుదుగా మాత్రమే 'ఇస్లాం' అని వాడేవారు. చారిత్రికంగా ఆయా ప్రాంతాలకు సంబంధించిన వారిని వారి మతం ఆధారంగా కాక ఆ ప్రాంతీయులుగానే పిలిచేవారు. భారతదేశానికి వచ్చి చేరిన వారు ఎలా వచ్చారో ఇది తెలియచేస్తుంది. దిగువ పేర్కొన్న మార్గాల ద్వారా ఇస్లాం భారతదేశానికి వచ్చింది.

1. 8వ శతాబ్దంలో అరబ్బులు సింధు ప్రాంతాన్ని ఆక్రమించుకున్నప్పుడు; భారతదేశంలోని వాయువ్య ప్రాంతం నుంచి టర్కులు, ఆఫ్ఘన్లు 11వ శతాబ్దంలో వచ్చి ఉత్తరభారతదేశానికి వ్యాపించినప్పుడు; 16వ శతాబ్దంలో మొగలులు ఉత్తర భారతదేశాన్ని జయించినప్పుడు.

2. భారతదేశంలో మిగిలిన ప్రాంతాలలోకి ఇస్లాం అనేక ఇతర విధాలుగా వచ్చింది. అరేబియా, ఉత్తర ఆఫ్రికా దేశస్తులు వ్యాపార నిమిత్తం పశ్చిమ భారతదేశంలోకి 8వ శతాబ్దంలో వచ్చారు. ఆ తర్వాత పశ్చిమతీర ప్రాంతంలో తొమ్మిదో శతాబ్దంలో స్థిరపడ్డారు. అరబ్ ప్రాంతం నుంచి వచ్చిన వారు ప్రాంతీయ జాతులతో కలిసి అనేక కొత్త మత సమూహాలు – బోహ్రాస్, ఖోజాస్, నావాయత్స్, మాపిల్లస్ – ఏర్పడ్డాయి. అలాగే ఆఫ్ఘన్, టర్కీ వ్యాపారవేత్తలు మధ్య ఆసియా నుండి ఉత్తర భారతదేశానికి వచ్చి అనేక ప్రాంతాలలో స్థిరపడ్డారు.

3. సైనికులుగా భారతదేశానికి వచ్చిన పరదేశ సిపాయిలకు పైకమిచ్చి భారతీయ రాజులు తమ సైన్యంలో చేర్చుకునే వారు. ఆ సైన్యాలు కొన్ని రాజుల అధీనంలో ఉండగా, మరి కొన్ని సుల్తానుల అధీనంలో ఉండేవి. క్రీస్తు శకం రెండో సహస్రాబ్దిలో అబిసీనియన్లు, ఇథియోపియన్లను గురించి పేర్కొన్నారు.

అలాగే అల్ – హింద్ సైనికులను కూడా ఆఫ్ఘన్లు, టర్కులు తమ సైన్యంలో చేర్చుకునే వారు. వారిలో ప్రముఖుడు మొహమ్మద్ ఘజిని సేనాధిపతి తిలక్; అతని నాయకత్వంలోనే అల్ హింద్ సైన్యం పోరాడింది. ఆ రోజుల్లో దేశాల సరిహద్దులు మరింత సరళంగా ఉండేవి. వృత్తిదారులు దేశాల హద్దులను దాటి తమకు అనువైన దేశంలో పనులు చేసుకునే వారు.

4. ఇస్లాం మతవ్యాప్తి ఎక్కువగా జరిగింది సూఫీల తోనే. వీరు కొంత మంది మధ్య ఆసియా నుంచి, కొంతమంది పర్షియా నుంచి వచ్చారు. వారి ఇస్లాంకి అరబ్బు దేశాల నుంచి వచ్చిన వారు అనుసరించే ఇస్లాంకి బేధం ఉండేది. కొందరు సూఫీలు సనాతనంగా ఉండేవారు.

కానీ చాలామంది భారతదేశంలోని మతాలతో తమ మతాన్ని మిళితం చేసుకున్నారు. దీనిని సనాతన ఇస్లాంవాదులు తిరస్కరించారు.

మనదేశంలోని సంస్కృత గ్రంథాలలో కూడా ఇస్లాంలోని ఈ బేధాలను గురించిన ప్రస్తావన ఉంది. విదేశీయులు వారు అనుసరించే మతాల ఆధారంగా పిలవబడే వారు కాదు. సర్వసాధారణంగా పశ్చిమ, మధ్య ఆసియా దేశాల నుండి వచ్చినవారిని వారి ప్రాంతాల గుర్తింపు ప్రాతిపదికనే పిలిచే వారు. గ్రీకులను పిలిచినట్టే పశ్చిమం నుండి వచ్చిన అరబ్బులను యవనులని, లేదా ఆధునిక కాలంలో బ్రిటిష్ వారిని పిలిచినట్టే పిలిచేవారు. టర్కులను, అఫ్ఘన్‌లను శకులని, తురుష్కులని పిలిచేవారు. శకులు మధ్య ఆసియా నుండి భారతదేశానికి వచ్చారు. సంస్కృత శాసనాలలో తుగ్లక్‌లను శకులని పిలవడం చూస్తాం. టర్కీ

**"గతంలో ఉన్న సంప్రదాయాన్ని వర్తమానంలో యాంత్రికంగా అమలు చేసే విధానం మంచిది కాదు. సంప్రదాయాలు ఎప్పుడూ మారుతూనే ఉంటాయని, కొత్త కొత్త సాంప్రదాయాలు ఏర్పడుతూనే ఉంటా యని చరిత్రకారులు చెపుతూనే ఉన్నారు. ప్రభుత్వం తాను ప్రాతినిధ్యం వహించే పౌరుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోనికి తీసుకుని పనిచే యాలి. ఆ విధానాలు ఎవరిపైన మోపబడు తున్నాయో వారికి వాటిని గురించి చర్చించే హక్కు ఉంటుంది."**

నుండి వచ్చిన వారిని తురుష్కులని పిలిచేవారు. అంటే ప్రజలు వచ్చిన భౌగోళిక ప్రాంతానికి, జాతులకే ప్రాధాన్యత ఉండేది.

**మత సహనం భారతీయ సంస్కృతి యొక్క ప్రధాన లక్షణంగా మనం చెప్పుకుంటుంటాం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారు ప్రధానంగా ఇటువంటి ఆలోచనను ప్రచారంలోకి తెచ్చారు. ఈ మతసామరస్యమే భారతదేశ లౌకిక విధానంగా భావించబడు తున్నది. దీనికి మీరేమంటారు? ఈ విష యాలపై మీ అభిప్రాయం ఏమిటి? వాటి ప్రాసంగికత ఏమిటి?**

లౌకికతత్వం మతసహనం రెండు వేర్వేరు అంశాలు. లౌకికవాదం అంటే అన్ని మతాలూ కలిసి ఉండడం, సమాజంలో అన్ని మతాలను సమానంగా చూడటం, అంతకంటే ముఖ్యంగా ఏ మతానికీ ,అక్కడి పౌరసమాజంలో కార్యక్రమాలకి, చట్టాలకు, రాజకీయాలకు మధ్య ఎటువంటి సంబంధం లేకుండా ఉండడం. అంటే లౌకికతత్వం మతసామరస్యం ఒకటి కావు. పైగా భారత సంస్కృతికి మతసహనం అద్దం పట్టదు. ప్రాచీన కాలం నుంచి ఇక్కడ అసహనం ఉన్న ఆధారాలు అనేకం ఉన్నాయి. ఇతర మతాల చరిత్ర కూడా అదే. ఉదాహరణకి అహింసను బోధించిన బౌద్ధం తాను ప్రముఖంగా ఉన్న సమాజాలలో అహింసను పాటించలేదు. మతంలో చెప్పింది, ఆచరణలో చేసేది ఒకటి కానక్కరలేదు. అందువలన ఒకటికన్నా ఎక్కువ మతాలు న్నప్పుడు, భిన్నాభిప్రాయాలు ఉండడం సహజం. ఈ భిన్నాభిప్రాయాలు కొన్నిసార్లు సైద్ధాంతిక అంశాలకు పరిమిత మవుతాయి. కొన్నిసార్లు మాత్రం నిరసనల రూపం తీసుకోవచ్చు; అప్పుడు హింసకు దారితీయ వచ్చు. ప్రాచీన భారత చరిత్రలో కూడా ఈ అంశాలు నమోదయ్యాయి. మతవైరు ధ్యాలు, మత విభేధాలు హింసాయుతంగా మారడం నమోదు చేయబడ్డాయి. ఉదాహరణకు శైవులు, శ్రమణులకు మధ్య విభేధాలను చెప్పుకోవచ్చు. విభేదాలకు కారణం ప్రాపకం కోసం ఏర్పడ్డ పోటీ అయి ఉండవచ్చు. ముఖ్యంగా రాజులు ఉదారంగా ఇచ్చే భరణాలు. మతాన్ని అనుసరించే వారి కోసం కూడా పోటీ ఉండవచ్చు. ఇది కేవలం భారతదేశానికే పరిమితం కాదు. భిన్న మతా లున్న సమాజాలన్నిటా ఇటువంటివి ఉన్నాయి.

**సింధునాగరికత ఉన్న ప్రదేశాలలో 4,600 సంవత్సర కిందట మట్టి కుండలలో జంతు ఉత్పత్తులు, పశు, దున్నపోతు మాంసాల అవశేషాలు కనిపించాయని కొత్తగా చేసిన పరిశోధనలలో వెల్లడయ్యాయి. ఈ పరిశోధనలు బయటపడే సమయానికి కర్ణాటక ప్రభుత్వం ఆవు మాంసాన్ని నిషేధిస్తున్నది. ఈ విధంగా బిన్నమైన అంశాలను మీరు ఎలా చూస్తారు?**

నేనా పరిశోధనల గురించి చదవలేదు. అయినా భారత సమాజం ఎప్పుడు మార్పులకు గురికాని స్థిరమైన సమాజం కాదు. 4,600 ఏళ్లలో నమ్మకాల్లోను, కార్యాచరణలో కూడా పెద్దపెద్ద మార్పులు జరిగాయి. మనం ఈ రోజు అనుసరిస్తున్న విధానాలు ఈ మార్పుల నుండి వచ్చినవే. మార్పు అన్నది పురోగతికి ముఖ్యం. ప్రతి సమాజం దానికి అవసర మైనప్పుడు తదనుగుణంగా సూత్రాలను మార్పులు చేసుకుంటూ ఉంటుంది. సమాజం మారిందంటే అందుకనుగుణంగా సామాజిక సూత్రాలు కూడా మారతాయి.

ఇప్పుడు సమాజంలో జరుగుతున్న మార్పులను గమనిద్దాం. మహిళలు, దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతుల వారు సమాజంలో న్యాయబద్ధంగా సమానత్వాన్ని కోరుకుంటున్నారు. వాళ్ళందరూ సమాన హక్కులు కలిగిన స్వేచ్ఛా పౌరులే. మనుధర్మ శాస్త్రంలో నిర్దేశించినట్టు బానిసత్వం, అణచివేత కొనసాగడం కుదరదు.

అలాగే ఆహారపు అలవాట్లకు సంబంధించిన అంశాలను ఆయా ప్రజలతో చర్చించాలి. ఎప్పుడో ఒకనాడు అమలయ్యా యని చెప్పి వాటిని సమాజం పై రుద్దటం సాధ్యంకాదు. గతంలో పశు మాంసం తినేవారని అనడానికి చారిత్రిక అధారాలు ఉన్నాయి. ఇప్పుడు వాటిని నిషేధించాలంటే గతంలో తినలేదన్న వాదన కన్నా బలమైన వాదన ఏదయినా ఉండాలి. ఆ నిషేధానికి వెనకనున్న ఆర్థిక, రాజకీయ అంశాలపై శాసనసభలలో, ప్రజలలో విస్తృతమైన చర్చ జరగాలి.

గతంలో ఉన్న సంప్రదాయాన్ని, అది నిరూపితమైనదైనా, లేదా ఊహే అయినా వర్తమానంలో యాంత్రికంగా అమలు చేసే విధానం మంచిది కాదు. సంప్రదాయాలు ఎప్పుడూ మారుతూనే ఉంటాయని, కొత్త కొత్త సాంప్రదాయాలు ఏర్పడుతూనే ఉంటాయని చరిత్రకారులు చెపుతూనే ఉన్నారు. ప్రభుత్వం తాను ప్రాతినిధ్యం వహించే పౌరుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోనికి తీసుకుని పనిచే యాలి. ఆ విధానాలు ఎవరిపైన మోపబడు తున్నాయో వారికి వాటిని గురించి చర్చించే హక్కు ఉంటుంది. వాళ్లు గనక వద్దను కుంటే రద్దు చేయవలసిందే. ప్రజాస్వామ్యం పనిచేయాలంటే ఇది తప్పనిసరి.

**ఆర్యులు ఎక్కడ పుట్టారనేది మరో ముఖ్యమైన ప్రశ్న. మీలాంటి చరిత్రకారులు ఆర్యులు మధ్య ఆసియా నుండి వచ్చినవారని చెబుతూనే ఉన్నారు. ఆర్యులు ఈ దేశంలోనే పుట్టారన్న వాదనను ఇది తిరస్కరిస్తుంది. ఈ మధ్య వెల్లడైన డిఎన్ఏ రుజువులు మీ వాదనను బలపరుస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో మీ అభిప్రాయం ప్రకారం భారతీయులంటే ఎవరు?**

ఇప్పుడు అందుబాటులో ఉన్న భాషాపరమైన, పురావస్తు శాస్త్ర ఆధారంగా, జన్యుశాస్త్ర ఆధారంగా, జరిగిన పరిశోధనలలో గత 5,000 సంవత్సరాల నుండి, ప్రాచీన భారతీయులు ఒకటి రెండు జన సమూహాల వలన ఏర్పడిన వారుకాదు. అనేక రకాల జన సమూహాల జన్యువులు గల మిశ్రమ ప్రజలతో కలిసి ఏర్పడినవారు. ప్రాచీన సంస్కృతులు గల ప్రజలలో ఇది సర్వసాధారణం. సంస్కృతి ముందడుగు వేయాలంటే – ప్రజలు, వివిధ రకాల ప్రజలకు సంబంధించిన యాంత్రీకరణ, వృత్తులు, భాషలు, జీవన విధానం, వ్యవస్థలో ఉన్న నమ్మకాలూ, వగైరా అనేక విషయాలు కలవాలి. ఏ మెరుగైన సంస్కృతి, నాగరికత అయినా ఒకే విధమైన సంస్కృతితో, ఒకే రకమైన ప్రజా సమూహంతో ఏర్పడుతుందనుకోవడం ఉత్త భ్రమ.

**(అనువాదం: కె ఉషారాణి)**

పౌర హక్కులు

## రాజ ద్రోహం చట్టం:

# తిలక్ కేసు నుండి పాఠాలు నేర్వని ప్రభుత్వం



రచయిత మాజీ ఐపిఎస్ అధికారి

**కులదీప్ శర్మ**

**భా**రత నేర విచారణ పరిధి(క్రిమినల్ జ్యూరిస్‌డిక్షన్)లో నేటికీ రెండు ప్రధాన ప్రవంతులున్నాయి. ఒకటి. 1860లో భారత శిక్షాస్మృతి (ఐపిసి) చట్టంగా రూపొందింది. 1861లో ' కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సిఆర్‌పిసి)' ని మొదట చట్టంగా చేశారు. దాని స్థానంలో సంస్కరించబడిన నూతన చట్టాన్ని 1973లో తీసుకొచ్చారు. 1872లో ' ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు'ను తీసుకొచ్చారు. ప్రజా తిరుగుబాట్లను అణచేందుకు, అనేక ఘోరాలకు పాల్పడటం ద్వారా 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని తుదముట్టించేందుకు ఈ చట్టాలను వినియోగించుకున్నారు. భారత్‌లో తమ పాలనను శాశ్వతంగా కొనసాగించటమే లక్ష్యంగా బ్రిటీష్ వలసవాద ప్రభుత్వం పై చట్టాలను రూపొందించినట్లు స్పష్టమౌతున్నది.

రాజ ద్రోహానికి సంబంధించిన నియమం ఐపిసి మూలంలో లేదు. 1870లో "అసంతృప్తిని రెచ్చగొట్టడం" అనే ప్రధాన శీర్షికతో '124ఎ'ని ఐపిసి చాప్టరు 4లో భాగంగా చేర్చారు. రాజ్యానికి వ్యతిరేకంగా జరిగే నేరాలను అరికట్టేందుకు ఈ విభాగాన్ని వినియోగించుకున్నారు. అనంతరం 1898లో సెక్షన్ 124ఎ సవరించబడింది. రద్దుచేయబడిన సెక్షన్‌కు, కొత్త సెక్షన్‌కు మధ్య 3 తేడాలున్నాయి. ఒకటి. రద్దయిన సెక్షన్‌లో అసమ్మతిని రెచ్చగొట్టడం లేదా అసంతృప్తిని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించటాన్ని నేరంగా పరిగణించారు. కొత్త సెక్షన్‌లో, దానితోపాటు 'విద్వేష' భావనలు లేదా 'వుల్లంఘన'లు కూడా శిక్షార్హమైనవిగా పరిగణించబడ్డాయి. 2.పాత దానిలో భారత్‌లో చట్టబద్ధంగా ఏర్పడిన బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించటాన్ని లక్ష్యంగా చేసుకోగా కొత్త సవరణలో దానితో పాటు బ్రిటిష్ రాజును వ్యతికరేకించటం కూడా శిక్షార్హం చేశారు. 3.పాతదానిలో అసంతృప్తిని రెచ్చగొట్టటం అని పేర్కొనగా కొత్తదానిలో రాజద్రోహం అని పేర్కొన్నారు.

### రాజద్రోహ చట్టానికి వ్యతిరేకంగా తిలక్ పోరాటం

1897లో ప్రముఖ జాతీయవాది, స్వాతంత్ర్య సమర యోధుడు, అధ్యాపకుడైన లోకమాన్య బాల గంగాధర తిలక్ పై సాగిన విచారణ ఈ చట్ట ప్రయోగానికి సంబంధించి ముఖ్యమైన వుదాహరణగా నిలుస్తుంది. ' కేసరి' పత్రికలో తిలక్ తన వ్యాసాన్ని ప్రచురించాడు. ఆ వ్యాసం ద్వారా రాజ్యంపై అసమ్మతిని రెచ్చగొడుతున్నాడన్న అభియోగంతో తిలక్‌పై దేశద్రోహం కేసు బనాయించారు. లోకమాన్యకు 12 నెలల జైలు శిక్ష విధించారు. శివాజీ వుత్సవాల ప్రచారం, గణేష్ వేడుకలకు మద్దతు నివ్వటం ముస్లిం వ్యతిరేక వాతావరణాన్ని సృష్టిస్తున్నదన్న ఆరోపణలను తిలక్ తిరస్కరించాడు."... ఈ పండుగలను ప్రజలు స్వంతం చేసుకుంటున్నారు. అవి తమ వారసత్వం పట్ల వారిలో సంతుష్టిని రేకెత్తిస్తున్నాయి" అని తిలక్ భావించారు. ఆయన కష్టాలు అంతటితో ఆగలేదు. బెంగాల్ విప్లవకారులకు మద్దతుగా రాసినందుకు 1908లో తిలక్‌పై మరోసారి దేశద్రోహం కేసు మోపారు. ఆరు సంవత్సరాలు జైలు శిక్ష విధించి, బర్మాలోని మాండలే జైలుకు తరలించారు.

వెలుగులోకి రాని మరి కొన్ని వాస్తవాలు కూడా వున్నాయి. 1916లో 'హిస్టారికల్ రీసెర్చ్ సొసైటీ' నేతృత్వంలో బెల్గాం, అహమ్మద్‌నగర్‌లో 'హోం రూల్' వుద్యమానికి మద్దతుగా తిలక్ ప్రసంగించారు. అందుకుగాను మూడవ సారి రాజద్రోహం నేరం మోపారు. కాని అంతిమంగా నాటి సిఆర్‌పిసి సెక్షన్ 108 కింద తిలక్‌పై విచారణ జరిపారు.

### ప్రజాస్వామిక సమాజంలో రాజ ద్రోహం చట్టానికి స్థానం లేదు

బెల్గాం, అహమ్మద్‌నగర్‌లో తిలక్ రెండు ఉపన్యాసాలు చేశారు. "... రాజుగారి పాలనా విభాగంలో విధులు నిర్వహిస్తున్న వారు అనేకులున్నారు. స్టేట్ సెక్రెటరీ, వైస్రాయి, గవర్నర్ అతని కింద కలెక్టరు, దిగువన పోలీస్ సిపాయి ప్రస్తుతం వారి సేవకులుగా వున్నారు" అంటూ వారి మధ్య తేడాను తిలక్ తన వుపన్యాసాల్లో ఎత్తి చూపారు. "ఒక స్టేట్ సెక్రెటరీ లేక కలెక్టరు అవసరం లేదని ఎవరైనా అనుకొనవచ్చు. వారిని మార్చి వేరొకరిని నియమించమని డిమాండ్ చేయటం రాజద్రోహం అవుతుందా? మీరే చెప్పండి...." ఇలా తన వుపన్యాసాల్లో తిలక్ సభికులను కోరేవారు. ".. ఇదే విధానం పోలీస్ సిపాయి నుండి స్టేట్ సెక్రెటరీ వరకూ కూడా వర్తిస్తుంది. అందరూ రాజుగారి సేవకులే. అందువల్ల స్టేట్ సెక్రటరి లేక వైస్రాయిని తొలగించమని డిమాండు చేయటం దేశ ద్రోహం కానేరదు..." అంటూ ఆయన తన వుపన్యాసాన్ని కొనసాగించేవారు.

తర్వాత తిలక్ 'స్వరాజ్యం' లేక 'హోం రూలు' గురించి మాట్లాడేవారు." ..భారత్‌లో ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలో విషయాలన్నీ వాణిజ్యపరమైన సూత్రాల ప్రాతిపదికపైనే అమలౌతుండేవి.. కంపెనీ డైరెక్టర్లు అందరూ ఇంగ్లండ్‌లో వుండేవారు. కంపెనీకి వీలైనంత గరిష్ట లాభాలను సాధించిపెట్టడమే వారి విధానం. ప్రజల సంక్షేమం ఏనాడూ వారి దృష్టిలో వుండదు.... అక్కడ ఒక రాజు వున్నాడు. మనం అతని అధీనంలోని ప్రజలం. ప్రజలందరి మంచి కోసం పరిపాలన సాగించటం అతని బాధ్యత.

> **“ ఆ మేరకు 1916 జూన్ 25న తిలక్‌ను విచారించారు. తన అభిప్రాయాలను రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్‌కు విజ్ఞాపన ద్వారా తెలియజేయటం చట్ట సమ్మతమని తిలక్ నొక్కి చెప్పాడు. అందుకే హెూం రూలు వుద్యమం రాజ ద్రోహపూరితం కాదని ఆయన వాదించాడు. కానీ తిలక్ ఉపన్యాసాలన్నీ భారత్‌లోని బ్రిటీష్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ద్వేషాన్ని విరజిమ్మేవిగాను, చట్ట ఉల్లంఘనలకు రెచ్చగొట్టేవిగాను, అసంతృప్తిని రగిల్చేవిగాను వున్నట్లు న్యాయాధికారి తన అభిప్రాయాన్ని నమోదుచేశాడు.”**

1858లో(1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అనంతరం కంపెనీ పాలన ముగిసింది.) భారత్ పాలనా బాధ్యతను బ్రిటీష్ రాచరికం చేబట్టింది. కంపెనీ పాలనా కాలం నాటి లక్ష్యంతో పాలన సాగిస్తేనే లాభసాటిగా వుంటుదని భారత్‌లో వారి సేవకులు భావిస్తున్నారు. వాస్తవానికి ఈ మార్పుతో భారతీయులకు ఒరిగిందేమీ లేదు. అప్పటికీ ఇప్పటికీ పరిపాలనా నాణ్యతలో ఎలాంటి తేడా లేదు.” అంటూ తిలక్ తన ఉపన్యాసాన్ని ముగించేవారు.

స్వయం పాలనకు భారతీయులు అర్హులు కారంటున్న బ్రిటీష్ సిద్ధాంతాన్ని తిలక్ ప్రశ్నించారు. తమ వలన రాజ్యంలో భారతీయులను శాశ్వత బానిసలుగా మార్చేందుకు మాత్రమే ఇలాంటి ప్రచారాలకు తెల్ల దొరలు పాల్పడుతున్నట్లు తిలక్ ఆరోపించారు. “...ఇంగ్లండ్ రాజు మన చక్రవర్తి. అందుకే ఇంగ్లండు ప్రజలకు రాజు కల్పించిన గౌరవాలు, హక్కులు భారతీయులకు కూడా సంక్రమించాలని” ఆయన వాదించే వారు. హెూం రూలు అర్థాన్ని వివరిస్తూనే రాజును మార్చాలని తాను కోరుకోవటం లేదని, భారతీయులను సక్రమంగా పాలించే ప్రభుత్వం రావాలన్న తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. బ్రిటీష్‌వారి ఆధిపత్యం భారత్‌లో శాశ్వతంగా కొనసాగేలా ప్రజలను మభ్యపెట్టడం ప్రభుత్వోగుల పనిగా ఆయన అభివర్ణించారు. వారి మాటలు విని మోసపోవద్దని ప్రజలను హెచ్చరించారు. నిర్భయంగా మాట్లాడమని, హక్కుల కోసం డిమాండ్ చేయమని ప్రజలను కోరారు. చట్టాలను వుల్లంఘించకుండానే పై విధంగా వ్యవహరించవచ్చని తిలక్ ప్రబోధించారు.

### తిలక్ ఉపన్యాసలపై న్యాయవిచారణ ప్రారంభం

ఆ కాలంలో జేమ్స్ అడాల్ఫ్ గ్రైడర్ ‘పూనా నేర పరిశోధక విభాగం’ పోలీస్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్‌గా పనిచేసేవారు. బెల్గామ్‌లో తిలక్ పర్యటనలను, వార్తలను సేకరించేందుకు షార్ట్ హ్యాండ్ తెలిసిన ఇద్దరు సబ్ ఇన్‌పెక్టర్లు సోమ్‌నాథ్ దేశ్‌పాండే, త్రయంబక దాత్రేలను అయన నియమించారు. వారు తిలక్ వుపన్యాసాల్లో ప్రతి అక్షరాన్నీ నమోదు చేసుకున్నారు. అహమ్మద్‌నగర్‌లో తిలక్ వుపన్యసించిన రెండు రోజుల సభల్లోనూ గైడర్ కూడా పాల్గొన్నాడు. ఈ ఉపన్యాసాలన్నింటినీ ఆంగ్లంలోకి అనువదించి, బొంబాయి ప్రాంతీయ ప్రభుత్వానికి సమర్పించారు. వీటిని మొదట న్యాయ విభాగపు అధికారి పరిశీలించి, భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిలక్ రాజద్రోహం నేరానికి పాల్పడినట్లు నిర్ధారించాడు.

ఆ మేరకు 1916 జూన్ 25న తిలక్‌ను విచారించారు. తన అభిప్రాయాలను రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్‌కు విజ్ఞాపన ద్వారా తెలియజేయటం చట్ట సమ్మతమని తిలక్ నొక్కి చెప్పాడు. అందుకే హెూం రూలు వుద్యమం రాజ ద్రోహపూరితం కాదని ఆయన వాదించాడు. కానీ తిలక్ ఉపన్యాసాలన్నీ భారత్‌లోని బ్రిటీష్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ద్వేషాన్ని విరజిమ్మేవిగాను, చట్ట ఉల్లంఘనలకు రెచ్చగొట్టేవిగాను, అసంతృప్తిని రగిల్చేవిగాను వున్నట్లు న్యాయాధికారి తన అభిప్రాయాన్ని నమోదుచేశాడు. అందుకే భారత శిక్షాస్మృతి సెక్షన్ 124ఎ కింద తిలక్‌పై ‘రాజ ద్రోహం’ నేరం మోపేందుకు ఆయన వుపన్యాసాల్లో తగిన ఆధారాలున్నట్లు ఆ అధికారి నిర్ధారించారు.

పై అభిప్రాయానికి అనుగుణంగా బెల్గాంలో గానీ, అహమ్మద్‌నగర్‌లోగాని తిలక్‌పై న్యాయ విచారణ జరపాలని గవర్నర్ ఆదేశించారు. బెల్గాంలో తిలక్ వుపన్యాసం తీవ్రమైన వుల్లంఘనగా ప్రభుత్వం భావించింది. కానీ బెల్గాంలో ఇలాంటి కేసులనే ఇటీవలే ప్రభుత్వం వుపసంహరించుకుంది. అందుకే అక్కడ తిలక్‌పై విచారణ జరపటం తీవ్ర విమర్శలకు దారితీస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. అహమ్మద్‌నగర్‌లో జరిపే విచారణ కూడా ప్రయోజనకరం కాదని పాలకులు భావించారు. అందుకే ఈ విషయమై అడ్వొకేట్ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించారు. తిలక్ చేసిన వుపన్యాసాల్లోని పలు భాగాలు, ఐపిసి సెక్షన్ 124ఎ ప్రకారం రాజద్రోహం నేరం పరిధిలోకి వస్తాయని అడ్వొకేట్ జనరల్ అభిప్రాయపడ్డారు.

### సిఆర్‌పిసి చట్టం 108 కింద కేసు మార్పు

ఈ సమస్య మరొకసారి గవర్నర్ పరిశీలనకు వెళ్లింది. న్యాయాధికారులతో సంప్రదింపుల అనంతరం ఐపిసి సెక్షన్ 124ఎ కంటే సెక్షన్ 108 కింద నేరం మోపడం విచారణకు అనుకూలంగా వుంటుందని బొంబాయి ప్రాంతీయ ప్రభుత్వం భావించింది. మూడు వుపన్యాసాలనూ సాక్ష్యంగా చూపి, కేసును పూనాలో విచారణ జరపాలని నిర్దేశించింది.

బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన మాధవ్ చౌబాల్, గవర్నర్ కౌన్సిల్‌లోని ఒక అధికారి. ఈ సమస్యపై, ఆయన ఒక అసమ్మతి నోట్‌ను నమోదు చేశాడు. తిలక్ వుపన్యాసాల్లో తీవ్రమైన హింసాత్మక అంశాలున్నాయని ఆయన అంగీకరించాడు. కానీ ఆ వ్యక్తీకరణలకు న్యాయమూర్తులు ప్రాధాన్యతనివ్వటం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. “... ఒక వైపు భారత్‌లో ప్రజామోదంతో ఆవిర్భవించిన ‘ హెూం రూల్ లీగ్ ’ స్వయం పాలన సాధనకు బ్రిటీష్ పార్లమెంట్‌ను డిమాండు చేయటం తిలక్ వుపన్యాసాల ప్రధాన లక్ష్యం. ఈ విచారణ అనేక రోజులు కొనసాగవచ్చు. అంతిమంగా తిలక్‌కు శిక్షపడవచ్చు. లేదా తిలక్ ఒక అమరవీరుడిగా ఆవిర్భవించవచ్చు.”


తిలక్‌కు వ్యతిరేకంగా సిఆర్‌పిసి చట్టం 108 కింద కేసు నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశద్రోహానికి ప్రేరేపిస్తున్నారని అభియోగం వోపబడిన వ్యక్తి నుండి సత్ప్రవర్తనతో మెలుగుతానన్న హామీని తీసుకునేందుకు ఈ సెక్షన్ అవకాశం కల్పిస్తున్నది. ఈ చట్టం న్యాయమూర్తు ( జ్యుడిషియల్ మేజిస్ట్రేట్)లకు మారుగా కార్య నిర్వహణ అధికారు(ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్)లకు అలాంటి అధికారాలను కల్పిస్తున్నది.

### పూనా మేజిస్ట్రేట్ కోర్టులో తిలక్ విచారణ

ఈ విచారణకు ప్రభుత్వం తరఫున హాజరైన గైడర్ తిలక్‌పై అభియోగాన్ని సమర్పించాడు. ఒక సంవత్సరం కాలానికి తిలక్ నుండి రు. 50,000ల పూచీకత్తును తీసుకోవలసిందిగా నాయమూర్తిని కోరాడు. ఆ మొత్తం పూచీకత్తుగా ఇవ్వగల ఆర్థిక స్తోమతున్న సంపన్న మిత్రులు తిలక్‌కు వున్నట్లు ఆయన నివేదించాడు. తర్వాత జరిగిన విచారణలకు మహమ్మద్ ఆలీ జిన్నా తిలక్ తరఫున న్యాయవాది(బార్–ఎట్–లా)గా హాజరయ్యారు. నాటికి పూనా జిల్లా న్యాయమూర్తిగా జి.డబ్లు. హేచ్ వున్నారు. ప్రభుత్వానికి అనుకూలమైన ముగ్గురు సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిన్నింగ్ విచారించారు.

తిలక్ తన వుపన్యాసాల్లో అనేక మరాఠీ నుడికారాలను అలవోకగా వినియోగించాడు. జిన్నా తన క్రాస్ ఎగ్జామినేషన్‌లో 'అధికార వర్గం', ' దూర్తులు', 'బానిసత్వం'వంటి పదాలపై దృష్టి సారించారు. తిలక్ వుపన్యాసాల్లో కొన్ని విడివిడి భాగాలకు మాత్రమే అతి ప్రాధాన్యతనివ్వరాదని, మొత్తం వుపన్యాసాలను సంపూర్ణంగాను, స్వేచ్ఛగాను, నింపాదిగాను పరిశీలించాలని జిన్నా కోరాడు. ' హోం రూల్ లీగ్' పరిరక్షణే తిలక్ వుపన్యాసాల ధ్యేయమని జిన్నా తన వాదనలు విన్పించాడు. ' హోం రూల్ లీగ్'ను అడ్డం పెట్టుకుని బ్రిటీష్ ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలు చేయటమే తిలక్ ఉపన్యాసాల లక్ష్యమ'ని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరోపించారు. ఇక్కడి పౌర అధికారులు పాలనా వ్యవస్థపై గుత్తాధిపత్యం సాగిస్తున్నారని, అలాంటి వ్యవస్థ దేశానికి ప్రయోజనకరం కాదని, పార్లమెంట్ ద్వారా ప్రస్తుత చట్టాన్ని మార్పుచేయాలని మాత్రమే తిలక్ కోరుతున్నాడని జిన్నా తెలియజేశారు. తిలక్ ప్రభుత్వంపై అసంతృప్తిని రెచ్చగొట్టలేదని, నిందించలేదని, ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని కోర్టుకు విన్నవించారు. భారత అంతర్గత వ్యవహారాలన్నింటినీ అదుపు చేస్తున్న అధికార యంత్రాన్ని ప్రక్షాళన చేయటం ద్వారా వ్యవస్థలో మార్పు తేవటమే తిలక్ ఉద్దేశ్యమని జిన్నా వివరించారు. అలాంటి మార్పు కేవలం తెల్ల అధికారుల్లోనే కాదు, మొత్తం వ్యవస్థలోనే రావాలని తిలక్ కోరుతున్నట్లు జిన్నా తెల్పారు. తిలక్ మృదు స్వభావి. దక్షత గల రాజకీయవేత్త. అత్యంత క్రమశిక్షణాపరుడు. అలాంటి వ్యక్తిపై బ్రిటీష్ వారు తీవ్రమైన ద్వేషంతో శతృపూరితంగా వ్యవహరించటం సమంజసం కాదని ఉద్ఘాటించారు.

**❛❛తిలక్ తన వుపన్యాసాల్లో అనేక మరాఠీ నుడికారాలను అలవోకగా వినియోగించాడు. జిన్నా తన క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తూ తిలక్ వాడిన 'అధికార వర్గం', ' దూర్తులు', 'బానిసత్వం' వంటి కొన్ని విడివిడి పదాలకు మాత్రమే అతి ప్రాధాన్యత నివ్వరాదని, మొత్తం వుపన్యాసాలను సంపూర్ణంగాను, స్వేచ్ఛగాను, నింపాదిగాను పరిశీలించాలని కోరాడు. ' హోం రూల్ లీగ్' పరిరక్షణే తిలక్ వుపన్యాసాల ధ్యేయమని జిన్నా తన వాదించాడు. ❜❜**


బాల గంగాధర్ తిలక్

" ..ఆ ఉపన్యాసాలు ఇవ్వటంలో మీ వుద్దేశ్యం ఏమిటి ?" అని జిల్లా మేజిస్ట్రేట్ తిలక్‌ను ప్రశ్నించారు. అందుకు తిలక్ సమాధానం ఇలా వుంది : "హోం రూల్ అంశాన్ని పరిరక్షించటం, దాని అవసరాన్ని ప్రజలకు వివరించటం. దాన్ని సాధించే ఉత్తమ మార్గాన్ని అన్వేషించటమే నా ఉపన్యాసాల వుద్దేశ్యం." తిలక్ సత్ప్రవర్తకు హామీ ఇస్తూ, ఒక్కొక్కరు రు. 20,000ల వంతున ఇద్దరు పూచీకత్తు బాండ్లను సమర్పించాలని 1916 ఆగస్టు 12న జిల్లా మేజిస్ట్రేట్ వుత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిన్నా అభ్యంతరాలను మేజిస్ట్రేట్ తోసిపుచ్చారు.

**బొంబాయి హైకోర్టుకు నివేదన(అప్పీల్ )**

బొంబాయి హైకోర్టుకు తన కేసును నివేదించేందుకే తిలక్ నిర్ణయించారు. హైకోర్టులో కూడా తిలక్ తరఫు న్యాయవాదిగా జిన్నా హాజరయ్యారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ హాజరయ్యారు. న్యాయమూర్తులు సర్ స్టాన్లీ బ్యాచులర్, సర్ లల్లూభాయి షాలు వాద ప్రతివాదనలు విన్నారు. ఇరువురూ ఏక కాలంలో తీర్పులు వెలువరించారు. కానీ వేరువేరుగా తమ తీర్పులను రాశారు. ఐపిసి సెక్షన్ 124ఎ వెలుగులో పరిశీలించినపుడు, తిలక్ వుపన్యాసాల ప్రభావం రాజద్రోహపూరితంగా వుందా లేదా అన్నదే ప్రధాన అంశమని కోర్టు అభిప్రాయపడింది. బ్రిటీష్ ప్రభుత్వం పరాయి ప్రభుత్వమని, అది కేవలం తన ప్రయోజనాల కోసమే పనిచేస్తుందన్న ఆరోపణలుంటే అవి అభ్యంతరకరమని కోర్టు నిర్ధారించింది. కానీ ప్రత్యేక ప్రాధాన్యతగల్గి, సభికులను ప్రభావితం చేయగల భాగాలు మొత్తం వుపన్యాసంలోఎక్కడా లేవని కోర్టు నిర్ధారించింది.

**కేవలం భిన్నాభిప్రాయమే రాజద్రోహం అవుతుందా ?**

భారత్‌లోని రాజుగారి అధికారులు, చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వంలో భాగం కాబోరన్న జిన్నా వాదనలను కోర్టు తిరస్కరించింది. కోర్టు ఇలా అభిప్రాయపడింది :"...ఉపన్యాసాలను సంపూర్ణంగా చదవాలి. నిష్పాక్షికంగా వాటిని పరిశీలించాలి. అటు చక్రవర్తినిగాని, ఫిర్యాదుదారునిగాని ఇబ్బంది పెట్టరాదు. విడివిడి పదాలు, భాగాలకు ప్రాధాన్యత ఇవ్వడం కంటే మొత్తం ఉపన్యాసం కల్గించే ప్రభావంపై ప్రధానంగా దృష్టి సారించాలి. ఇలాంటి ఉపన్యాసాలను పరిశీలించేటపుడు వినియోగించిన భాషను కూడా పరిశీలించాలి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసంతృప్తిని రెచ్చగొట్టే సారాంశం వుందేమో గమనించాలి. అక్కడక్కడా కన్పించే కొన్ని అభ్యంతరకర వాక్యాలు, పరుష పదాల వద్దే పరిశీలకుడు ఆగిపోరాదు. సంకుచితమైన విమర్శనా దృష్టితో కాకుండా నిష్పాక్షిక స్ఫూర్తితో ఉపన్యాసాలను పరిశీలించాలి."

రాజకీయ అధికారంలో భారతీయుల భాగస్వామ్యం పెరగాలని, పరిపాలనా వ్యవస్థ భారతీయుల అధీనంలోకి రావాలన్నది తిలక్

స్వరాజ్య నినాదం లక్ష్యంగా వున్నదని స్పష్టమౌతున్నట్లు కోర్టు పేర్కొంది. ఆ విధమైన అభిలాషను వ్యక్తం చేయటం చట్ట వుల్లంఘన కాజాలదని కోర్టు ప్రకటించింది.

1916 నవంబరు 9న పూనా జిల్లా మేజిస్ట్రేట్ వుత్తర్వును బొంబాయి హైకోర్టు పక్కనపెట్టింది. జిల్లా కోర్టు ఆదేశానుసారం పూచికత్తు బాండ్లు సమర్పించివుంటే వాటిని తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. అదే రోజున బొంబాయి హైకోర్టు తీర్పును బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి టెలిగ్రాం ద్వారా పంపింది. ఆ తీర్పు సాక్ష్యాధారాలపై ఆధారపడి వుందని, చట్టం, న్యాయ సూత్రాల వెలుగులోనే చెప్పబడిందని, సహజ న్యాయ సూత్రాల వుల్లంఘనలు లేవని వారం రోజులు తర్వాత పార్లమెంట్‌లో లండన్ పౌరసభ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ తీర్పును పున:పరిశీలన కోసం రాజుగారి సలహా మండలి(ప్రీవి కౌన్సిల్")కి పంపవలసిన అవసరం లేదని ఆయన సిఫార్సు చేశారు.

ఈ పరిణామాలు ప్రభుత్వ వర్గాల్లో ఆందోళనలు సృష్టించాయి. తీర్పు కాపీతో పాటు, సంబంధిత పత్రాలను వైస్రాయి కార్యాలయానికి పంపారు. ఫలితాలు చీకాకు కల్గించే విధంగా వున్నట్లు ' క్రిమినల్ ఇంటెలిజన్స్ డైరెక్టరు' అభివర్ణించారు. పూచీకత్తు తీసుకోవటంపై జిల్లా కోర్టు విచక్షణలో, హైకోర్టు అంత తేలిగ్గా జోక్యం చేసుకుని వుండాల్సిందికాదని ఆయన అభిప్రాయపడ్డారు. తీర్పులు విమర్శకు తావిస్తున్నాయని, ఫలితాలు దురదృష్టకరంగా వున్నాయని, అలాంటి తీర్పులు వెలువరించకుండా వుంటే సమంజసంగా వుండేదన్న అభిప్రాయంతో ఆయన ఏకీభవించారు.

రాజద్రోహం చట్టాన్ని సవరించబూనటం, భారత్ స్వయంకృత అపరాధం. ఈ కేసు విచారణలోని ప్రతిదశలోనూ, నాటకంలోని పాత్రల్లా న్యాయవ్యవస్థ, ప్రభుత్వంలోని అధికారులు పూర్తిగా నిమగ్నమై పనిచేసినట్లు పై ఘటనలు తెల్పుతున్నాయి. ఆ అనుభవాల నుండి పోలీసు అధికారులు ఒక ముఖ్యమైన గుణపాఠాన్ని నేర్చుకోవాలి. చరిత్రను, చట్టం వుద్దేశ్యాన్ని/అర్థాన్ని అవగాహన చేసుకోకుండా ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శిస్తున్న పౌరులపై కేసులు బనాయించేందుకు కొందరు పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుత సిఆర్‌పిసిలోని సెక్షన్ 108 ప్రకారం విచారణ సందర్భంగా సత్ప్రవర్తనకు హామీనిచ్చేందుకు పూచీకత్తును పొందవచ్చన్న అంశం కూడా వారికి తెలియక పోవటం దురదృష్టకరం.

**(అనువాదం: వై సిద్ధయ్య)**

# అంతరిక్ష ప్రయివేటీకరణకు పోటీ

**(17వ పేజీ తరువాయి)**

ఎత్తుకు వెళ్లి వచ్చాడు. ఆయన భూమి చుట్టూ 108 కిలో మీటర్లు పరిభ్రమించి వచ్చాడు.

అంటే మోయలేనన్ని డబ్బు సంచులతో తులతూగుతున్న ఈ శతకోటీశ్వరులు సాధించారు అని చెప్పుకుంటున్నది 1960వ దశకంలో సాధించిన సాస్త్ర, సాంకేతిక, సామాజిక విజయాలకన్నా తక్కువే గనుక ఇది వారిది వెనుకడుగుగా చెప్పడం జరుగుతోంది. 1969-72 మధ్య జరిగిన చంద్రలోక యాత్రలతో పోలిస్తే ఇంకా వెనకడుగు.

**ప్రపంచ ఉమ్మడి ఆస్తిని వ్యక్తుల పరం చేస్తున్నారు**

ఈ మొత్తం వ్యవహారంలో అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ప్రపంచ ప్రజల ఉమ్మడి ఆస్తిని కొద్ది మంది వ్యక్తుల అధిపత్యానికి అప్పగించడం విషాధకరమైన విషయం. అమెరికా ఇంకా జి7గా చెలామణి అవుతున్న సామ్రాజ్యవాద దేశాలు భూమిని అక్రమించుకున్నారు. దేశాలకు దేశాలనే తమ మధ్య పంచుకుని దోచుకున్నారు. 400 ఏళ్లుగా వాతావరణాన్ని అక్రమించుకుని కలుషితం చేశారు. ఖండాల మధ్య ఉన్న సముద్ర గర్భం ఎవరిదీ కాదని చెబుతూ తమ సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు చేస్తూ విలువైన ఖనిజాలను అన్వేషిస్తున్నారు. ఆ విధంగా సముద్ర గర్భాన్ని తమ స్వంతం చేసుకున్నారు. ఇప్పుడు అంతరిక్షాన్ని తమ ప్రయివేటు కంపెనీల వ్యాపార దోపిడీకి తెరవడం ద్వారా దాన్ని కూడా కార్పొరేట్‌లకు అప్పగిస్తున్నారు. బహుశా రానున్న కాలంలో అంతరిక్షం, చంద్రుడు, అంగారకుడు ఇతర గ్రహాలు, గ్రహశకలాల మీదికి కూడా ఈ ప్రయివేటు వ్యాపారులు డబ్బు సంచులతో దండెత్తి గ్రహాంతర సామ్రాజ్యాలను సృష్టించే అవకాశం లేకపోలేదు.

అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో ఈ డబ్బు సంచుల బాబులు పాత్ర ఏమీ లేదు. వీరు చేసిందల్లా డబ్బుతో సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుక్కోవడమే. ఈ డబ్బు కూడా వీరికి వచ్చిన వైనాన్ని పరిశీలిస్తే ఒక్కొక్కడూ జలగల్లాగా మానవ రక్తాన్ని పిండుకుని సంచులు నింపుకున్నారని తెలుస్తుంది. ఉదాహరణకు బెజోస్ అమెజాన్ సంస్థనే తీసకోండి అమెరికాలో ఆ సంస్థలో పనిచేసే కార్మికులను కరోనా మహమ్మారి కాలంలో కూడా బలవంతంగా పనిచేయించి అనేక మంది మృతికి కారణమయ్యాడు. అదే సమయంలో కరోనా కాలంలో ఆన్-లైన్ వ్యాపారాన్ని పెంచుకోవడం వల్ల అతని ఆస్తి 21,200 కోట్ల డాలర్లకు (సుమారు రూ 16 లక్షల కోట్లకు) పెరిగిపోయింది. కార్మికులకు మాత్రం ఒక్క పైసా జీతం పెంచలేదు. బెజోస్ ఆన్-లైన్ వ్యాపారానికి కార్మికులు అవసరం గనుక బలవంతంగా పనిచేయించుకున్నాడు, బ్రాన్సన్ మూడు మాసాల పాటు జీతాలివ్వకుండా ఇంటికి పంపేశాడు. కరోనా వల్ల నష్టపోయిన కార్పొరేట్ కంపెనీలకు బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించిన 35,000 కోట్ల పౌండ్ల (సుమారు రూ. 36 లక్షల కోట్లు) ఆర్థిక సాయంలో కొంత భాగాన్ని బ్రాన్సన్ స్వాహా చేశాడు. కరోనా మహమ్మారి కాలంలో అదనంగా 100 కోట్లకు పైగా ప్రజలు పేదరికంలోకి పోతే ప్రపంచంలోని శతకోటీశ్వరులు ఉమ్మడి ఆస్తి 8 లక్షల కోట్ల డాలర్ల నుండి ఒక్కసారిగా 13.1 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ 980 లక్షల కోట్లకు) పెరిగిపోయింది.

ఇలా ప్రజల సొమ్మును దిగమింగిన ఈ బేహారులు తరతరాలుగా ప్రపంచ వ్యాపితంగా లక్షలాది మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు అంతరిక్ష విజ్ఞాన రంగంలో సాధించిన విజయాలను తమ సొంతం చేసుకుని గ్రహాంతర సామ్రాజ్యవాదాన్ని నెలకొల్పాడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ దోపిడీకి కార్పొరేట్ మీడియా ఏ ముద్దు పేరైనా పెట్టనీ గాక ప్రజా దృష్టిలో చూసినప్పుడు ఇది కచ్చితంగా తిరోగమన చర్యే. ఈస్టిండియా కంపెనీ, ఇతర ఐరోపా కంపెనీలు వలస దేశాలను ఆక్రమించుకోడానికి సముద్ర మార్గాలను స్వాధీనం చేసుకున్న క్రమంతో దీన్ని పోల్చవచ్చు. అందువల్లనే పురోగామి శక్తులు అంతరిక్ష ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి, ప్రతిఘటించాలి. ❊

# భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు

**(2వ పేజీ తరువాయి)**


చేయబడాలి. కమ్యూనిస్టు పార్టీ లేవనెత్తుతున్న భాషాప్రాతిపదికన రాష్ట్రాలు విభజించ బడాలన్న డిమాండ్, ఎంతో హేతుబద్ధమైనది. దీని వలన పరిపాలన ఆయా ప్రాంత ప్రజల మాతృభాషలో కొనసాగి ప్రజలకు సౌలభ్యం కలుగుతుంది.

"రాష్ట్రాలను విభజిస్తే దేశ ఐక్యతకు, సురక్షితతకి భంగం వాటిల్లుతుందనేది భాషా


''పైగా భారతదేశంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి సరిసమానంగా లేదనే అంశాన్ని విస్మరించలేము. అందువలన వెనుకబడిన ప్రాంతాలలోని ప్రజలను తమ వెనకబాటుతనం వలన దేశ పరిపాలనలో భాగస్వాములు కాకుండా ఉండాలనటం సరికాదుబీ ఇలా వాదించడం అంటే అర్ధం కేవలం అభివృద్ధి చెందిన ప్రాంత ప్రజలకే దేశ రాజకీయ, ఆర్థిక, పరిపాలనల లో

మాట్లాడితే దానిని ఆ భాష మాట్లాడే రాష్ట్రంలో కలపాలి.

''ఈ పనిని ఎంత సునిశితంగా చేసినప్పటికీ ఇంకా కొంతమంది మైనారిటీ భాషలు మాట్లాడేవారు మెజారిటీ భాష మాట్లాడే రాష్ట్రాలలో మిగిలి పోతారు. అందువలన మైనారిటీ భాష మాట్లాడే వారికి సాధ్యమైనంత వరకు వారి మాతృ భాషలో విద్య నేర్చుకునే అవకాశం కల్పించాలి. దీనిని ఆయా రాష్ట్రాలకే వదిలి వేయాలి. అప్పుడే ఆ ప్రాంతాలలో విద్వేషాలు అనైక్యత ఉండవు. వివిధ భాషలు మాట్లాడే వారి మధ్య సయోధ్య కుదురుతుంది.




1947కు ముంద భారత దేశంలోని రాష్ట్రాలు




1956లో భారత దేశంలోని రాష్ట్రాలు

ప్రయుక్త రాష్ట్రాలకు వ్యతిరేకంగా చేసే మరో వాదన. ఇదికూడా పూర్తిగా తప్పుడు వాదన అర్థరహిత మైనది కూడా. భాషాప్రయుక్త రాష్ట్రాలంటే తమ స్వంత సైన్యం, సైనిక వ్యవస్థగల రాష్ట్రాలుకాదు. సైనిక వ్యవస్థ అన్ని రాష్ట్రాలకు సంబంధించి కేంద్రం ఆధీనంలోనే ఉంటుంది. ఇప్పుడున్న పరిపాలనా వ్యవస్థ కొనసాగించినట్టయితే అది ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికే దోహద పడుతుంది. దేశాభివృద్ధికి ఏమాత్రం దోహద పడదు. పైగా కాంగ్రెస్ నాయకులుగాని, అఖిలభారత పార్టీల కమిటీల ప్రతినిధులు గాని 1947 వరకు స్వతంత్రపోరాట కాలమంతటిలో ఏ నాడూ, ఐక్యత, రక్షణ అంశాలను లేవనెత్తలేదు.

"ఇక ఆర్థికంగా నిలదొక్కుకోలేవనేది మరో అభ్యంతరకర అంశంగా ముందుకు తేబడుతున్నది. ఆర్థికంగా నిలదొక్కుకోవడం అన్నది కేంద్రం రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల విభజనపై ఆధారపడి ఉంటుంది. ఈ రోజు భారతదేశం లోని ఏ రాష్ట్రం కూడా సంవృద్ధిగా లేదు. కనీసం స్వయం పోషకంగా కూడా లేదు. అన్ని రాష్ట్రాల బడ్జెట్లు లోటు లోనే ఉన్నాయి.

భాగస్వాములయే హక్కుఉంటుందని అనడమే.

"ఈ పరిస్థితులలో భారత కమ్యూనిస్టు పార్టీ వెనకపడిన రాష్ట్రాలకు సహాయం అందించి వారా వెనుకబాటు తనం నుండి త్వరగా బయటపడేటట్టు చూడాల్సిన బాధ్యత కేంద్రందే అని నొక్కి చెప్పదలుచుకుంది. ఆ విధంగా వారు తమ వెనకబాటు తనం నుండి బయటపడి, దేశ మంతటితో సరి సమానం గా అభివృద్ధి చెందే అవకాశం కల్పించాలి. ఆవిధంగా చేసినట్టయితేనే దేశంలో వివిధ భాషలు మాట్లాడే ప్రజలలో ఒకరి పట్ల మరొకరికి భాతృ భావం కలుగుతుంది; కానీ వెనకపాటు తనం పేరుమీద కొన్ని ప్రాంతాల ప్రజలను ప్రజాతంత్రంగా అభివృద్ధిచెందదని కి దూరం చేయడం సరికాదుబీ ఇది విచ్ఛిన్నకర శక్తులు బలపడడానికి తోడ్పడుతుంది.

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ తోపాటు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఎల్లలు నిర్ణయించడానికి ఏ పద్ధతులు అవలంబించాలనేదానికి మేము ఈ కింది కొన్ని సూచనలు చేస్తున్నాము.

గ్రామాన్ని ఒక యూనిట్ గా తీసు కోవాలి. అందులో మెజారిటీ ప్రజలు ఏ భాష

"ఇలా రాష్ట్రాల సరిహద్దులు నిర్ణయించే క్రమంలో కొన్ని గిరిజన ప్రాంతాలు కూడా ఉండవచ్చు. ఇటువంటి గిరిజన ప్రాంతాలను వారి సంస్కృతి ఆధారంగా, పొరుగున ఉన్న భాషతో ఉన్న సంబంధాన్ని గుర్తించి పక్కనున్న ఒక రాష్ట్రంతో కలపాలి. ఆలా కలిపేటప్పుడు ఏ రాష్ట్రం తో కలిపితే వారు ఆర్థికంగా త్వరగా అభివృద్ధి చెందుతారో ఆ రాష్ట్రంతో కలపాలి. ఆ గిరిజన ప్రాంతాన్ని ఒక పరిపాలనకు అనువైన తహసీలుగానో, గ్రామంగానో, జిల్లాగానో లేదా ప్రాంతీయ విభాగంగానో గుర్తించి వారి స్థానిక లేదా ప్రాంతీయ స్వపరిపాలనకు అనువుగా ఉండేటట్టు చూడాలి.

"అందువలన భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ, రాష్ట్రాల పునర్విభజనకు ఏర్పాటు చేయబడ్డ కమిషన్, ప్రజలకు ఏ రకమైన ఆందోళనను కలిగించకూడదని, 1954 సెప్టెంబర్ కల్లా రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధించిన మధ్యంతర రిపోర్ట్ ను సమర్పించాలని, ముఖ్యంగా రాష్ట్రాల ఏర్పాటు భాషల ప్రాతిపదికనే జరగాలని సిఫారసు చేయాలని కోరుకుంటున్నది."

❊

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-08-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# నిరక్షరాశ్యత నిర్మూలనలో భారత పాలకుల వైఫల్యం



భారత దేశంలో నిరక్షరాస్యత నిర్మూలనకు నిత్యం చర్యలు తీసుకుంటున్నట్లు పాలకులు ఎన్నికబుర్లు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం ఈ రంగంలో పూర్తి వైఫల్యం కనిపిస్తోంది. నిరక్షరాశ్యత అనేది దేశాన్ని బ్రహ్మపుండులా పట్టిపీడిస్తూనే ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం భారత దేశంలో అక్షరాస్యత చాలా నెమ్మదిగా పెరుగుతోంది. వాస్తవానికి 2001-2011 దశకంలో 9.2 శాతంగా ఉన్న అక్షరాస్యత పెరుగుదల రేటు గత దశాబ్దంలో (20011-2021) తగ్గిపోయింది. గత రెండు సంవత్సరాలుగా కరోనా మహమ్మారి గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో చదువులను చట్టుబండులు చేసింది కనుక దీని ప్రభావం అక్షరాశ్యత మీద ఎక్కువగానే ఉంటుంది.

జనాభా లెక్కల ప్రకారం 2011లో 73 శాతం అక్షరాశ్యత ఉంటే 2017-18 నాటికి 77.7 శాతానికి పెరిగింది. ఇప్పుడు 81 శాతం ఉన్నట్లు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో అక్షరాశ్యతా రేటు 87.7 శాతం, గ్రామాల్లో 73.5 శాతం ఉంది. ఇందులో స్త్రీ,పురుషుల మధ్య లింగ అసమానత చాలా ఎక్కువగా ఉంది. 7 ఏళ్లు పైబడ్డ వారిని తీసుకుంటే పురుషుల్లో 84.7శాతం అక్షరాశ్యత ఉంటే మహిళల్లో 70.3 శాతం మాత్రమే ఉంది. అయితే ప్రస్తుతం బాలికల్లో అక్షరాశ్యత రేటు (11.8 శాతం) బాలురలో (6.9 శాతం) కాన్నా శీఘ్రంగా పెరుగుతోందని గణాంకాలు తెలుపుతుండడం సంతోషించదగ్గ విషయం.

అక్షరాశ్యత అంటే యునెస్కో చెప్పిన దాని ప్రకారం "అచ్చువేసిన, రాయబడిన సమాచారాన్ని గుర్తించగలిగి, అర్థం చేసుకోగలిగి, దాన్ని మార్చగలిగి, కొత్తదాన్ని సృష్టించగలిగి, కమ్యూనికేట్ చేయగలిగి, కంప్యూట్ చేయగలిగే సామర్థ్యం కలిగి ఉండడం". అయితే మన దేశంలో అయిదో తరగతి చదువుకునే పిల్లల్లో కూడా ఈ సామర్థ్యాలు లేకపోయినా పేరు రాయగలవారినందరినీ అక్షరాశ్యులుగా గురించేస్తున్నారు.

ప్రపంచ సగటు అక్షరాశ్యత (86.3 శాతం) కన్నా భారత దేశ సగటు అక్షరాశ్యత (81 శాతం) చాలా తక్కువగా ఉంది. మన కన్నా మన పొరుగు దేశాలైన మ్యాన్మార్ (93.7 శాతం) శ్రీలంక (92.6 శాతం) చైనా (96.4 శాతం) లతో అక్షరాశ్యతలో ముందున్నాయి. మన దేశంలో అత్యధిక అక్షరాశ్యత కేరళలో (96.2 శాతం) ఉంది. అత్యల్ప రేటు ఆంధ్ర ప్రదేశ్‌లో (66,4 శాతం) ఉంది. మొన్నటి వరకు మనకన్నా వెనుకబడిన బీహార్‌కూడా నేడు 70.9 శాతం అక్షరాశ్యతతో మన కన్నా ముందుపీఠిన ఉంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు అమలు చేస్తున్న నూతన విద్యా విధానం వల్ల డ్రాపవుట్లు పెరిగి అక్షరాశ్యత మరింత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు.......................................

వీధి.......................................

గ్రామం.......................................

మండలం లేదా పట్టణం.......................................

జిల్లా.......................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.16, No.3. Published on August 1, 2021